అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 13-7-2023 www.navatelangana.com

సంపుటి : 9 సంచిక : 193 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 12 పేజీలు వెల : 6.50



## కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దందాను అరికట్టాలి

### ప్రభుత్వ విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలి

- వామపక్ష విద్యార్థి సంఘాల డిమాండ్
- రాష్ట్ర వ్యాప్త బంద్ విజయవంతం
- మంత్రుల నివాస సముదాయాల ముట్టడి ఉద్రిక్తం
- నాయకులను అరెస్టు చేసిన పోలీసులు
- ఖమ్మంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దౌర్జన్యం

అరెస్టులపై నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు

వివరాలు 11లో..

## మరోసారి విద్వేష ప్రసంగాలు

### ఢిల్లీ స్టేడియం వేదికగా విషం చిమ్మిన హిందూ మతోన్మాదులు



**న్యూఢిల్లీ :** మైనారిటీ ముస్లింలపై హిందూ మతోన్మాద శక్తులు మరోసారి విషం చిమ్మాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలోని తల్కతొరా స్టేడియం ఇందుకు వేదికైంది. విహెచ్‌పీ నేత తొగాడియా సహా పలువురు నాయకులు ఆ స్టేడియంలో రెచ్చగొడుతూ ఉపన్యాసాలు చేశారు.

'మనం పారిపోకూడదు లేదా చనిపోకూడదు. మన కాలును వారి ఛాతిపై పెట్టి గుణపాఠం చెప్పాలి' అని వీహెచ్‌పీ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా చెప్పారు. సభకు హాజరైన మతోన్మాదులు తొగాడియా ప్రసంగాన్ని హర్షధ్వానాలతో స్వాగతించారు. దేశంలో ముస్లింల జనాభాను పెరగనివ్వబోమంటూ నినాదాలు చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వంపై తొగాడియా విశ్వాసం ప్రకటించారు. రామమందిర నిర్మాణం జరుగుతోందని, ఉమ్మడి పౌరస్మృతి బిల్లు ఒక రూపం సంతరించుకుంటోందని, లోక్‌సభ ఎన్నికలకు ముందే జనాభా నియంత్రణ బిల్లు కూడా సిద్ధమవుతుందని ఆయన తెలిపారు.

ఈ నెల 9న స్టేడియంలో అంతరక్షత్రియ హిందూ పరిషత్ ఏర్పాటుచేసిన విరాట్ హిందూ సమ్మేళన్‌లో కరడుకట్టిన హిందూత్వ వాదులు ప్రసంగిస్తూ ముస్లింలు జిహాద్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. హిందువులు పోరాడితే జిహాదీ పరాజయం పాలవుతుందని చెప్పారు. అయితే మానవత్వం, క్షమాగుణం హిందువుల బలహీనతలని తెలిపారు. ఎవరైనా మన చెంప మీద కొడితే కొట్టిన చేతులు నరకాలని సమీక్షా సింగ్ పిలుపునిచ్చారు. ముస్లింలను పరోక్షంగా ప్రస్తావిస్తూ భారత లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను పునర్నిర్మించాలన్నది వారి దురుద్దేశపూరిత లక్ష్యమని చెప్పారు. అయితే అఖండ హిందూ భారత్ ఏర్పాటు మన లక్ష్యమని హిందువులను ఉద్దేశించి అన్నారు.

# పల్లెలు కంపు కొడుతున్నాయ్

## ఆ పనికెవ్వరూ రావట్లేదు


### పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

- సమ్మె విరమించేలా చూడండి
- తీర్మానాలు చేస్తున్న గ్రామ పంచాయతీలు
- అధికారులకు, కలెక్టర్లకు సర్పంచుల లేఖలు
- ప్రమాదాల బారిన తాత్కాలిక సిబ్బంది

**'గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉన్నారు. పల్లెలు కంపుకొడుతున్నాయి. అధికారులేమో ప్రత్యామ్నాయంగా తాత్కాలిక సిబ్బందిని పెట్టి పనిచేయించాలని ఆదేశిస్తున్నారు. ఊర్లల్లోనేమో ఆ పని చేసేందుకు ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదు. ఒక్కరిద్దరు ముందుకొచ్చినా రోజుకు వెయ్యి రూపాయల దాకా అడుగుతున్నరు. అంత ఇచ్చే స్థితిలో పంచాయతీలు లేవు. దయచేసి గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడండి. వారిని వెంటనే విధుల్లో చేరేలా చూడాలని మనవి చేసుకుంటాము' అని నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం యన్మనబెట్ల సర్పంచి ఎంపీడీఓకు లేఖ రాశారు. అలాంటి అంశాలతోనే నల్లగొండ జిల్లాలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన నేలకొండపల్లి సర్పంచి కుంభం శ్రీనివాస్‌గౌడ్ ఏకంగా ఆ జిల్లా కలెక్టర్‌కే లేఖ రాశారు. ఆ పంచాయతీలోని కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ తీర్మానం చేశారు. మరోవైపు అక్కడక్కడా నియమించిన తాత్కాలిక సిబ్బంది ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ కార్మికులను పిలిచి చర్చించాలి.. సమస్యలను పరిష్కరించాలి అనే సోయి మరిచి రాష్ట్ర సర్కారు వ్యవహరిస్తున్నది. గత సమ్మెల సందర్భంగా వ్యవహరించిన ఒంటెద్దు పోకడనే ప్రదర్శిస్తున్నది. సర్కారు ఇట్లాగే వ్యవహరిస్తే పోరాటాన్ని ఉధృతం చేస్తామనీ, చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తామని జేఏసీ హెచ్చరిస్తున్నది.**



చేత్త ఎత్తుతున్న సర్పంచ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 12,769 గ్రామపంచాయతీలున్నాయి. రాష్ట్ర సర్కారు జీతాలు చెల్లిస్తున్న లెక్కల ప్రకారం 36,500 మంది గ్రామపంచాయతీ కార్మికులున్నారు. కానీ, 50 వేలకుపైగా కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 90 శాతానికిపైగా దళితులే ఉన్నారు. మోరీలు ఎత్తిపోయడం, చెత్త సేకరించడం, తడి, పొడి చెత్తలను వేరుచేయడం, కంపోస్టు ఎరువు తయారీ, రోడ్లు ఊడ్చటం, మొక్కలకు నీళ్లు పట్టడం, కుక్కలు, పిల్లులు చనిపోతే తీసుకెళ్లి ఊరుబయట పడేయటం లాంటి పనులెన్నింటినో చేస్తున్నారు. ఒక్కరి పేరుతో వస్తున్న రూ.9,500 వేతనాన్ని ఇద్దరు, ముగ్గురు పంచుకుంటున్నారు. దీంతో వారికి వేతనం నాలుగైదువేల రూపాయలకు మించడం లేదు. అంటే రోజుకు వారీ కూలి రూ.200 కూడా గిట్టడం లేదు. దీంతో పూటగడవటం కష్టమవుతున్నది.

జీవో నెంబర్ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లకు రూ.19,500 ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ ...5లో

### తాత్కాలికం..ప్రమాదభరితం

పంచాయతీ కార్మికుల సమ్మె పట్ల రాష్ట్ర సర్కారు కఠినంగా వ్యవహరిస్తున్నది. కొన్ని గ్రామాల్లో ప్రత్యామ్నాయ సిబ్బందికి రోజువారీగా ఎక్కువ కూలీ ఇస్తామని చెప్పి పనుల్లోకి తీసుకుంటున్నారు. అయితే, ఆ పనుల పట్ల అవగాహన లేని వాళ్లు ప్రమాదాల బారిన పడుతున్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం దేశాయిపేటలో తాత్కాలిక సిబ్బంది అయిన నల్లవెల్లి సురేశ్ ట్రాక్టర్‌ను సైడ్‌కాలువలో పడేశాడు. దీంతో అతని ఛాతీకి బలమైన గాయం అయింది. అతన్ని హుటాహుటిన హన్మకొండ ఆస్పత్రికి తరలించారు. ఆదిలాబాద్ జిల్లా వాంకిడి మండలం చౌహాన్‌గూడలోనూ తాత్కాలిక సిబ్బందిలో ఒకరు కరెంట్‌షాక్‌కు గురయ్యాడు. అతని పరిస్థితి విషమంగా ఉంది. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కృష్టాపురం గ్రామంలో డ్రైవర్ ట్రాక్టర్‌ను చెరువులోకి తీసుకెళ్లాడు. ఇవి కొన్ని మాత్రమే. పనిపై అవగాహన లేని తాత్కాలిక సిబ్బందితో ప్రమాదాలు కోకొల్లలుగా జరుగుతున్నాయి.





## మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాల్సిందే

### చాకిరీకేనా.. పర్మినెంట్‌కు వాళ్ళ అర్హులు కారా?

- ఉద్యమ సమయంలో కేసీఆర్ ఇచ్చిన హామీ నెరవేర్చాలి
- కార్మికుల కష్టార్జితంతోనే తెలంగాణకు పేరు, పట్టణాలకు అవార్డులు
- హక్కులు కాలరాస్తున్న ప్రధాని మోడీకి గద్దెదిగే రోజులు దగ్గరపడ్డయ్ : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- మున్సిపల్ కమిషనర్, డైరెక్టరేట్ వద్ద భారీ ధర్నా
- వేలాదిగా తరలొచ్చిన కార్మికులు, వర్షంలోనూ ఆగని పోరు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'పట్టణాల్లో చెత్త ఊడుస్తున్నాం..కాల్వల్లోని మురుగు తీస్తున్నాం. ట్రాక్టర్లలోకి చెత్త ఎత్తుతున్నాం. పట్టణాలను శుద్ధి చేస్తున్నాం. ఢిల్లీ, గల్లీ నుంచి ఎవరొచ్చినా ఆ ప్రాంతాన్ని అలంకరిస్తున్నాం. మొక్కలు నాటి వాటిని రక్షిస్తున్నాం. అర్ధరాత్రి నుంచే పనిచేస్తూ ప్రజలు లేచేసరికే పట్టణాలను అద్దం లెక్క చేస్తున్నాం. మా కష్టార్జితం వల్లనే దేశంలోనే తెలంగాణకు మంచి పేరు వచ్చింది. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులొచ్చినయ్. ఇంత జేస్తున్నా మున్సిపల్ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు పట్టరు?' అని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ నిలదీశారు. 'గొడ్డు చాకిరీకేమో మున్సిపల్ కార్మికులా? పర్మినెంట్‌కు అర్హులు కాదా? ఉద్యోగులకు వేతనాలు పెంచుతరు? సఫాయోళ్లకు ముష్టివేస్తరా? వాళ్లలెక్కకాకపోయినా కనీస వేతనానికైనా నోచుకోవడానికి అర్హులు కారా?' అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ ధర్నా శాంపిల్ మాత్రమేననీ, మున్సిపల్ కార్మికుల జీతాలు పెంచి పర్మినెంట్ చేయకపోతే ...11లో

## మోడీ ఓ నియంత

### హిట్లర్‌ను మించి ప్రవర్తిస్తున్నారు

- రాహుల్‌గాంధీపై బీజేపీ సర్కారు కక్షసాధింపు చర్యలు
- సత్యాగ్రహ మౌన దీక్షలో కాంగ్రెస్ నేతల ఆగ్రహం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రధాని మోడీ ఓ నియంతలా వ్యవహరిస్తున్నారని టీపీసీసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. హిట్లర్‌ను మించి ఆయన ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. రాహుల్‌గాంధీపై బీజేపీ సర్కారు కక్షసాధింపు చర్యలకు నిరసనగా ఏఐసీసీ పిలుపుమేరకు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో బుధవారం సత్యాగ్రహ మౌన దీక్షను చేపట్టారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేశ్ కుమార్‌గౌడ్, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ పీసీసీ మాజీ అధ్యక్షులు శైలజానాథ్, ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, పొన్నాల లక్ష్మయ్య, మల్లు రవి, పొన్నం ప్రభాకర్, రాజయ్య, కోదండరెడ్డి, సునీతారావు, చామల కిరణ్ కుమార్ రెడ్డి, సంగిశెట్టి జగదీష్, కుసుమ కుమార్‌తోపాటు డీసీసీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల చైర్మెన్లు, అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో దేశ ప్రజలను ఐక్యం చేస్తుంటే, బీజేపీ ప్రభుత్వం బెంబేలెత్తున్నదని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై తమ పార్టీపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఈ రెండు పార్టీలు లోపాయకారి ఒప్పందం చేసుకున్నాయని తెలిపారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ బలపడుతున్న తరుణంలో బీజేపీ ఒక కుట్ర పూరితంగా రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేసిందన్నారు. బీజేపీ వైఖరి ఇలాగే ఉంటే దేశ ప్రజలు సరైన బుద్ధి చెవుతారని హెచ్చరించారు. పార్టీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. చిన్న తప్పుకు రెండేండ్ల శిక్ష వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రచార ...11లో

## అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు

### వారం రోజుల్లో పూర్తి...



- 15 రోజుల్లోగా డిప్యూటీ సివిల్, సివిల్ సర్జన్లకు...
- నెల రోజుల్లో టీవీవీపీ నర్సులకు కూడా ప్రమోషన్లు : అధికారులకు మంత్రి హరీశ్ రావు ఆదేశం
- అడిషనల్ డీఎంఈ పదోన్నతి వయోపరిమితి 64 ఏండ్లకు పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలోని పలు విభాగాలు, పలు కేడర్లలో పనిచేస్తున్న వారికి నిర్దేశించిన వ్యవధిలో పదోన్నతులను కల్పించాలని ఆ శాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. బోధనాస్పత్రుల్లో ...11లో

## యమున ఉగ్రరూపం

### ఢిల్లీలో ఉధృతంగా ప్రవహిస్తున్న నది

- 45 ఏండ్ల తర్వాత ప్రమాదకర స్థాయికి
- అధికారులతో ఢిల్లీ సీఎం అత్యవసర సమావేశం
- ముందు జాగ్రత్త చర్యగా 144 సెక్షన్ విధించిన నగర పోలీసులు

వివరాలు 5లో..





## రైతులు ఆలోచించుకోవాలి

### ధరణి రద్దన్నరు...మూడు గంటల కరెంట్ చాలన్నరు : మంత్రి కేటీఆర్ ట్వీట్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'కాంగ్రెస్ నోట..రైతులకు రెండో ప్రమాద హెచ్చరిక! కాంగ్రెస్ వస్తే... నిన్న ధరణి తీసేస్తం అన్న రాబందు నేడు మూడు గంటల కరెంట్ చాలు అంటున్నడు. నాడు వ్యవసాయం దండగ అన్నడు చంద్రబాబు..నేడు మూడుపూటలు దండగ అంటున్నడు ఛోటా చంద్రబాబు. మూడు ఎకరాల రైతుకు.. మూడుపూటలా కరెంట్ ఎందుకు అనడం..ముమ్మాటికీ సన్న చిన్నకారు రైతును అవమానించడమే' అని మంత్రి కేటీఆర్ విమర్శించారు. రేవంత్ వ్యాఖ్యలకు కౌంటర్‌గా బుధవారం ఆయన ట్వీట్ చేశారు. కాంగ్రెస్‌కు ఎప్పుడూ.. చిన్నకారు రైతు అంటే చిన్నచూపు, సన్నకారు రైతు అంటే సవతిప్రేమ అని ఎద్దేవా చేశారు. నోట్లు తప్ప... రైతుల పాట్లు తెల్వని రాబందును నమ్మితే రైతు నోట్లో మట్టికొట్టుడు ఖాయం.. అన్నదాత నిండా మునుగుడు పక్కా అని ఘాటు విమర్శలు చేశారు. నాడు.. ఏడు గంటలు ఇవ్వకుండా ఎగ్గొట్టిన కాంగ్రెస్, నేడు ఉచిత కరెంట్‌కు ఎగనామం పెట్టేందుకు కుట్రలు చేస్తున్నది. మూడు గంటలతో మూడెకరాల పొలం పారించాలంటే బక్కచిక్కిన రైతు బాహుబలి మోటార్లు పెట్టాలన్నారు. అరికాలిలో మెదడు ఉన్నోళ్లను నమ్ముకుంటే రైతుల బతుకు ఆగమేనని, మరోసారి రాబందు మూడు గంటల మాటెత్తితే..రైతుల చేతిలో మాడు పగలడం ఖాయమన్నారు. 'తెలంగాణ రైతన్నలకు ఇది పరీక్షా సమయం! రైతును రాజును చేసే మనసున్న సీఎం కేసీఆర్ కావాలా? మూడు గంటలు చాలన్న మోసకారి రాబందు కావాలా? తెలంగాణ రైతుల తేల్చుకోవాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు.

## పసలేని వాదనలతో కాలయాపన

### ఈడీ చీఫ్‌ను కొనసాగించేందుకు తంటాలు





**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు నుండి ఎదురు దెబ్బలు తగిలినప్పటికీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధిపతి ఎస్‌కే మిశ్రాను పదవిలో కొనసాగించేందుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం విశ్వప్రయత్నం చేస్తోంది. ఇందుకోసం గత రెండు సంవత్సరాలుగా సర్వోన్నత న్యాయస్థానంలో పసలేని వాదనలు వినిపిస్తోంది. తాజాగా ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)పై సమీక్ష చేయాల్సి ఉన్నదని, ఇందులో మిశ్రా కీలక వ్యక్తి అని, కాబట్టి ఆయన పదవీకాలాన్ని పొడిగించాల్సిన అవసరం ఉన్నదని వాదించింది. ఎఫ్ఏటీఎఫ్ అనేది అంతర్జాతీయ ఉగ్రవాదులకు అందుతున్న ఆర్థిక సాయంపై కన్నేసి ఉంచే విభాగం. ఎఫ్ఏటీఎఫ్‌పై సమీక్ష ఈ సంవత్సరం ప్రారంభంలో మొదలైంది. వచ్చే సంవత్సరం చివరి వరకూ అది ...11లో

### బీజేపీ చేతిలో కీలుబొమ్మ

- అది విశ్వసనీయత కోల్పోయింది
- ఈడీపై కాంగ్రెస్ ఎంపీ సుర్జేవాలా మండిపాటు



వివరాలు 11లో..

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి

## అసెంబ్లీలో ప్రకటించిన కాలం నుంచి రూ.2 వేలు చెల్లించాలి

- కొత్త మెనూ, గుడ్డుకు బడ్జెట్‌ను పెంచాలి
- సీఎం కేసీఆర్‌కు జూలకంటి లేఖ



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రకటించిన కాలం నుంచి రూ.రెండు వేలు చెల్లించాలని కోరారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలనీ, కొత్త మెనూ, గుడ్డుకు బడ్జెట్‌ను పెంచాలనీ, చట్టబద్ధమైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు బుధవారం ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు గతేడాది మార్చి 15న అసెంబ్లీలో వేతనం రూ.రెండు వేలు పెంచుతున్నట్టు ప్రకటించారని గుర్తు చేశారు. అనేక విజ్ఞప్తుల మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి మూడున జీవో నెంబర్ ఎనిమిదిని జారీ చేశారని తెలిపారు. కానీ అసెంబ్లీలో ప్రకటించిన కాలం నుంచి పెంచిన వేతనం ఇస్తున్నట్టు ఆ జీవోలో స్పష్టం చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన వేతనం అమలు చేయకపోగా, ఇస్తున్న రూ.వెయ్యి కూడా పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడం వల్ల కార్మికులు అప్పులపాలవుతున్నారని వివరించారు. ప్రభుత్వం ఇస్తున్న బడ్జెట్ సరిపోవడం లేదంటూ మొత్తుకుంటుంటే కొత్తగా కిచిడీ, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, వెజిటబుల్ బిర్యానీ, వారానికి మూడు గుడ్లు పెట్టాలంటూ మెనూ రూపొందించారని తెలిపారు. అదనపు బడ్జెట్ కేటాయించకుండా నిర్ణయించిన మెనూ, గుడ్డు పెట్టడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఈ పథకానికి బడ్జెట్ తగ్గించడం, మూడు గుడ్లు పెట్టలేదన్న సాకుతో వేధింపులున్నాయని తెలిపారు. గుడ్డు పెట్టకపోయినా స్వచ్ఛంద సంస్థలకు రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి, గండిపేట, మొయినాబాద్, రాజేంద్రనగర్ మండలాల్లో 190 పాఠశాలలను అక్షయపాత్రకు ఇవ్వాలని నిర్ణయించారని పేర్కొన్నారు. కార్మికులకు ఉపాధి లేకుండా చేయడం దారుణమని విమర్శించారు. దీంతో కార్మికులు ఆందోళనతో ఉన్నారని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలనీ, గుర్తింపు కార్డులివ్వాలనీ, కాటన్ బట్టలివ్వాలనీ, వంట షెడ్లు, పాత్రలు, ఇతర మౌలిక వసతులు కల్పించాలనీ, అక్రమ తొలగింపులు అరికట్టాలనీ, రాజకీయ వేధింపుల్లేకుండా చూడాలని కోరారు.

# కనీస వేతనాల జీవోను సవరించాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్
- కొనసాగుతున్న సీఐటీయూ జీపుజాతా




**నవతెలంగాణ - కుత్బుల్లాపూర్**

కార్మికులకు కనీస వేతనాలు సవరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్ డిమాండ్ చేశారు. చిన్న మధ్య తరగతి పరిశ్రమల్లో కనీస వేతనాల జీవో సవరించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ నెల 4 నుంచి 13 వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపు జాతా బుధవారం హైదరాబాద్ జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతానికి చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్ కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. కార్మికుల సమస్య పరిష్కారం కోసం ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, కాంట్రాక్టు కార్మికుల చట్టబద్ధ సౌకర్యాలు ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వలస కార్మికులకు 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం ప్రకారం హక్కులు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జి.అశోక్ నాయకులు, శ్రీనివాస్, సందీప్, దేవదానం, కరుణాకర్, మల్లారెడ్డి, వెంకయ్య, రమణ పాల్గొన్నారు. అనంతరం జాతా బాలానగర్ పారిశ్రామిక ప్రాంతం, సనత్‌నగర్ క్లస్టర్‌లో సాగింది. పలు పరిశ్రమల కార్మికులను నేతలు కలిసి సమస్యలు తెలుసుకున్నారు.

# రోడ్డు కోసం..ఎన్నిక బహిష్కరణాస్త్రం..!

## కుండిషేకుగూడ వాసుల ఏకగ్రీవ తీర్మానం • రోడ్డు కోసమే ఏడాదిన్నర కిందట 9 రోజులు పోరాటం

### హామీ పొందినా కనిపించని ఫలితం

- కాగితాలకే పరిమితమైన అధికారుల ప్రతిపాదనలు

**అదో మారుమూల ఆదివాసీ పల్లె. అడవి తల్లి ఒడిలో ప్రకృతి అందాల నడుమ ఉన్న ఈ పల్లెకు రోడ్డు సౌకర్యం లేదు. అత్యవసర పరిస్థితిలో అస్పత్రికి వెళ్లాలన్నా అవస్థలు పడాల్సిందే. ఈ దారి తిప్పలు ఎన్నాండ్లు భరించాలని భావించిన ఆ గ్రామస్తులు పోరాటానికి నడుం బిగించారు. సీపీఐ(ఎం) అండతో ఏడాదిన్నర కిందట గ్రామం నుంచి పిల్లాపాపలతో కాలినడకన కలెక్టరేట్‌కు వచ్చి తొమ్మిది రోజులపాటు నిరవధిక దీక్ష కూడా చేశారు. ఆందోళనకు దిగొచ్చిన అధికారులు అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి.. నీటి సమస్యను మాత్రమే తీర్చారు. రోడ్డు నిర్మాణాన్ని విస్మరించారు. అధికారుల ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. తమ సమస్యను తీర్చకుంటే రానున్న అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం కుండిషేకుగూడ వాసుల దీనస్థితిపై నవతెలంగాణ ప్రత్యేక కథనం.**





నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి
(ఎమ్.సురేష్)

ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల గాదిగూడ మండలంలోని కుండిషేకుగూడ వాసులు ఇప్పటికీ రోడ్డు సౌకర్యానికి నోచుకోలేదు. కనీసం తాగునీరు, అంగన్‌వాడీ భవనంతోపాటు ఆ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో బయటి ప్రపంచంతో సంబంధాలు కోల్పోతున్నారు. గాదిగూడ మండల కేంద్రం నుంచి కుండిషేకుగూడ వెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సి ఉంటుంది. ఈ గ్రామంతోపాటు చిన్నకుండి, మారుతిగూడ, కొలాంగూడ పల్లెలకు సైతం ఈ రోడ్డు గుండానే వెళ్లాల్సి ఉంటుంది. మండలంలోని పిప్రి నుంచి తారురోడ్డు ఉండగా.. అక్కడి నుంచి కుండిషేకుగూడ వరకు అటవీ ప్రాంతం గుండా ఏడు కిలోమీటర్ల వరకు మొరం రోడ్డు ఉంది. అది కూడా గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్నదే. మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలంలో నీటి ప్రవాహంతో పలుచోట్ల తెగిపోతుండటంతో ఈ దారి నుంచి వెళ్లడం కష్టంగా మారుతుంది. బురదమయంగా ఉండటంతో కాలినడకన కూడా వెళ్లడం కష్టంగా ఉంటుంది. అత్యవసర పరిస్థితిలో అస్పత్రికి వెళ్లాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. గర్భిణల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. దారిని బాగు చేయాలని ఏండ్ల నుంచి అధికారులకు విన్నవిస్తున్నా ఫలితం లేకుండా పోయింది. గ్రామానికి బీటీ రోడ్డు, తాగునీరు, అంగన్‌వాడీ, అంతర్గత రోడ్లు తదితర వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గతంలో నిరసన చేపట్టారు. ఏడాదిన్నర కిందట ఫిబ్రవరిలో గ్రామం నుంచి పిల్లాపాపలతో ఊరంతా కాలినడకన కలెక్టరేట్‌కు కదిలొచ్చింది. అక్కడే తొమ్మిది రోజులపాటు వంటావార్పు చేసుకుని నిద్రిస్తూ నిరసన తెలిపారు. వివిధ రాజకీయ పార్టీలతోపాటు ప్రజాసంఘాలు మద్దతు తెలిపి అండగా నిలిచాయి. పోరాటం ఉధృతమైన క్రమంలో దిగొచ్చిన ఐటీడీఏ అధికారులు హామీ ఇచ్చి.. కేవలం తాగునీటి సమస్యను పరిష్కరించారు. పిప్రి నుంచి కుండిషేకుగూడ వరకు ఏడు కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మిస్తామని హామీనిచ్చారు. ఇందుకు రూ.7కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని భరోసా ఇచ్చారు. త్రీఫేజ్ కరెంటు సౌకర్యం కల్పిస్తామన్నారు. కానీ ఏడాదిన్నర గడిచినా ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. దాంతో ఆగ్రహంతో ఉన్న గ్రామస్తులు రానున్న అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

### రోడ్డు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు



పిప్రి నుంచి గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఏండ్ల నుంచి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రోడ్డు కోసం ఇది వరకు పోరాటం చేయగా బీటీ రోడ్డు నిర్మిస్తామని అధికారులు హామీనిచ్చారు. ఇప్పటి వరకు నిర్మించలేదు. అత్యవసర పరిస్థితిలో ఆస్పత్రికి వెళ్లలన్నా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

- సుంగు- కుండిషేకుగూడ

### ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయం



పిప్రి నుంచి మా గ్రామానికి ఏడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. మొరం, మట్టి రోడ్డు మాత్రమే ఉండటంతో వర్షాకాలంలో గ్రామం నుంచి బయటకు వెళ్లడం కష్టంగా ఉంటుంది. ఝరిలోని పీహెచ్‌సీకి వెళ్లాలంటే బాలింతలు, గర్భిణీలు అవస్థలు పడాల్సి వస్తోంది. ఇందుకు నిరసనగా అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించడమే మార్గమని నిర్ణయం తీసుకున్నాం.

- దౌలత్‌రావు, పటేల్- కుండిషేకుగూడ

---

## రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి

**ఎమ్మెల్సీ కవిత • విద్యుత్ సౌధ వద్ద ఆందోళన**



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఉచిత విద్యుత్‌పై వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి రైతులకు క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్ రైతులకు అవసరమా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారని.. మరి వ్యాపారులకు 24 గంటలు ఉచిత విద్యుత్ ఇవ్వాలా అని ప్రశ్నించారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెట్టి విద్యుత్ వ్యవస్థను బాగు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్, టీడీపీ రైతులకు ఏం న్యాయం చేయలేదని.. ఆ రెండు పార్టీల్లో రేవంత్ రెడ్డి పనిచేశారని చెప్పారు. రైతులకు మూడు గంటల విద్యుత్ సరిపోతుందని ప్రకటించిన రేవంత్ రెడ్డిని తరిమికొట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్లు కవిత, సంగీత, వెంకటేష్, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బకాయిలను చెల్లించాలి

- కొత్త మెనూ ప్రకారం విద్యార్థుల మెనూ ఛార్జీలు పెంచాలి
- తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో.. మూడో రోజూ కొనసాగిన టోకెన్ సమ్మె



నవతెలంగాణ - విలేకరులు

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు చెల్లించాల్సి పెండింగ్ బకాయిలను చెల్లించాలని, కొత్త మెనూకి అనుగుణంగా మెనూ ఛార్జీలను పెంచాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ డిమాండ్ చేశారు. యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన మూడు రోజుల టోకెన్ సమ్మెలో భాగంగా బుధవారం పలు జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వందలాది మంది జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట బైటాయించి మూడు గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.పద్మ అధ్యక్షతన జరిగిన సభలో రమ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగం బతికి ఉండటానికి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు చేస్తున్న శ్రమే కారణమని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని అసెంబ్లీలో ప్రకటించిన తేదీ నుంచి ఏరియర్స్‌తో కలిపి పెంచిన రూ.2000 వేతనాన్ని అమలు చేయాలన్నారు. కొత్తగూడెం జిల్లాలో 9 కోట్ల రూపాయల పైచిలుకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు ఉంటే వంటలు ఎలా వండి పెట్టగలరని ప్రశ్నించారు. రాష్ట్రంలో రోజుకి 30 రూపాయల వేతనంతో పనిచేస్తున్న కార్మికులు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు మాత్రమేనని, ఇది తెలంగాణ రాష్ట్ర పరిపాలనకు సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని లేకుంటే, పోరాటాన్ని ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వందలాంది మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన కొనసాగగా.. అనంతరం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ విష్ణు, కల్యాణం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. యూటీఎఫ్ జిల్లా కమిటీ మద్దతు తెలిపింది. యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నల్లగొండలో జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ధర్నా చేపట్టారు. మహబూబాబాద్ జిల్లాలో స్థానిక ఎంఈఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

## మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- బీజేపీయేతర పార్టీలన్నీ ఏకం కావాలి : రాజకీయ శిక్షణా తరగతుల్లో జూలకంటి



నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని జేఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో బుధవారం సీపీఐ(ఎం) నియోజకవర్గస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంకుశ పాలన చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. ఒకే దేశం, ఒకే మతం, ఒకే విధానం, ఒకే పార్టీ.. ఒకే ప్రభుత్వం ఉండాలని మోడీ ప్రయత్నాలు చేస్తున్నారని, అందులో భాగంగానే దేశంలో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రజల మధ్య చిచ్చు రేపి రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కార్పొరేట్ సంస్థలను, ఆర్ఎస్ఎస్ విధానాలను, కేంద్ర దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకొని రాజ్యాన్ని ఏలుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయకపోగా.. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి మోడీ అధికారంలోకి వస్తే దేశాన్ని అమ్మకానికి పెడతారని చెప్పారు. మోడీని గద్దె దింపేందుకు ప్రతిపక్ష రాజకీయ పార్టీలన్నీ ఏకం కావాలని కోరారు. జాతీయ పార్టీలకు ప్రాంతీయ పార్టీలు మద్దతు తెలిపి మోడీ వ్యతిరేక విధానాలను ప్రజలకు గురించి చైతన్యపరచాలని కోరారు. మోడీ అవలంబిస్తున్న విధానాలను ప్రజలు అర్థం చేసుకున్నారని, ప్రజల పక్షాన ప్రతిపక్ష పార్టీలు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. గ్రామపంచాయతీ సిబ్బంది, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పార్టీ- ప్రజాసంఘాల నిర్మాణం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక విధానాలు-పర్యవసానాలుపై సోమయ్య, మిరియం వెంకటేశ్వర్లు బోధించారు. ప్రిన్సిపాల్‌గా వీరేపల్లి వెంకటేశ్వర్లు వ్యవహరించగా.. రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, సీనియర్ నాయకులు జగదీష్ చంద్ర, జిల్లా కమిటీ సభ్యులు రవి నాయక్, డా. మల్లు గౌతమ్‌రెడ్డి, భావండ్ల పాండు, వినోద్ నాయక్, తిరుపతి రామ్మూర్తి, పరుశరాములు, రాగిరెడ్డి మంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీకి విరాళాల వరద

- ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ.5271 కోట్లకు పైగా రాక
- ఇతర జాతీయ పార్టీలకు సమకూరింది రూ.1783 కోట్లు
- మూడు రెట్లు ఎక్కువగా దక్కించుకున్న కాషాయ పార్టీ
- ఆరేండ్ల విరాళాలపై ఏడీఆర్ నివేదిక

**ఎలక్టోరల్ బాండ్ల ప్రక్రియ బీజేపీకి ఒక అక్షయపాత్రలా తయారైంది. ఇది కోట్ల మేర విరాళాలను అందేలా చేస్తూ ఎన్నికల బరిలో ఆ పార్టీ బలంగా నిలిచేందుకు దోహదపడుతున్నది. మిగతా జాతీయ, ప్రాంతీయ పార్టీల కంటే బీజేపీకే అత్యధిక మొత్తంలో విరాళాలను తెచ్చిపెడుతున్నది. బీజేపీకి 2016 నుంచి 2022 వరకు మిగతా జాతీయ పార్టీల కంటే దాదాపు మూడు రెట్లు అధికంగా నిధులు సమకూరాయని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తన తాజా నివేదికలో వెల్లడించింది. 2018లో అప్పట్లో కేంద్రంలో ఉన్న మోడీ సర్కారు తెచ్చిన ఎలక్టోరల్ బాండ్లపై అనేక సందేహాలూ ఉన్నాయి. దీనిపై సుప్రీంకోర్టులో సైతం పిటిషన్లు పెండింగ్‌లో ఉండటం గమనార్హం.**





**న్యూఢిల్లీ** : ఎలక్టోరల్ బాండ్లు కేంద్రంలోని అధికార బీజేపీకి నిధుల వరదను కురిపిస్తున్నాయి. ఆ పార్టీకి వచ్చిన రాజకీయ విరాళాలల్లో 52 శాతానికి పైగా ఈ ఎలక్టోరల్ బాండ్ల ద్వారానే వచ్చి చేరాయి. అంటే, కాషాయ పార్టీకి వీటి ద్వారా అందిన మొత్తం రూ.5,271.97 కోట్లుగా ఉన్నది. ఇతర జాతీయ రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా మొత్తం రూ. 1783.93 కోట్లు సమకూరింది. వీటితో పోల్చుకుంటే బీజేపీకి అందిన మొత్తం మూడు రెట్లు అధికం కావటం గమనార్హం. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తాజా నివేదికలో ఈ విషయం వెల్లడైంది. 2016-17 నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరాల మధ్య 31 గుర్తింపు పొందిన నమోదిత రాజకీయ పార్టీలకు (ఇందులో ఏడు జాతీయ పార్టీలు, 24 ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి) అందిన విరాళాల గురించి విశ్లేషించి ఏడీఆర్ ఈ నివేదికను రూపొందించింది.

దేశంలోని రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విరాళాలను అందించే ప్రక్రియను మోడీ సర్కారు 2018లో తీసుకొచ్చింది. రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చే విధానం సులభతరం అయ్యేలా ఆర్థిక చట్టం 2017లోనూ అప్పటి కేంద్రం మార్పులను తీసుకొచ్చింది. 2019లోనూ ఇతర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు దేశంలో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. కాబట్టి ఈ ఆరేండ్లు అనేది కీలకమని నివేదిక వివరించింది.

**బీజేపీకి 52 శాతానికి పైగా బాండ్ల ద్వారానే విరాళాలు**

ఏడీఆర్ నివేదిక సమాచారం ప్రకారం.. ఏడు జాతీయ పార్టీలకు అందిన విరాళాల మొత్తం రూ.13,190.68 కోట్లు. మొత్తం విరాళాల్లో ఇది 80 శాతం కావటం గమనార్హం. ఇక 24 ప్రాంతీయ పార్టీలకు అందిన విరాళాల మొత్తం రూ.3,246.95 కోట్లుగా ఉన్నది. జాతీయ పార్టీలలో కేంద్రంలోనూ, ఇటు అనేక రాష్ట్రాల్లోనూ అధికారంలో ఉన్న బీజేపీకి.. మిగతా జాతీయ పార్టీలతో పోలిస్తే మూడు రెట్ల కంటే అధికంగా నిధులు వచ్చి చేరాయి. పైన చెప్పిన విధంగా ఈ ఆరేండ్లలో బీజేపీకి వచ్చిన మొత్తం విరాళాల్లో ఎలక్టోరల్ బాండ్ల ద్వారానే 52 శాతానికి పైగా (రూ.5271.97 కోట్లు) సమకూరాయి.

**తర్వాతి స్థానంలో కాంగ్రెస్**

బీజేపీ తర్వాతి స్థానంలో కాంగ్రెస్ ఉన్నది. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఆ పార్టీకి రూ.952.29 కోట్లుగా ఉన్నది. కాంగ్రెస్ పార్టీకి అందిన మొత్తం విరాళాల్లో బాండ్ల ద్వారా అందిన మొత్తం 60 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్నది. కాంగ్రెస్ తర్వాతి స్థానంలో పశ్చిమ బెంగాల్‌లో అధికార పార్టీగా ఉన్న ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ (ఏఐటీసీ) రూ.767.88 కోట్లను బాండ్ల ద్వారా సమకూర్చుకోగలిగింది. ఆ పార్టీకి ఇతర మార్గాల్లో అందిన మొత్తం విరాళాల్లో బాండ్ల ద్వారా అందిన మొత్తం దాదాపు 93 శాతం కావటం గమనార్హం.

**కార్పొరేట్ విరాళాల్లోనూ బీజేపీకే ఎక్కువ**

బీజేపీకి అందిన కార్పొరేట్ విరాళాలు కూడా మిగతా పార్టీలకు అందిన మొత్తం కంటే ఎక్కువగానే ఉన్నాయి. ఆ పార్టీకి మిగతా జాతీయ పార్టీలకు అందిన కార్పొరేటు విరాళాల కంటే మూడు నుంచి నాలుగు రెట్లు ఎక్కువగా అందటం గమనార్హం. 2017-18 ఆర్థిక సంవత్సరంలో బీజేపీకి అందిన ఈ విరాళాలు.. మిగతా అన్ని జాతీయ పార్టీలకు అందిన దాని కంటే 18 రెట్లకు పైగా ఉండటం గమనార్హం. ఇదే సమయంలో ప్రాంతీయ పార్టీలకు అందిన ప్రత్యక్ష కార్పొరేట్ విరాళాలు సైతం 152 శాతం పెరిగాయి. బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మాత్రమే తనకు అందిన కార్పొరేటు విరాళాలను వెల్లడించలేదు. 2018-19 ఆర్థిక సంవత్సరం నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరం మధ్య సీపీఐకి ఇలాంటి విరాళాలేవీ అందలేదు.

**ప్రాంతీయ పార్టీల్లో బీజేడీ టాప్**

దేశంలోని ప్రాంతీయ పార్టీలవారిగా చూసుకుంటే.. ఒడిశాలోని అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ)కు బాండ్ల ద్వారా రూ.622 కోట్లు సమకూరగా మొత్తం విరాళాల్లో దీని వాటా 90 శాతం. తమిళనాడులో 2021 మే నెల నుంచి అధికారంలో ఉన్న డీఎంకే ప్రాంతీయ పార్టీల్లో రెండో స్థానంలో నిలిచింది. ఈ పార్టీకి ఆరేండ్లలో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ. 431.50 కోట్లు వచ్చి చేరాయి. మొత్తం విరాళాల్లో బాండ్ల వాటా 90.7 శాతం. తెలంగాణలో అధికార టీఆర్ఎస్ పార్టీ ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ. 383.65 కోట్లను (మొత్తం విరాళాల్లో బాండ్ల వాటా 80.45 శాతం) అందుకొని మూడో స్థానంలో ఉన్నది. ఏపీలో 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ రూ.330.44 కోట్లను ఎలక్టోరల్ బాండ్ల ద్వారా సమకూర్చుకొని పార్టీకి అందిన మొత్తం విరాళాల్లో 72.43 శాతం వాటాను కలిగి ఉన్నది.

**ఎన్నికల ఏడాది విరాళాల వెల్లువ**

ఇక 2019 సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలకు అధిక మొత్తంలో విరాళాలు వచ్చి చేరాయి. 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ.4,863.5 కోట్ల విరాళాలు రాజకీయ పార్టీలకు సమకూరాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.4,041.4 కోట్లుగా ఉన్నది. అయితే, 2018లో మోడీ సర్కారు ఎలక్టోరల్ బాండ్ల ప్రక్రియను తీసుకొచ్చినప్పటి నుంచీ దాని పారదర్శకతపై అనేక అనుమానాలు, ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బాండ్ల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సుప్రీంకోర్టు ముందు పెండింగ్‌లో ఉన్నది.

## టీయూలో విజిలెన్స్ తనిఖీలు

- నిధుల దుర్వినియోగంపై మూడో సారి విచారణ



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ గుప్తా హయాంలో ఈసీ అనుమతి లేకుండా రిజిస్ట్రార్‌గా కొనసాగిన ప్రొఫెసర్ కనకయ్య, ప్రొఫెసర్ విద్యావర్ధినితో పాటు మరో 8మంది అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయలక్ష్మి, సాయాగౌడ్, సూపరిండెంటెండ్ భాస్కర్, ఏఈ వినోద్, బిక్నూర్ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవితా తోరణ్, సీవోఈ ప్రొఫెసర్ అరుణ శాంతాబాయి, ఇన్‌ఫ్రాస్టక్చర్ డైరెక్టర్ మధులికను విచారించారు. అక్రమ వస్తువుల కొనుగోళ్లు, పాలక మండలి అనుమతులు తీసుకోకుండా నిధులు దుర్వినియోగం చేయడంపై విచారణ చేశారు.రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కనకయ్య, ప్రొఫెసర్ విద్యావర్ధిని.. కొనసాగిన సమయంలో జరగిన కొనుగోళ్లపై వారిని వేర్వేరుగా సుమారు మూడు గంటల పాటు విజిలెన్స్ అధికారులు విచారించారు. ప్రొఫెసర్ విద్యావర్ధిని కేరీర్ అడ్వాన్స్ స్కీం పేరిట రూ.11లక్షలు డ్రా చేశారన్న ఆరోపణలపై అధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయం సమాచారం. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ గుప్తా నియామకం నుంచి ఆయన ఏసీబీ అధికారులకు పట్టుబడి అరెస్టయి జైలుకు పోయే వరకు యూనివర్సిటీలో జరిగిన వస్తువుల కొనుగోళ్లపై పాలనాపరమైన విధులు నిర్వహించిన అధ్యాపకులను అధికారులు విచారించారు.

కాగా, యూనివర్సిటీలో వీసీ రవీందర్ గుప్తా పాలక మండలి ఆమోదం లేకుండా ఇష్టానుసారంగా అక్రమ వస్తువులు కొనుగోళ్లు చేస్తున్నారని వీసీపై చర్యలు తీసుకోవాలని ఈసీ సభ్యులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో మొదటి సారి జూన్ 6న వర్సిటీలో విజిలెన్స్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో పలు విభాగాల్లో సోదాలు నిర్వహించి కంప్యూటర్లు, హార్డ్ డిస్కులను స్వాధీనం చేసుకున్నారు. రెండో దఫా జూన్ 13న వర్సిటీలో సోదాలు నిర్వహించి పలు కీలకమైన వివరాలు రాబట్టారు. మరోసారి జూన్ 17న ఏసీబీ అధికారులు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ డాక్టర్ అరుణ కార్యాలయంలో సోదాలు నిర్వహించి వర్సిటీ పరిధిలోని కళాశాలల వివరాలు, ఇతర విషయాలపై విచారణ చేశారు. తదనంతరం తాజాగా మూడోసారి విజిలెన్స్ అధికారులు బుధవారం ఉదయం 11గంటలకు చేరుకొని అధ్యాపకులను, మాజీ రిజిస్ట్రార్‌లను విచారించారు. ఇందుకు ఒక్క రోజు ముందుగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి విజిలెన్స్ అధికారులు సమాచారం ఇచ్చి ఇద్దరు మాజీ రిజిస్ట్రార్లతో పాటు మరో 8మంది అధ్యాపకులు, అధ్యాపకేతరులను అందుబాటులో ఉండేలా సమాచారం ఇవ్వాలని సూచించారు. దాంతో రిజిస్ట్రార్ యాదగిరి ఫోన్ ద్వారా వారందరికి సమాచారం అందజేశారు. కాగా, విచారణ వివరాలు వెల్లడించడానికి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిరాకరించారు.

## బాలుడిపై వీధి కుక్కల దాడి

**ఆస్పత్రికి తరలింపు**



నవతెలంగాణ- కొల్చారం

బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మెదక్ జిల్లా మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలో బుధవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన తెనుగు మహేశ్వరి, దత్తాత్రి దంపతుల చిన్న కుమారుడు ఉదయ్ తేజ్ మెదక్‌లోని ఓ ప్రయివేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. పాఠశాల నుండి తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత బాలుడి ముఖంపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. గమనించిన కుటుంబీకులు వెంటనే బాలుడిని హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## మైనర్ ప్రేమికుల ఆత్మహత్య

**దుబ్బాకలో విషాదం**





(ఫైల్)

నవ తెలంగాణ-దుబ్బాక

తెలిసీ తెలియని వయసులో ప్రేమలో పడ్డ మైనర్లు.. తమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోరేమోనన్న భయంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట 10వ వార్డులో బుధవారం వేకువజామున జరిగింది. స్థానికులు, దుబ్బాక ఎస్ఐ బత్తుల మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక పట్టణ కేంద్రానికి చెందిన తొట్ల రేణుక వెంకటేశం దంపతుల కూతురు నేహ(16), దుబ్బాకలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. పురపాలికలోని లచ్చపేట పదో వార్డ్ కౌన్సిలర్ కూరపాటి బంగారయ్య పెద్ద కుమారుడు వనప్రియ రవికాంత్ దంపతుల కుమారుడు భగీరథ్(17) అదే కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య ప్రేమవ్యవహారం నడుస్తోంది. విషయం తెలుసుకున్న ఇరువురి తల్లిదండ్రులు ప్రేమ వ్యవహారం ఇప్పుడే వద్దని, చదువుపై దృష్టి పెట్టాలని నచ్చజెప్పారు. దాంతో తమను విడదీస్తారేమోనని మనస్తాపం చెందారు. లచ్చపేటలో భగీరథ్ ఇంట్లోని ఓ దూలానికి ఇరువురు తమ మెడకు చున్నీలు బిగించుకుని ఉరేసుకున్నారు. విషయం తెలిసిన ఇరువురి తల్లిదండ్రులు బోరున విలపించారు. రెండు కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి. ఇరువురి మృతదేహాలను పోస్టుమార్టం కోసం దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఇరువురి కుటుంబాలను మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు పరామర్శించారు.

## విద్యుత్ సిబ్బందిపై రైతుల దాడి

- సిబ్బందికి తీవ్ర గాయాలు
- రైతులపై పోలీసు కేసు

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

వ్యవసాయ పొలంలోని చెట్టు విద్యుత్ లైన్‌కు అడ్డంగా ఉండటంతో సిబ్బంది కట్ చేస్తున్నారు. దాంతో విద్యుత్ అధికారులు, సిబ్బందిపై రైతులు దాడికి పాల్పడిన సంఘటన మనోహరాబాద్ మండలం రంగాయిపల్లిలో బుధవారం జరిగింది. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగాయిపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం, స్వామి, కనకయ్యకు చెందిన వ్యవసాయ పొలంలో పెద్ద మామిడి చెట్టు ఉంది. కాగా, గ్రామంలోని ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమకు విద్యుత్ లైన్ వేయడానికి వ్యవసాయ పొలంలోని మామిడి చెట్టు అడ్డంగా ఉందని.. దాన్ని నరకటానికి గజ్వేల్ ఏడీ నర్సయ్య రైతులను అడిగి అనుమతి తీసుకున్నారు. అనంతరం చెట్టు నరికివేయడానికి పొలంలోకి విద్యుత్ సిబ్బంది జేఎల్ఎంలు మహేందర్, ఎల్లం, యాదగిరి, ఆర్టిజన్‌లు బాబు, మల్లేశం, కనకయ్య, గిరిబాబు వెళ్లారు. ఇప్పటికే పరిశ్రమతో ఇబ్బందులు పడుతున్నామని, విద్యుత్ లైన్ కోసం చెట్లను నరుకుతారా అంటూ ఆ భూమికి చెందిన రైతులు శ్రీశైలం. స్వామి, కనకయ్య కలిసి ఏడీతో పాటు సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. విద్యుత్ అధికారులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే విద్యుత్ సిబ్బంది మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్టు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ సందీప్‌రెడ్డి తెలిపారు.

సంపాదకీయం

# రాష్ట్రాలపై ఆర్థిక దిగ్బంధనం

దేశంలో ప్రజాస్వామ్యం..లౌకికత్వం.. సామాజిక న్యాయం.. ఆర్థిక స్వావలంబనకు విఘాతం ఏర్పడుతోందంటూ మేధావులు, అభ్యుదయవాదులు.. సామాజికవేత్తలు కొన్నేండ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఇలా రాజ్యాంగంలోని కీలకాంశాలను క్రమక్రమంగా ధ్వంసం చేస్తూ వస్తున్న మోడీ సర్కార్...ఆ క్రమంలో

> వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద తెలంగాణకు రూ.700 కోట్లు రావాల్సి ఉన్నా దాని గురించి మోడీ సర్కార్ నోరు మెదపకపోవటం అత్యంత శోచనీయం. రాష్ట్రాల్లోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ఇతోధికంగా నిధులిచ్చి సహకరించటమనేది దాని బాధ్యత. బీఆర్‌జీఎఫ్ (బ్యాక్‌వర్డ్ రీజియన్స్ గ్రాంట్స్ ఫండ్) కింద ఆ నిధులను కేంద్రం సమకూర్చాలి. కానీ 2014-15, 2019-20, 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఢిల్లీ నుంచి మనకు ఒక్కపైసా రాకపోవటం విస్తుగొలిపే అంశం.

రాష్ట్రాలకు ఆయువుపట్టు లాంటి ఆర్థిక స్వావలంబన మీద పెద్ద దెబ్బే కొట్టింది. 2014 నుంచి ఇప్పటిదాకా నిధులు, గ్రాంట్ల విషయంలో కేంద్రం మొండి వైఖరిని అనుసరిస్తూ తెలంగాణకు తీరని అన్యాయం చేసింది. తాజాగా దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన జీఎస్టీ కౌన్సిల్‌లో కేంద్ర విత్త మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తావించిన అంశాలు.. ఆ సందర్భంగా 'తెలంగాణకు ఆర్థికంగా చేయూత నివ్వండి...' అంటూ మన ఆర్థికామాత్యులు తన్నీరు హరీశ్‌రావు వేడుకున్న తీరు ఇదే విషయాన్ని రూఢీ చేస్తున్నది. వాస్తవానికి హరీశ్ కంటే ముందే, 2014 నుంచి 2018 వరకూ ఉన్న బీఆర్ఎస్ తొలి ప్రభుత్వం సైతం ఇదే అంశంపై విన్నపాల మీద విన్నపాలు.. విజ్ఞాపనల మీద విజ్ఞాపనలు అందజేసింది. కానీ కేంద్రం కనికరించకపోవటం దాని బాధ్యతా రాహిత్యానికి, రాష్ట్రాల పట్ల అది అనుసరిస్తున్న ధోరణికి ప్రబల తార్కాణం.




నిజానికి తెలంగాణ ఆవిర్భావం తర్వాత... పన్నుల రూపంలో రాష్ట్రం నుంచి కేంద్రానికి వెళ్లింది ఎక్కువ, అక్కడి నుంచి పన్ను వాటాల రూపంలో ఇక్కడికి వచ్చింది చాలా తక్కువ. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద తెలంగాణకు రూ.700 కోట్లు రావాల్సి ఉన్నా దాని గురించి మోడీ సర్కార్ నోరు మెదపకపోవటం అత్యంత శోచనీయం. రాష్ట్రాల్లోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ఇతోధికంగా నిధులిచ్చి సహకరించటమనేది దాని బాధ్యత. బీఆర్‌జీఎఫ్ (బ్యాక్‌వర్డ్ రీజియన్స్ గ్రాంట్స్ ఫండ్) కింద ఆ నిధులను కేంద్రం సమకూర్చాలి. కానీ 2014-15, 2019-20, 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఢిల్లీ నుంచి మనకు ఒక్కపైసా రాకపోవటం విస్తుగొలిపే అంశం. ఫలితంగా రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలైన ములుగు, ఏటూరు నాగారం, మహబూబాబాద్, దేవరకొండ, భూపాలపల్లి, ఆసిఫాబాద్, భద్రాచలం తదితర మారుమూల, ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన మృగ్యంగా మారింది. ఆంధ్రప్రదేశ్ పునర్ విభజన చట్టంలో సైతం వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వాలంటూ స్పష్టంగా పేర్కొన్నప్పటికీ కేంద్రం పెడచెవిన పెట్టడం గమనార్హం.

ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. కేంద్రం రాష్ట్రాల పట్ల, ముఖ్యంగా తెలంగాణ పట్ల అనుసరిస్తున్న ఉద్దేశపూర్వక నిర్లక్ష్యానికి ఉదాహరణలు కోకొల్లలుగా ఉన్నాయి. రాష్ట్రాలకు కేంద్ర బడ్జెట్ ద్వారా అందించాల్సిన సాయాలు, గ్రాంట్లు, నిధులకు మొండిచేయి చూపటం ద్వారా వాటి వెన్నెముకను విరవాలన్నది కేంద్రం ఎత్తుగడ. బలమైన రాష్ట్రాలు ఉంటేనే బలమైన కేంద్రం సాధ్యమవుతుందనే రాజ్యాంగ మౌలిక సూత్రానికి ఇది పూర్తి విరుద్ధం. రాష్ట్రాలను తమ ముందు మోకరిల్లేలా.. బిచ్చగాళ్ల మాదిరిగా అడుక్కుతినేలా చేయాలన్న ఆరెస్సెస్ బుర్రలోంచి పుట్టిన దుర్మార్గపు ఆలోచనా విధానానికి అసలు సిసలు స్వరూపమే ఇది. అందుకే మోడీ ప్రభుత్వం రాష్ట్రాలను కనికరించదు.. అదనంగా ఒక్క పైసా ఇవ్వదు.

ఈ క్రమంలో ఆర్థికంగా తమ కాళ్ల మీద తాము నిలబడేందుకు వీలుగా రాష్ట్రాలు ఐక్యంగా ముందుకు సాగాల్సిన తరుణం ఆసన్నమైంది. వామపక్షాల ఏలుబడిలో ఉన్న కేరళ ప్రభుత్వం ఇందుకోసం గతంలో కొంత ప్రయత్నించింది. అప్పట్లో ఆ రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి థామస్ ఐజాక్... వివిధ రాష్ట్రాల, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ఆర్థికశాఖ మంత్రులతో సమావేశాలు నిర్వహించారు. కేంద్రం అనుసరిస్తున్న ధోరణిపై చర్చలు, సమాలోచనలు చేశారు. ఆ క్రమంలో ఆయన తెలంగాణ ప్రభుత్వంతోనూ సంప్రదింపులు నెరిపారు. మళ్లీ అలాంటి వాతావరణమే ఇప్పుడు రావాలి. తమను ఆర్థికంగా అష్ట దిగ్బంధనం చేస్తున్న మోడీ సర్కారు వైఖరిపై నిరసన గళాలు విప్పాలి. ఈ ఆందోళన, పోరాటాల్లో ప్రజల్ని భాగస్వాముల్ని చేయాల్సిన గురుతర బాధ్యతను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తెరగాలి. అప్పుడే కేంద్రం మెడలు వంచటం సాధ్యమవుతుంది. లేదంటే షరా మామూలుగా జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయి.. రాష్ట్రాలు సమర్పించిన విజ్ఞాపనా పత్రాలు బుట్టదాఖలవుతాయి.

# తలసరి, స్థూల ఉత్పత్తి పెరుగుదల దారిద్ర్యాన్ని నిర్మూలిస్తుందా?



సారంపల్లి మల్లారెడ్డి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో తలసరి ఆదాయం రూ.1,24,104 ఉండగా 2023-24లో ఇది రూ.3,17,115లకు పెరిగినట్లు 2023 ఫిబ్రవరి 6న ఆర్థికమంత్రి హరీష్‌రావు తన బడ్జెట్ ఉపన్యాసంలో ప్రకటించారు. భారతదేశంలోనే తలసరి ఆదాయం పెరుగుదలలో రాష్ట్రం 3వ ర్యాంకులో ఉందని, ఇంత పెద్దఎత్తున ఆర్థిక వనరులు పెరిగిన రాష్ట్రం, స్థూల ఉత్పత్తి పెరిగిన రాష్ట్రం మరొకటిలేదని సగర్వంగా ప్రకటించారు. 2020-21లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.13.59లక్షల కోట్లు కాగా 2021-22లో రూ.11.48లక్షల కోట్లకు తగ్గిపోయింది. తిరిగి 2022-23 సంవత్సరానికి రూ.13.28లక్షల కోట్లకు పెరిగినట్లు స్టాటిస్టికల్ నివేదికలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలతో ముడిపెట్టి తలసరి ఆదాయం పెరిగినట్లు, తద్వారా రాష్ట్రం అభివృద్ధి పథంలో కొనసాగుతున్నట్టు గణాంకాలు చెపుతున్నాయి. తలసరి ఆదాయం పెరిగినపుడు అంతకుముందు ఉన్న దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు ఎగువకు రావాలి. ఆదాయం పెరిగినప్పుడు ఆ కుటుంబం

> సాధారణ బిచ్చగాడి ఆదాయం, రిలయన్స్ కంపెనీ ఆదాయం కలిపి సగటు చేస్తే బిచ్చగాడి ఆదాయం పెరిగినట్టు కనిపిస్తుంది. అందువల్ల కనీస అందుబాటులో ఉన్నవారి సగటు ఆదాయాన్ని ప్రకటించాలి తప్ప పొంతనలేని ఆదాయాలను ప్రకటించడం ప్రజలను మభ్యపుచ్చడమే అవుతుంది. ఆ పని చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లలో తమ ఆర్థిక నైపుణ్యతను ప్రదర్శిస్తుంటారు. కానీ అవి వాస్తవం కాదని ఎందరికి తెలుసు? ఆర్థికవేత్తలు వాస్తవ పెరుగుదలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజెప్పే బాధ్యతను వహించాలి.

విద్య-వైద్య సౌకర్యాలకు వ్యయం చేస్తారు. కానీ, గత 10 ఏండ్లుగా రాష్ట్రంలో అక్షరాస్యత 66.6శాతానికి మించలేదు. ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లలేక సాధారణ జబ్బులతో ప్రజలు చనిపోతున్నారు. ముఖ్యంగా గిరిజన, దళిత మహిళలు కనీస వైద్య సౌకర్యాలకు నోచుకోవడం లేదు. దారిద్ర్య రేఖకు ఎగువకు వెళితే తప్పనిసరిగా ఆ కుటుంబం విద్యా, వైద్యం మీద ఖర్చు చేయాలి. కానీ, రంగాలపై వ్యయం పెరిగినట్లు ఎలాంటి గణాంకాలు లేవు. కనీసం ఆవాసం కూడా లేని కుటుంబాలు రాష్ట్ర ప్రభుత్వ సర్వేలో 19శాతం ఉన్నట్లు తేలింది. ఆవాసం కాదుగదా ఆవాసానికి కావల్సిన భూమి కూడా లేని వారి సంఖ్య గణనీయంగా ఉన్నది. రాష్ట్ర ప్రజలను దారిద్ర్యం నుండి ఎగువకు తేవడంతో పాటు ఉపాధి కల్పన జరగాలి. 2014 నుండి నేటివరకు పరిశీలిస్తే, దారిద్ర్యరేఖకు ఎగువకు చేరినవారి సంఖ్య లేకపోగా దారిద్ర్యరేఖకు దిగువకు వెళ్ళినవారి సంఖ్య ఎక్కువగా ఉంది. 2016లో రాష్ట్రంలో 27.5శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉండగా, 2022-23లో 31శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు గణాంకాలు చెపుతున్నాయి.

ఇందుకు మరో ఉదాహరణను కూడా పరిగణించాలి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి రేషన్‌కార్డులు (తెల్ల కార్డులు) ఇస్తారు. ప్రభుత్వం 2017లో చేసిన సర్వే ప్రకారం రాష్ట్రంలో 1.02కోట్ల కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 89.47లక్షల మందికి రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈమధ్య 12లక్షల మందిని డబుల్ కార్డులు ఉన్నాయనే పేరుతో తొలగించి, కొత్తగా 13.57లక్షల మందికి రేషన్‌కార్డులు ఇచ్చారు. ఈవిధంగా దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నపుడు రేషన్‌కార్డులు తగ్గించవచ్చు గదా? రేషన్‌కార్డులు పెంచుతున్నారంటేనే దారిద్ర్యరేఖకు లోబడినవారి సంఖ్య పెరుగుతున్నట్లు గుర్తించాలి.

## దారిద్ర్యరేఖ అంటే ఏమిటి?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక వ్యక్తి ఆదాయం సంవత్సరానికి రూ.27,000లకు లోపు ఉన్నట్లయితే, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు పరిగణించారు. 2013లో ఆహార భద్రతా చట్టం తెచ్చినపుడు, దారిద్ర్యరేఖ ఆదాయాన్ని మార్చారు. గ్రామీణ ప్రాంతాలలో ఒక కుటుంబానికి రూ.1.5లక్షలు, పట్టణ ప్రాంతాలలో రూ.2లక్షలు గీటురాయిగా నిర్ణయించారు. భూమి అయినచో, ఒక కుటుంబానికి 3.5ఎకరాల తరి (మాగాణి) లేదా 7.5ఎకరాల మెట్ట లోపు ఉన్నవారికి జాతీయ ఆహారభద్రతా కార్డు ఇస్తామని నిర్ణయించారు. రేషన్‌కార్డు పొందినవారికి కిలో బియ్యం చొప్పున తలసరి 4కిలోలు, కుటుంబానికి 20కిలోల సీలింగ్ వరకూ బియ్యం ఇవ్వవచ్చు. జాతీయ ఆహార భద్రతలో 10మంది కుటుంబసభ్యులకు 60కిలోల బియ్యం ఇవ్వాలని నిర్ణయించారు. తెలంగాణ విభజన జరిగిన తర్వాత గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరానికి రూ.76,800 (నెలకు రూ.6400), పట్టణాలలో రూ.1,42,200 (నెలకు రూ.11850) వార్షిక ఆదాయం లోపు ఉన్నవారిని దారిద్ర్యరేఖకు దిగువగా నిర్ణయించారు. ఇంతవరకూ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ఎంత ఆదాయం ఉండాలనే స్పష్టత రాష్ట్రంలోగానీ, దేశంలోగానీ లేదు. ఒక్కో కమిషన్ ఒక్కొక్క నిర్ణయం చేస్తున్నది. టెండూల్కర్ కమిషన్ గ్రామీణ ప్రాంతాలలో రోజుకు తలసరి రూ.24, పట్టణాలలో రూ.36 ఆదాయానికి తగ్గితే దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు ప్రకటించింది. ఈ స్కేల్ ప్రకారం 5శాతం దారిద్ర్యరేఖనుండి ఎగువకు వచ్చినట్లు పేర్కొంది. వాద్వా కమిషన్ రోజుకు రూ.50 ఆదాయాన్ని లెక్కగట్టింది. ఆర్బీఐ మాజీ అధ్యక్షుడు రంగరాజన్ కమిషన్ రోజుకు రూ.100 ఆదాయం ఉండాలని, అంతకులోపు ఉన్నవారు తెలంగాణలో 50శాతం ఉన్నారని ప్రకటించింది. నేటికీ ఈ మూడు కమిషన్లను వివిధ సందర్భాలలో ఉపయోగిస్తున్నారే తప్ప కచ్చితమైన ఆదాయాన్ని మాత్రం నిర్ణయించలేదు. ఆహారభద్రతకు, విద్యాహక్కుకు, హాస్పిటల్ సౌకర్యానికి వివిధ ఆదాయ గీటురాళ్ళను నిర్ణయించి అమలుచేస్తున్నారు. తలసరితో పాటు సగటు నిర్ణయం కూడా భ్రమలు కల్పించేవే.

2020-21లో రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 25శాతం ప్రభుత్వ రుణార్హత అనగా, రూ.2.05లక్షల కోట్లుగా ఉంది. 2022-23

> ఇంతవరకూ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ఎంత ఆదాయం ఉండాలనే స్పష్టత రాష్ట్రంలోగానీ, దేశంలోగానీ లేదు. ఒక్కో కమిషన్ ఒక్కొక్క నిర్ణయం చేస్తున్నది. టెండూల్కర్ కమిషన్ గ్రామీణ ప్రాంతాలలో రోజుకు తలసరి రూ.24, పట్టణాలలో రూ.36 ఆదాయానికి తగ్గితే దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు ప్రకటించింది. ఈ స్కేల్ ప్రకారం 5శాతం దారిద్ర్యరేఖనుండి ఎగువకు వచ్చినట్లు పేర్కొంది. వాద్వా కమిషన్ రోజుకు రూ.50 ఆదాయాన్ని లెక్కగట్టింది. ఆర్బీఐ మాజీ అధ్యక్షుడు రంగరాజన్ కమిషన్ రోజుకు రూ.100 ఆదాయం ఉండాలని, అంతకులోపు ఉన్నవారు తెలంగాణలో 50శాతం ఉన్నారని ప్రకటించింది.

సంవత్సరానికి జీడీపీలో 24.3శాతం మాత్రమే రుణం తీసుకుని, రూ.3.22లక్షల కోట్లకు పెరిగింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరగడం వలన అందులో సగటు 25శాతం అయినప్పటికీ రాష్ట్ర అప్పులు పెరిగిపోతూనే ఉన్నాయి. రాష్ట్ర బడ్జెట్‌లో 18శాతం వడ్డీల కింద చెల్లిస్తున్నాము. తలసరిగానీ, సగటు కానీ ప్రకటించడం అంటే వాస్తవాలను భ్రమింపజేయడానికే ప్రభుత్వ ఆర్థికవేత్తలు నివేదికలు రూపొందిస్తున్నారు. ఒకవైపు దేశంలోగానీ,




రాష్ట్రంలోగానీ దారిద్ర్యం పెరిగిపోతూనే ఉంది. పట్టణాలలో 8శాతం నిరుద్యోగం ఉండగా నేడు అది 12.92శాతానికి పెరిగింది. గ్రామాలలో 25శాతం నుండి 38శాతానికి నిరుద్యోగం పెరిగింది. గ్రామీణ ప్రాంతాలలో పాక్షిక ఉద్యోగం అనగా సంవత్సరంలో 120రోజులు మాత్రమే పని లభించే కుటుంబాలు 70శాతం వరకూ ఉన్నాయి. అయినా ప్రభుత్వం తలసరి ఆదాయం పెరుగుతున్నదని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దేశంలోనే మెరుగ్గా ఉన్నదని చెపుతున్నారు. అలా మెరుగ్గా ఉన్నపుడు 2014-15లో రూ.77వేల కోట్లు ఉన్న రాష్ట్ర రుణం, 2023-24 నాటికి రూ.4.35లక్షల కోట్లకు ఎలా పెరిగింది. రుణం పెరగడం కూడా దారిద్ర్య నిర్మూలనలో భాగమేనా?

రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలను కూడా ఉటంకించి అభివృద్ధి జరిగినట్లు ప్రకటించారు. 2021-22లో 11.55లక్షల కోట్లుకాగా, 2022-23లో 13.5లక్షల కోట్లకు పెరిగినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కొద్ది మంది పెట్టుబడిదారుల వ్యవస్థలో ఉత్పత్తి పెరగడం - గత సంవత్సరంపై ధరలు పెరగడం వలన స్థూల ఉత్పత్తి రేటు పెరుగుతుంది. దీనిని కూడా తలసరి ఆధాయం లాగా రాష్ట్ర పెరుగుదలకు గుర్తింపుగా ప్రకటిస్తారు. స్థూల ఉత్పత్తి పెరిగినప్పుడు రాష్ట్రంలో దారిద్ర్యం శాతం తగ్గాలి. కానీ దారిద్ర్యం పెరుగుతూనే ఉంది. తలసరి ఆదాయం, రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదల ఈ రెండు అంశాలను ప్రభుత్వాలు పదే, పదే ప్రచారం చేసుకుంటాయి. కానీ వీటివలన రాష్ట్రంలోగాని, దేశంలోకానీ దారిద్ర్య శాతం తగ్గినట్లు ఎక్కడ ఆధారాలు లేవు.

## అనుత్పాదక రంగంపైనే వ్యయం

రాష్ట్ర ప్రభుత్వం తన పథకాలను, ప్రణాళికలను ఉత్పత్తి రంగం కాకుండా అనుత్పాదక రంగంపై వ్యయం చేయడంతో ఆశించిన పెరుగుదల రావడం లేదు. వ్యవసాయం, పరిశ్రమలు, ఉత్పత్తి రంగాలు కాగా టూరిజంతో పాటు మిగిలినవన్నీ అనుత్పాదక రంగాలకు చెందినవే. వాటినుండి వచ్చే ఆదాయం ఒక్కోసారి 70శాతంగా ఉండగా మరోసారి 30శాతానికి పడిపోతుంది. అది స్థిరమైన ఆదాయం కాదు. కానీ ఉత్పత్తి రంగం స్థిరంగా పెరుగుదల ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్ర స్థూల ఉత్పత్తికి వ్యవసాయ రంగం నుండి 15శాతం ఆదాయం వస్తుండగా పారిశ్రామిక రంగం నుండి 28శాతం ఆదాయం వస్తున్నది. ఏనాటికైనా వ్యవసాయ రంగంలో ఉత్పత్తి నాలుగు రెట్లు పెరిగినప్పటికీ అందులో ఉపాధి దినదినం తగ్గిపోతున్నది. యాంత్రీకరణ పెరగడం ద్వారా పారిశ్రామిక ఉపాధి శాతం పెరగడంతో పాటు వ్యవసాయ ఉపాధి శాతం తగ్గిపోతున్నది. తమ అవసరాలకు మించి అదనపు ఉత్పత్తి జరిగినప్పటికీ అమెరికా వ్యవసాయ ఉత్పత్తి దేశ స్థూల ఉత్పత్తిలో 1.2శాతం మాత్రమే. మన దేశంలో కూడా వ్యవసాయ యాంత్రీకరణ జరగడం వలన ఉత్పాదకత పెరగడంతో పాటు దేశ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయం కాంట్రిబ్యూషన్ తగ్గుతున్నది. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో అనుసరించిన విధానాలనే వివిధ పేర్లతో అనుసరిస్తున్నారు తప్ప మౌలిక మార్పులు చేసి వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ఉత్పాదకతను పెంచి, ఉపాధి కల్పించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. యాంత్రీకరణ ద్వారా వ్యవసాయరంగంలో ఉపాధి కోల్పోయి దరిద్రనారాయణుల సంఖ్య పెరుగుతున్నది. నేటికీ 40శాతం మంది ప్రజలు ఒక్కపూట భోజనానికి కూడా ఆదాయం సంపాదించుకోలేకపోతున్నారు. ఆర్థికవేత్తలు చెప్పిన గణాంకాల లెక్కలు చూసినపుడు దారిద్ర్యం పెరుగుతున్నది. అయినప్పటికీ తలసరి ఆదాయం పెరుగుతున్నదని, సగటు ఆదాయం పెరుగుతున్నదని బడ్జెట్లలో భ్రమలు కల్పించే పదాలు ఉటంకిస్తున్నారు. సాధారణ బిచ్చగాడి ఆదాయం, రిలయన్స్ కంపెనీ ఆదాయం కలిపి సగటు చేస్తే బిచ్చగాడి ఆదాయం పెరిగినట్టు కనిపిస్తుంది. అందువల్ల కనీస అందుబాటులో ఉన్నవారి సగటు ఆదాయాన్ని ప్రకటించాలి తప్ప పొంతనలేని ఆదాయాలను ప్రకటించడం ప్రజలను మభ్యపుచ్చడమే అవుతుంది. ఆ పని చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లలో తమ ఆర్థిక నైపుణ్యతను ప్రదర్శిస్తుంటారు. కానీ అవి వాస్తవం కాదని ఎందరికి తెలుసు? ఆర్థికవేత్తలు వాస్తవ పెరుగుదలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజెప్పే బాధ్యతను వహించాలి. •



## ఇద్దరు నీచులు!

దేన్నీ ధిక్కారించ లేని
ఓ అభాగ్యుడు దారెంటా
చేతులు జోడించి కూర్చున్నాడు
గజ్జి కుక్క కంటే హీనమైన వాడొకడు
నిర్లజ్జగా కాలెత్తిండు!
ఇంత దుర్మార్గం
కళ్ళెదుటే ఇంత జరుగుతున్నా
సూర్యుడు కళ్ళు మూసుకో లేదు
గాలి ముక్కు మూసుకో లేదు
దారెంటా ప్రయాణాలు ఆగిపోలేదు
ఊగిపోతూ నాలో నేనే
భూనభోంతరాలు దద్దరిల్లేటట్లు
ఏదిరా నీ దేవుడని అరిచా!
'దేవుడు నీలా తొందర పడడ'ని
ఓ అశరీరవాణి నిశ్శబ్ద సమాధానం!
నిజానిజాలు తేల్చుకోలేని నేను
రాయి పట్టుకున్న చేతిని
నా వెనకే దాచుకున్న!
వాడి ఇల్లు కూల్చేసినందుకు
ప్రతీకార ఆనందమో
వాడి పాదాలు మరొకడు కడిగి
నెత్తిన చల్లుకున్నందుకు
అంతు లేని విజయ గర్వమో
నా ఆవేశాన్ని చల్లబరచ లేదు!
ఇద్దరు నీచులు
ఇంత పెద్ద దేశాన్నీ
అంతు లేని మానవ సమూహాన్నీ
అధికార మదంతో అవమానించినందుకు
ఆ ఇద్దరు ఎక్కడ కనిపించినా
నాలాగా దాచుకున్న రాళ్ళకు పని చెప్పండి!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
సెల్:9440233261

# 'ధరణి'పై మాటలు చెప్తే సరిపోదు! పరిష్కరించాలి...



గీట్ల ముకుందరెడ్డి

కాలానికనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను ప్రభుత్వాలు వినియోగించుకోవాలి. ప్రజలకు మరింత సౌకర్యాలు, సేవలందించాలి. ఇందుకు భిన్నంగా ధరణి వ్యవస్థతో అవస్థలు సృష్టించారు. ధరణికి ముందు ఉన్న భూ సమస్యలు పరిష్కారం కాకపోగా 2017-18లో భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంగా కొత్తగా సృష్టించబడిన అనేక సమస్యలు ధరణి ద్వారా పరిష్కారం కావడం లేదు. తమ వద్దకు వచ్చిన సుమారు 15వందల కేసులు పరిశీలిస్తేనే 20రకాల సమస్యలు ఉన్నాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. తహసీల్దార్, జిల్లా కలెక్టర్ స్థాయిలో ఎన్ని కేసులున్నాయో జులై 15లోగా తెలియజేయాలని, పరిష్కార దిశగా తీసుకునే చర్యలపై రిపోర్టు ఇవ్వాలని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీని, సిసిఎల్ఎ కమిషనర్‌ని హైకోర్టు ఆదేశించింది. సుమారు పది లక్షలు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాల్సి ఉందని, 12లక్షలకు పైగా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి.

రైతులు తమ కాళ్ల చెప్పులరిగేలా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వ పెద్దలు మాత్రం ధరణి పోర్టల్ ఒక అద్భుతం అని ప్రచార్భాటాలు చేస్తుంటే ప్రధాన ప్రతిపక్షం తాము అధికారంలోకి వస్తే 'ధరణి'ని రద్దు చేస్తామని, బంగాళాఖాతంలో కలుపుతామని ప్రకటించింది. ఈ రెండు ధోరణులు రాజకీయ ప్రయోజనాల కోసం తప్ప సమస్యల పరిష్కారానికి ఉపయోగపడవు. ధరణి లేకుంటే రైతుబంధు రాదని కేసీఆర్ మాట్లాడటం ఓట్ బ్యాంకు రాజకీయాల కోసమే. రైతుబంధు ప్రారంభమయ్యే 2018 నాటికి ధరణి లేనేలేదు. అంతకుముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణమాఫీలు చేసినప్పుడు కూడా ధరణి లేకుండానే రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. 2017లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ సర్వే చేపడతామని ప్రకటించినప్పుడు రైతులు, భూ యజమానులు సంతోషించారు. సర్వే నెంబర్ల ప్రకారం క్షేత్రస్థాయిలో సర్వే చేసి భూ హద్దులు నిర్ణయిస్తారని రైతులు భావించారు. నిజాం కాలంలో 1923 సంవత్సరం నుండి 1953 వరకు తెలంగాణలోని వివిధ జిల్లాల్లో క్షేత్ర స్థాయిలో భూకమతాల వారిగా భౌతికంగా సర్వే చేసి భూ హద్దు రాళ్లు పాతారు. నెంబర్లు కేటాయించారు. 'నక్షా' (మ్యాపు)లు రూపొందించారు. అప్పటికి ఎటువంటి శాటిలైట్ వ్యవస్థ, డిజిటల్ పరికరాలు ఊహలో కూడా లేనికాలంలో మాన్యువల్‌గా అద్భుతమైన కచ్చితత్వంతో కూడిన 'నక్షా'లు భూ కమతాల వారిగా రూపొందించారు. గ్రామ పటాలు తయారు చేశారు. కొలతలు, స్కెలింగ్ నేటికీ ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. మూడంచెల వ్యవస్థలో రికార్డులు భద్రపరిచారు. జిల్లా, తాలూకా, గ్రామం, పట్టాదారు పేర్లు, భూ విస్తీర్ణం, భూ స్వభావం రికార్డు చేశారు. ప్రభుత్వ భూములు, ఇనాం భూములు, బంజర, పోరంబోకు, గైరాన్ భూములు, గ్రామ కంఠం, సర్వేఖాస్ తదితర అనేక భూముల వివరాలు పొందుపరిచారు.

ఈ 8, 10 దశాబ్దాల కాలంలో అనేక మార్పులు జరిగాయి. ముఖ్యంగా భూ ఖండాల విభజన జరిగింది. వారసత్వ పంపకాలు, క్రయ విక్రయాలు, ప్రభుత్వ భూముల అసైన్‌మెంట్ వంటి అనేక మార్పులు వచ్చాయి. రెవెన్యూ రికార్డుల్లోని సర్వే నెంబర్లలో బై నెంబర్లు వేసి విభజించారు. కానీ బై నెంబర్లు, విభజన జరిగిన ప్రకారం 'నక్షా' (టిపన్)లో మార్పులు చేయలేదు. ఎక్కువ శాతం హద్దు రాళ్లు చెదిరిపోయాయి. క్షేత్ర స్థాయిలో భూ భౌతిక సర్వే నిర్వహించి, కాగితాల్లో రికార్డ్ అయిన సర్వే, బై నెంబర్లకు అనుగుణంగా హద్దు రాళ్ళు ఏర్పాటు చేస్తారని, 'నక్షా'లో తగు మార్పులు చేస్తారని తెలంగాణ రైతాంగం, భూ యజమానులు ఆశించారు. కానీ తెలంగాణ ప్రభుత్వం 2017లో భూ భౌతిక సర్వేకు బదులు భూ రికార్డుల ప్రక్షాళన మొదలుపెట్టి కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. పట్టాదారు పేర్లలో తప్పులు, ఇంటి పేర్లలో తప్పులు, తండ్రి, భర్త పేరులో తప్పులు, భూ విస్తీర్ణంలో తప్పులు, భూ స్వభావంలో తప్పులు ఇలా అనేక తప్పులు చేసి రైతులకు వెతలు మిగిల్చింది. తెలంగాణ ప్రభుత్వం అధికార యంత్రాంగం సృష్టించిన తప్పులను సరి చేయకుండా 2020లో పట్టాదారు పాస్‌బుక్, భూ యజమాన్య హక్కుల సవరణ చట్టం తీసుకొచ్చింది. కౌలుదారు 'కాలమ్'తో సహా కొత్త పట్టాదారు పాసుబుక్‌లో అనేక 'కాలమ్స్' ఎత్తివేశారు. కౌలు రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కౌలు రైతులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. బ్యాంకు రుణాలు, పంట నష్టపరిహారం పొందడం లేదు. బీమా సౌకర్యం కల్పించబడడం లేదు. పంటల పెట్టుబడి పతకమైన రైతుబంధు భూ యజమానులకే చెల్లించబడుతున్నది. డిజిటల్ రికార్డులు మాత్రమే ఉండే విధంగా సవరణలు చేసింది. ధరణి పోర్టల్ తీసుకువచ్చింది. ఆఫ్ లైన్ (భౌతిక) రికార్డుల కన్నా ఆన్‌లైన్ రికార్డులు చాలా భద్రంగా ఉంటాయి అన్నట్లుగా కేసీఆర్ మాట్లాడుతున్నారు. సైబర్ దాడులు, ఆన్‌లైన్‌లో డేటా చోరీలు అనేకం చూస్తున్నాం. పైగా ధరణిని ప్రయివేట్ కంపెనీ నిర్వహిస్తున్నది. గతంలో మూడు స్థాయిల్లో రికార్డులు భద్రపర్చేవారు. తీవ్రవాద దాడులు, వరద లాంటి పకృతి వైపరీత్యాలు జరిగిన ఒకచోట ధ్వంసమైన ఇంకోచోట భద్రంగా ఉండేది, ఇప్పుడు అలా కాదు.

రూల్ ఆఫ్ రైట్ (ఆర్ఓఆర్) చట్టం-1971 చాలా స్పష్టమైన గైడ్‌లైన్స్‌తో ఉన్నది. అర్థం పర్థం లేని పనికిరాని చట్టం 2020 ఆర్ఓఆర్ సవరణ చట్టం. ఒక చట్టం చేసే ముందు అనేక కోణాల్లో పరిశీలించాలి. ముఖ్యంగా భూ చట్టాలకు అనేకమైన, న్యాయపరమైన చిక్కులుంటాయి. రైతు సంఘాలను, క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులను, భూ పరిపాలన నిపుణులు, న్యాయ నిపుణుల అభిప్రాయం తీసుకొని చట్టం తీసుకురావలసింది. కానీ అన్ని ఆయనే (ముఖ్యమంత్రి) చేసినట్లు చెబుతూ ఉంటాడు. అందుకే ఇన్ని సమస్యలు వస్తున్నాయేమో. ఆర్ఓఆర్ సవరణ చట్టం ద్వారా ఉనికిలోకి వచ్చిన డిజిటల్ రికార్డుల 'ధరణి' పోర్టల్ అన్ని రకాల భూ సమస్యలకు పరిష్కారంగా చెప్పబడింది. కానీ అనేక సమస్యల పరిష్కారానికి ధరణిలో ఆకాశమే లేదు. రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేసుకుంటే డబ్బులు రిటన్ రావడం లేదు. పాస్‌బుక్‌లు రెండు, మూడు నెలల నుండి రావడం లేదు. పాస్‌బుక్‌లు రాకుంటే ఎవరిని అడగాలనేది స్పష్టత లేదు. విల్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు ఆప్షన్ లేదు. ఒక కుటుంబంలో ముగ్గురు వారసులుంటే ఏ ఒక్కరో విరాసత్ కోసం స్లాట్ బుక్ చేసుకుంటే వారికే వారసత్వ హక్కులు కల్పించబడతాయి. విచారణకు అవకాశం లేదు. ధరణిలో క్రమంగా ఒక్కొక్కటి పెంచుతూ 35మాడ్యూల్స్ చేర్చారు. బాధితులు పెట్టుకున్న పిటిషన్ అంగీకరించబడిందా లేదా రిజెక్ట్ చేశారా? రిజెక్ట్ చేస్తే కారణమేంటి అనేది తెలపడం లేదు. ఎవరిని అడగాలి, ఎవరు జవాబుదారో తెలియదు. నాలా కన్వర్షన్‌కు వెరిఫికేషన్ అవసరం లేదు. రిజిస్టర్ సర్టిపై కాఫీ ఇవ్వడం లేదు. మిస్సింగ్ సర్వే నెంబర్లు చేర్చడానికి సిసిఎల్ఏ ఆమోదించాలి. ధరణికి ముందు అనేక సర్వే నెంబర్లు మిస్సయ్యాయి. పాత రికార్డులు ప్రకారం మిస్ అయిన సర్వే నెంబర్లు అన్ని చేర్చవచ్చును. కానీ వేలకొద్దీ అప్లికేషన్స్ వస్తున్నప్పటికీ పెండింగ్‌లో పెడుతున్నారు. ధరణి యాప్‌లో చెప్పుకోదగినది ఏమైన ఉందంటే అది ధరణిలో ల్యాండ్ నమోదై ఉంటే స్లాట్ బుక్ చేసుకొని వెంటనే అమ్మకాలు, కొనుగోలు చేసుకోవచ్చు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్లను సమన్వయం చేసి రిజిస్ట్రేషన్ అయిన వెంటనే మ్యుటేషన్ కావడం ఒక్కటే. అది కూడా పేదల కంటే పెద్దలకు ఎక్కువగా ఉపయోగపడేది. ధరణికి ముందు మ్యుటేషన్ కోసం తహసీల్దార్ ఆఫీస్ చుట్టూ తిరగాల్సి వచ్చేది. పాస్‌బుక్ కావాలంటే రూ.వెయ్యి, రెండువేలు కిందిస్థాయి సిబ్బంది తీసుకొని పాస్‌బుక్ ఇచ్చేవారు. ఇప్పుడు అధికారికంగానే ఎకరాకు రూ.2500 మ్యుటేషన్ ఛార్జీలు వసూలు చేస్తున్నారు. నాలుగెకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే రూ.10వేలు మ్యుటేషన్ ఛార్జీల కింద ప్రభుత్వానికి చెల్లించాలి. మ్యుటేషన్ ఫీజు మాత్రమే కాదు, దరఖాస్తుదారులు పెండింగ్ సమస్యలన్నిటికీ వేలల్లో ఫీజులు చెల్లించుకోవాల్సి వస్తుంది. సమస్య సృష్టించింది ప్రభుత్వ రెవెన్యూ యంత్రాంగం. ఫీజులు చెల్లిస్తున్నది మాత్రం రైతులు. గ్రీవెన్స్ రోజైన సోమవారం కలెక్టర్లకు వస్తున్న దరఖాస్తుల్లో భూ సమస్యలకు సంబంధించినవే అధికం.

> నిజాం కాలంలో 1923 సంవత్సరం నుండి 1953 వరకు తెలంగాణలోని వివిధ జిల్లాల్లో క్షేత్ర స్థాయిలో భూకమతాల వారిగా భౌతికంగా సర్వే చేసి భూ హద్దు రాళ్లు పాతారు. నెంబర్లు కేటాయించారు. 'నక్షా' (మ్యాపు)లు రూపొందించారు. అప్పటికి ఎటువంటి శాటిలైట్ వ్యవస్థ, డిజిటల్ పరికరాలు ఊహలో కూడా లేనికాలంలో మాన్యువల్‌గా అద్భుతమైన కచ్చితత్వంతో కూడిన 'నక్షా'లు భూ కమతాల వారిగా రూపొందించారు. గ్రామ పటాలు తయారు చేశారు. కొలతలు, స్కెలింగ్ నేటికీ ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. మూడంచెల వ్యవస్థలో రికార్డులు భద్ర పరిచారు. జిల్లా, తాలూకా, గ్రామం, పట్టాదారు పేర్లు, భూ విస్తీర్ణం, భూ స్వభావం రికార్డు చేశారు. ప్రభుత్వ భూములు, ఇనాం భూములు, బంజర, పోరంబోకు, గైరాన్ భూములు, గ్రామ కంఠం, సర్వేఖాస్ తదితర అనేక భూముల వివరాలు పొందుపరిచారు.

అనేక సమస్యలపై వేసిన మంత్రివర్గ సబ్ కమిటీల లాగానే ధరణి, భూ సమస్యలపై వేసిన మంత్రివర్గ ఉప సంఘం కూడా ఉన్నది. ప్రారంభంలో కొన్ని మాడ్యూల్స్, ఆప్షన్స్ ధరణిలో చేర్చడం కోసం సూచనలు చేసి వదిలేశారు. ధరణికి ముందున్న రెవెన్యూ రికార్డులు పరిశీలించి, రికార్డులు అప్‌డేట్ చేసి ప్రభుత్వమే సమస్యలన్నీ పరిష్కరించాలి. బాధితుల వివిధ రకాల దరఖాస్తులను ఫీజులు లేకుండా నిర్దిష్ట పిరియడ్‌లో పరిష్కరించాలి. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారమయ్యేవరకు తహసీల్దార్లకు అధికారమివ్వాలి. ప్రభుత్వ పెద్దలు ఇవి చేసిన తర్వాతే ధరణి గురించి మాట్లాడితే బాగుంటుందేమో!

సెల్:9490098857



# ఉత్తర్వులిచ్చి... ఊరుకున్నారు

● జీఓల గెజిట్‌కు రాజకీయ గ్రహణం ● పదేండ్లుగా సవరించని వైనం

## 75షెడ్యూల్డ్ పరిశ్రమల్లో 1.20కోట్ల మంది కార్మికులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ఆర్థికాభివద్ధికి పారిశ్రామికీకరణ ప్రధాన వ్యూహమని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది. పారిశ్రామిక రంగంలో జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం, రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలలో కూడా ఉపాధి అవకాశాలను సష్టించడం కోసం తెలంగాణ ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించింది. 'పరిశోధన నుంచి ఆవిష్కరణ, ఆవిష్కరణ నుంచి పరిశ్రమకు, పరిశ్రమ నుంచి శ్రేయస్సు' అనే లక్ష్యాలతో తెలంగాణలో-ఇన్నోవేట్, ఇంక్యుబేట్, ఇన్‌కార్పొరేట్ అనే నినాదంతో కొత్త 'పారిశ్రామిక విధానం-2015'ను రూపొందించింది. ఈ విధానంతో పారిశ్రామిక అనుమతులు సులభతరమై పరిశ్రమల స్థాపనలో ఉన్న అనవసరమైన అడ్డంకులు తొలిగి రాష్ట్రంలోకి పరిశ్రమలు వెల్లువెత్తుతాయని ప్రభుత్వం భావిస్తోంది. అయితే పరిశ్రమలు పెట్టడానికి ఏ తరహాలో అనుమతులిస్తున్నామో..అదే తరహాలో కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పలుమార్లు ప్రకటించారు. కాని పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. షెడ్యూల్డ్ పరిశ్రమల్లో కనీసవేతనాలకు సంబంధించిన ఉత్తర్వులను జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోంది.

**75షెడ్యూల్డ్ పరిశ్రమలు**

తెలంగాణ రాష్ట్రంలో 75షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ యూనిట్స్ ఉన్నాయి. మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్, డిస్టిలరీస్, బ్రేవరీస్, కెమికల్స్, ఫార్మాసూటికల్స్, మెటల్‌ఫౌండరీస్, జనరల్ ఇంజనీరింగ్, కాంట్రాక్టు లేబర్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇండస్ట్రీ, సెక్యూరిటీ సర్వీసెస్, సాఫ్ట్‌డ్రింక్స్, ఎరేటెడ్ వాటర్ మాన్యుఫ్యాక్చరింగ్, స్పినింగ్‌మిల్స్, స్టీల్‌మిల్స్, స్టీల్‌రోలింగ్‌మిల్స్122, పెట్రోల్‌బంకులు, రైస్/దాల్/రోలర్‌ఫ్లోర్ మిల్లులు, హాస్పిటల్స్, నర్సింగ్‌హోమ్స్, గార్మెంట్స్, నిర్మాణ రంగం, రోడ్లు, భవనాల నిర్వహణ, ఆయిల్‌మిల్స్, షాప్స్, కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్, పౌల్ట్రీ, బేకింగ్ ప్రాసెస్, బిస్కెట్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలు ఉన్నాయి. వీటిల్లో 1.20కోట్ల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో స్కిల్డ్, సెమిస్కిల్డ్, అన్‌స్కిల్డ్ వర్కర్లు ఉన్నారు. ఈ రంగాల్లో రోజుకు 8గంటలు పనిచేస్తే నెలబేసిక్+వీడీఏను కలిపి కనీస వేతనం ఇవ్వాలి. 12గంటలు పనిచేస్తే ఓవర్‌టైం డబుల్ వేతనం ఇవ్వాలి. వార్షిక బోనస్ కూడా ఇవ్వాలి. కానీ వీటిలో ఏఒక్కటీ అమలు చేయడంలేదు.

**గెజిట్‌కు రాజకీయ గ్రహణం**

మొరపెట్టున్నా పట్టించుకోని సర్కార్

కనీస వేతనాల చట్టం 1948 ప్రకారం పెరిగిన ధరలకు అగుణంగా ప్రతి ఐదేండ్లకొకసారి సవరించి పెంచాలి. ఉమ్మడి రాష్ట్రం నుంచి లెక్కిస్తే మూడు సార్లు సవరించాలి. తెలంగాణ రాష్ట్రంలో పదేండ్ల కాలంలో రెండు సార్లు సవరించాల్సి ఉంది. కానీ ఆ ఊసేలేదు. పైగా కార్మికుల సంక్షేమం గురించి ఊదరగొడుతున్న రాష్ట్ర ప్రభుత్వం కనీసవేతనాల జీఓలను అటకెక్కించింది. 2021 జూన్‌లో ఐదు రంగాలకు కనీసం వేతనం రూ.18వేలుగా నిర్ణయించి ఉన్నతాధికారులు ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి గెజిట్ చేయకుండా స్వయాన ముఖ్యమంత్రి కార్యాలయమే అడ్డుకున్నది. రాష్ట్ర ప్రభుత్వం మూడు సార్లు కనీసవేతన సలహా మండలిని ఏర్పాటు చేసింది. మండలి సిపార్సులను అమలు చేయకుండా తొక్కిపెట్టింది.



### కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలి



షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలను వెంటనే అమలు చేయాలి. కనీసవేతనం రూ.26వేలుగా నిర్ణయించి అమలు చేయాలి. పెరుగుతున్న శాస్త్రసాంకేతికత దృష్ట్యా రోజుకు 7గంటలు, వారానికి ఐదురోజులు పనిదినంగా ఉండాలి. కాంట్రాక్టు కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ, సెలవులు, బోనస్, గ్రాట్యుటీ అమలు చేయాలి.

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్.

### వలస కార్మికుల దుస్థితి

రాష్ట్రంలో 80శాతం మంది వలసకార్మికులు ఉన్నారు. బీహార్, ఒరిస్సా, బెంగాల్, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాలకు చెందినవారనేకులు తెలంగాణలో పనిచేస్తున్నారు. మహిళా కార్మికుల సంఖ్య కూడా గణనీయంగానే ఉందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కానీ ఈ వలసకార్మికులకు హక్కుల్లేవు. చట్టాలు అమలుకావు. రోజుకు 12గంటలకుపైగానే పనులు చేయిస్తున్నారు. కనీసవేతనాల్లేవు. ఓవర్‌టైం వేతనం చెల్లించడంలేదు. వలసకార్మికులే లేకపోతే రాష్ట్రంలో నిర్మాణరంగం ఒక్కసారిగా పడిపోతుందని అధికారులే చెబుతున్నా కరోనా సమయంలో వీరి బాధతలు వర్ణణాతీతం. వీరు నిర్మాణ రంగంతోపాటు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల్లో అధికంగా పనిచేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో పనులు దొరక్క ఇక్కడికి వలసవస్తున్నారు.

## వేతన పెంపు జీవో 60 అమలు చేయాలి

● జీపీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి : కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

● రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలో కార్మికులు



నవతెలంగాణ- విలేకరులు

గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెపై ప్రభుత్వం స్పందించాలని, వేతన పెంపు జీవో 60ను అమలు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. వేతనాల పెంపు, పర్మినెంట్, మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోంది. పోటీ కార్మికులతో పనులు చేయించేందుకు అధికారులు యత్నించడమే కాకుండా విధుల్లో నుంచి తొలగిస్తామంటూ బెదిరించినా వెనక్కి తగ్గకుండా తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు సమ్మె చేస్తున్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా కీసర ఎంపీడీవో ఆఫీస్ ఎదుట సమ్మెకు కేవీపీఎస్ జిల్లా నాయకత్వంతో కలిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు సంఘీభావం ప్రకటించారు. అనంతరం కార్మికుల అర్ధనగ్న ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల పెంపు జీవో 60ని పకడ్బందీగా అమలు చేసి వారికి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులతో వెట్టిచాకిరీ చేయించే జీవో 51ని రద్దు చేసి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. తక్షణమే గ్రామ పంచాయతీ కార్మికులను చర్చలకు ఆహ్వానించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఖమ్మం జిల్లా తల్లాడలో జీపీ కార్మికుల దీక్షలకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మానవతరాయి సంఘీభావం తెలిపారు. కొణిజర్ల, వేంసూరులో అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. కూసుమంచిలో పంచాయతీ కార్యదర్శి ప్రయివేట్ వ్యక్తులను నియమించి పారిశుధ్యం పనులు చేయిస్తుండగా జీపీ కార్మికులు అడ్డుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో జీపీ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన చేపట్టారు.

# పల్లెలు కంపు కొడుతున్నాయ్

(మొదటిపేజీ తరువాయి)

ఐదో తేదీన పంచాయతీరాజ్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. రాష్ట్ర సర్కారు అస్సలు పట్టించుకోలేదు. విధిలేని పరిస్థితుల్లో జులై ఆరో తేదీ నుంచి పంచాయతీ కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. రాష్ట్రంలో మొత్తం 553 గ్రామీణ మండలాలుండగా అందులో 482 మండలాల్లో సమ్మె ఉధృతంగా కొనసాగుతున్నది. కార్మికులందరూ విధులను బహిష్కరించి సమ్మెలో ఉన్నారు. ప్రస్తుతం సమ్మెలో 35 వేల మంది కార్మికులు రెగ్యులర్‌గా పాల్గొంటున్నారు. కొందరు ఇండ్ల వద్దనే ఉంటున్నా విధులను మాత్రం నిర్వర్తించడం లేదు. వారి డిమాండ్లన్నీ న్యాయమైనవే. రాష్ట్ర సర్కారే మొండిగా వ్యవహరిస్తూ వారిని పట్టించుకోవడంలేదు. దీంతో గ్రామాల్లో పారిశుధ్య పనులన్నీ నిలిచిపోయాయి. ఇంట్లో ఒక్కరోజు చెత్త పేరుకుపోతేనే కంపు వాసన కొడుతుంది. అలాంటిది గ్రామాల్లో వారం రోజులుగా పారిశుధ్య పనులు నిలిచిపోయవడంతో శానిటేషన్ అస్తవ్యస్తంగా తయారైంది. నీటిసరఫరా ఆగిపోయింది. వారం రోజుల్లో, పది రోజుల్లో సమ్మె చేస్తే ప్రజల నుంచి వారి పట్ల తీవ్ర వ్యతిరేకత మొదలవుతుందని భావించి రాష్ట్ర సర్కారు మొండిగా వ్యవహరిస్తున్నది. కానీ, సర్కారు ఆలోచనకు భిన్నంగా గ్రామపంచాయతీ పాలకమండళ్ల నుంచీ, ప్రజల నుంచీ వారి సమ్మెకు రోజురోజుకీ మద్దతు పెరుగుతున్నది. అతితక్కువ వేతనంలో వాళ్ల కుటుంబాలు ఎలా గడుస్తున్నాయనే సానుభూతి ప్రజల్లో వ్యక్తమవుతున్నది.

**ఆ పనికి మేం రాం..రాం..**

పంచాయతీ కార్మికుల సమ్మెతో గ్రామాల్లో ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించుకుని పనులు చేయించాలని రాష్ట్ర సర్కారు ఆదేశాలు జారీ చేసింది. వీరు కాకపోతే ఇంకొకరు దొరకరా? అన్న సర్కారు ఆలోచన తప్పు అని నేడు క్షేత్రస్థాయిలో రుజువు అవుతున్నది. మోరీల శుద్ధీ, ఇంటింటికెళ్లి చెత్త సేకర ణ పనికి రావాలని సర్పంచులు డప్పుచాటింపు వేసి నా ఫలితం ఉండటంలేదు. చివరకు సర్పంచులు గ్రా మంలో ఎవరిని అడిగినా 'ఎంత కూలిచ్చినా ఆ పనికి మేం రాం' అని బాహాటంగానే చెబుతున్నారు. ట్రాక్టర్లు నడిపేందుకు, కరెంటు పనులు చేసేందుకు, నీళ్లు పెట్టేందుకు కొందరు ముందుకొచ్చినా రోజుకు రూ.800 నుంచి రూ.1000 అడుగుతున్నారు. అంత ఇచ్చి అక్కడక్కడా సర్కారు పనిచేయిస్తున్నది. అంటే నెలకు లెక్కగడితే ఆ వేతనం రూ.24 వేల నుంచి 30వేల దాకా అవుతున్నది. పంచాయతీ కార్మికులు అంత ఏం అడగట్లేదు. జీవో నెంబర్ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లకు రూ.19,500 ఇవ్వాలని కోరుతున్నారు. దీన్ని బట్టే పంచాయతీ కార్మికుల డిమాండ్‌లో ఎంత న్యాయం ఉందో అర్థం చేసుకోవచ్చు. చెత్త సేకరించడం, మోరీ లు ఎత్తిపోయడం లాంటి పనులు చేసేందుకు ఎవ్వ రూ ముందుకు రాకపోవడంతో నల్లగొండ జిల్లా మునుగోడు సర్పంచి మిర్యాల వెంకన్న స్వయంగా తానే చెత్త సేకరణకు పూనుకున్నారు. నల్లగొండ మం డలం జి.చెన్నారం సర్పంచ్ ఉప్పునూతల వెంకన్న కూడా స్వయంగా చెత్త సేకరిస్తున్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ సర్పంచ్ ఆరెపల్లి మహదేవ్‌గౌడ్ కూడా గ్రామంలో చెత్త సేకరించారు. ఇవి మచ్చుకు కొన్ని ఉదహరణలు మాత్రమే.

# యమున ఉగ్రరూపం

న్యూఢిల్లీ : ఉత్తర భారతదేశంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు దేశరాజధాని ఢిల్లీ తీవ్రంగా ప్రభావితమవుతున్నది. అక్కడి యమునా నది ఉప్పొంగి ప్రవహిస్తున్నది. గతంలో ఎన్నడూ లేనంతగా నీరు ప్రమాదకర స్థాయికి చేరుకున్నది. పాత రైల్వే బ్రిడ్జి వద్ద 207.66 మీటర్ల స్థాయికి నీరు చేరుకున్నది. 1978లో ఇది అత్యధికంగా 207.49 మీటర్ల స్థాయికి చేరుకున్నది. దాదాపు 45 ఏండ్ల తర్వాత అంతకు మించి చేరుకోవటం గమనార్హం. నది ప్రవాహం ప్రమాదకర స్థాయికి చేరుకోవటంతో వరద ప్రభావిత ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించటానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. నగర యంత్రాంగం ముందస్తు భద్రతా చర్యల కు దిగింది. ఢిల్లీ పోలీసులు వరద ప్రభావిత ప్రాంతా ల్లో ప్రజలు గుమిగూడకుండా నిరోధించేందుకు 144 సెక్షన్‌ను విధించారు. శనివారం నుంచి ఢిల్లీ- దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు నీటి స్థాయి పెరుగుద లకు కారణమని అధికారులు తెలిపారు. ఆదివారం నాడు నగరంలో అత్యధికంగా 153 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 1982 తర్వాత ఒక రోజులో అత్యధిక వర్షపాతం ఇదే కావటం గమనార్హం.

**హర్యానా నుంచి యమునా నదిలోకి నీరు విడుదల**

అంతేకాకుండా పక్కన ఉన్న హర్యానాలోనూ కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీని ప్రభావంతో అక్కడి అధికారులు యమునానగర్‌లోని హత్నికుండ్ బ్యారెజీ నుంచి యమునా నదిలోకి నీటిని వదలట మూ ఉధృత ప్రవాహానికి కారణమైంది. ప్రభావిత ప్రజలను రక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహాయక చర్యల్లో భాగంగా నీటి పారుదల మరియు వరద నియంత్రణ విభాగం 45 పడవలను రంగం లోకి దించింది. ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని పాత రైల్వే బ్రిడ్జిని మూసేసినట్టు ఈ విభాగం అధికారులు వెల్లడించారు. అధిక నీటి స్థాయిని నిరోధించి, ఎక్కువైన నీటిని విడుదల చేసేందుకు ఓఖ్లా బ్రిడ్జి అన్ని గేట్లనూ ఎత్తినట్టు వివరించారు.

**ఢిల్లీ సర్కారు అప్రమత్తం**

యమునా నది ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తుండటంతో ఢిల్లీ ప్రభుత్వం అప్రమత్త మైంది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అధికారులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రం జోక్యాన్ని ఆయన కోరారు. ఈ రాత్రి యమునా నదిలో నీటి స్థాయి 207.72 మీటర్లుగా సెంట్రల్ వాటర్ కమిషన్ అంచనా వేసిందని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. " ఢిల్లీకి ఇది మంచి వార్త కాదు. గత రెండ్రోజులగా ఢిల్లీలో వర్షాలు లేవు. అయినప్పటికీ.. హర్యానాలోని హత్నికుండ్ బ్యారేజీ వద్ద అత్యధిక స్థాయిలో నీటిని విడవటంతో యుమునా నది ప్రవహిస్తున్నది" అని వివరించారు. పరిస్థితులను ఎదుర్కోవటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ఢిల్లీ జల మంత్రి సౌరభ్ భరద్వాజ్ అన్నారు. యుమునా నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేం దుకు ప్రయత్ని స్తున్నామని చెప్పారు. వారికి వసతి, ఆహారం కోసం అన్ని చర్యలూ తీసుకున్నట్టు వివరించారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించండి

● ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్

● తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ సంయుక్త కార్యాచరణ సమితి మహాధర్నా

నవతెలంగాణ - అడిక్‌మెట్



కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ సంయుక్త కార్యాచరణ సమితి జేఏసీ ఆధ్వర్యంలో రెండో దశ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద పెన్షనర్లు బుధవారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెన్షనర్లకు నగదు రహిత చికిత్స వర్తింపజేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్కీమ్‌ను యూనివర్సిటీ, రిటైర్డ్ కాలేజీ టీచర్స్, జీహెచ్ఎంసీ, ఎయిడెడ్ మార్కెట్ కమిటీ పెన్షనర్లకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు రెండు నెలల్లోనే చెల్లించి సంబంధిత ట్రెజరీ/ పెన్షన్ పేమెంట్ అధికారులకు అప్పగించాలని కోరారు. ప్రతి జిల్లాలో కనీసం రెండు "వెల్‌నెస్ సెంటర్లు" ఏర్పాటు చేసి డాక్టర్లు, మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. పెన్షనర్లకు బకాయి ఉన్న మూడు కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. పెన్షనర్ల భవన్ నిర్మాణం, కార్యాలయ నిర్వహణ ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు హైదరాబాద్‌లో వెయ్యి గజాల స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అప్పటి వరకు ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఏదైనా ఒక ప్రభుత్వ భవనం కేటాయించాలన్నారు. తెలంగాణా ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఒక ప్రత్యేక ఇంక్రిమెంటు ఇచ్చి గౌరవించి గుర్తించారని.. అదే ఉద్యమంలో పెన్షనర్లు అందరూ పాల్గొని తమ వంతు పాత్ర పోషించారని గుర్తు చేశారు. వారికి కూడా తెలంగాణ ఇన్సెంటివ్ ఇచ్చి గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాలో ప్రొఫెసర్ కోదండరామ్, తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ సంయుక్త కార్యాచరణ సమితి చైర్మెన్ కె.లక్ష్మయ్య, జనరల్ సెక్రెటరీ సుధాకర్‌రావు, కృష్ణ ప్రసాద్, విశ్వేశ్వరరావు, లింగారెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు చావ రవి, ఎస్‌టీయూటీఎస్ సదానంద్, జేఏసీ నాయకులు సూర్యనారాయణ, కృష్ణమూర్తి, భరత్‌రెడ్డి, తులసి, సత్యనారాయణ, జయప్రకాశరావు, బీఎస్‌వీఏఎస్ ప్రసాద్, ఎస్ జ్ఞానేశ్వర్, ఎంవీ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ రక్షణకు పోరాడుదాం

● వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంపై దాడి తీవ్రతరం చేసిందనీ, దాన్ని రక్షించుకునేందుకు జరిగే పోరాటంలో ప్రతి ఒక్కరూ కలిసిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న పెట్టుబడిదారీ, మతోన్మాద విధానాల వల్ల ప్రజల సామాజిక, ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో నేటికీ ఇండ్లు, ఇంటి స్థలం లేని పేదలుండటం సిగ్గుచేటన్నారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్రాములు మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, పేదరికం విపరీతంగా పెరిగిపోయిందనీ, మోడీ ఉద్యోగాల కల్పన, నల్లధనం ప్రజలకి పంచుతామనే మాటలు ఉట్టి మాటలుగా తేలిపోయిందని విమర్శించారు, వ్యవసాయ కార్మికులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు మొదటి ప్రాధాన్యత ఇచ్చి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. మన దేశం భిన్నత్వంలో ఏకత్వం గలదనీ, అనేక సంస్కృతుల మిళితమని అన్నారు, మతం ప్రజల వ్యక్తిగత అంశమనీ, బీజేపీ, ఆరెస్సెస్ మతాన్ని రాజకీయాలకు వాడుకుంటున్నాయని విమర్శించారు, వారి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే దేశంలో ప్రజల మధ్య తినే ఆహారం,కట్టుకునే దుస్తులు,మాట్లాడే భాష, వంటి అనేక అంశాలను రెచ్చగొట్టి వివాదాలను సృష్టిస్తున్నారని చెప్పారు. ఫలితంగా దేశాభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, నారి అయిలయ్య, పొన్నం వెంకటేశ్వరరావు, బి.పద్మ, రాములు, అలవాల వీరయ్య, నర్సింహ, రేపాకుల శ్రీనివాస్, మట్టిపల్లి సైదులు, మెరుగు సత్యనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## భాష్యంలో ఘనంగా ఫ్రెషర్స్ డే



**నవతెలంగాణ- వనస్థలిపురం**

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని భాష్యం పాఠశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భాష్యం పాఠశాల జే ఈవో అంకమ్మరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంకమ్మరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ఎన్నికల ప్రక్రియ తెలిసి ఉంటే.. అర్హులైన వారికి ఓటు వేసే జ్ఞానం పెరుగుతుందని, ఈ పరిజ్ఞానం వలన సమాజం చైతన్యం అవుతుందన్నారు. తర్వాత విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల కార్యక్రమంలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కే సుజాత, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ హేమ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## 'ఓటు హక్కు నమోదు చేసుకోవాలి'




**నవతెలంగాణ- చైతన్యపురి**

18 ఏళ్ల నిండిన యువతీ యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆర్కేపురం డివిజన్ యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు శ్యామ్ గుప్తా సూచించారు. ఆర్కేపురంలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందన్నారు. 18 ఏళ్లు నిండిన వారు, అడ్రస్ మార్పు కోసం, పేర్లు, ఫోటో తప్పుగా పడితే సవరణ కోసం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పగడాల దీపక్, కపిల్, లోకేష్, నరేందర్ పాల్గొన్నారు.

## మంత్రి కేటీఆర్‌ను కలిసిన మంద సంజీవరెడ్డి



**నవతెలంగాణ-బోడుప్పల్**

బోడుప్పల్ నగర పాలక సంస్థ అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని కోరుతూ నగర అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి బుధవారం ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి నేతృత్వంలో బోడుప్పల్ మేయర్, కార్పొరేటర్లతో కలిసి సచివాలయంలో మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత బోడుప్పల్ నగరానికి కావాల్సిన నిధుల వివరాలను మంత్రి కేటీఆర్‌కు అందించారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ బోడుప్పల్ అభివృద్ధికి అవసరమైన నిధులు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవి గౌడ్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



**నవతెలంగాణ- బడంగ్‌పేట్**

మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరామ కాలనీకి చెందిన చర్చి పాస్టర్లు, 30 మంది యువకులు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు బుధవారం సూరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న చర్చి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి మాట్లాడుతూ రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల జనార్దన్, 16 వార్డ్ అధ్యక్షులు పి.నాగేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు సయిద్ పటేల్, సూరెడ్డి సత్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**చైతన్యపురి :**

**మంత్రికి బోనాల ఆహ్వాన పత్రం అందజేత**



ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ ఫేస్ -3 లో వచ్చే ఆదివారం నిర్వహించే బోనాల పండగ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ బుధవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో వలిగొండ దీపు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, నాయకులు సాజీద్, మురళీధర్ రెడ్డి, నితీష్, అనిల్, పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డ వజ్రేష్



**నవతెలంగాణ-బోడుప్పల్**

తమ హక్కుల కోసం పోరాడిన రైతులకు బేడీలు వేసిన బీఆర్ఎస్ పార్టీ నేతలా..రేవంత్ రెడ్డిని విమర్శించేది అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాటలను బీఆర్ఎస్ పార్టీ వక్రీకరించి దుష్ప్రచారం చేస్తుందని విమర్శించారు. ఉచిత విద్యుత్‌కు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదు, ఉచితాల పేరుతో విద్యుత్ సంస్థల వద్ద బీఆర్ఎస్ ప్రభుత్వం వసూలు చేసే కమీషన్లకు మా పార్టీ వ్యతిరేకం అని వివరించారు. రైతు పక్షపాతి అని చెప్పుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం జలయజ్ఞమే ధనయజ్ఞంగా పనిచేస్తుందని ఆరోపించారు. కాళేశ్వరం పేరుతో లక్షల ఎకరాలు సస్యశ్యామలం చేస్తున్నామని చెప్పుకునే ప్రభుత్వం.. కాళేశ్వరం బ్యాక్ వాటర్, ముంపు ప్రాంతాల ప్రజలు, రైతులకు అందించిన నష్టపరిహారం ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు పక్షపాతి కాంగ్రెస్ పార్టీ యేనని నేను సగర్వంగా చెప్పుకోగలం...ఎందుకంటే 24 గంటల ఉచిత విద్యుత్ ను ప్రవేశపెట్టింది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీయే అని చెప్పారు. అదేవిధంగా ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసింది కాంగ్రెస్ పార్టీయే తప్పా..బీఆర్ఎస్ ప్రభుత్వం కాదన్నారు. రాష్ట్రంలోని 95% ఉన్న చిన్న సన్న కారు రైతులను దృష్టిలో ఉంచుకొని ఎకరానికి గంట చొప్పున 8 ఎకరాలకు ఎనిమిది గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని చెప్పిన రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్ స్టేషన్ల ఎదుట ధర్నా పేరుతో నీచ రాజకీయాలకు తెర లేపడం సిగ్గుచేటని విమర్శించారు.

## 'సాయి ప్రియా నగర్ కాలనీ సమస్యలు పరిష్కరించండి'



**నవతెలంగాణ-బోడుప్పల్**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయిప్రియా నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వంశీకృష్ణకు కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు కొండలు రెడ్డి మాట్లాడుతూ సాయి ప్రియా నగర్ కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్, మంచినీటి, తాగునీటి సౌకర్యం, రోడ్డు వసతి లేక దుర్భర పరిస్థితులలో కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కాలనీ ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, శ్రీశైలం, మల్లారెడ్డి, రంజీత్, చంద్రశేఖర్, శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల ఫోరం కన్వీనర్‌గా భూపాల్ రెడ్డి



**నవతెలంగాణ- చైతన్యపురి**

ఎల్బీనగర్ నియోజకవర్గం తెలంగాణ వినియోగదారుల ఫోరం కన్వీనర్‌గా ఆర్కేపురం డివిజన్‌కు చెందిన పగిళ్ల భూపాల్ రెడ్డి నియమితులయ్యారు. ముసరంబాగ్‌లోని జిల్లా తెలంగాణ వినియోగదారుల సమావేశం రాష్ట్ర అధికార ప్రతినిధి దయానంద ఆధ్వర్యంలో బుధవారం భూపాల్ రెడ్డి నియామక పత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా జాతీయ కన్వీనర్ రాథోడ్, రాష్ట్ర అధ్యక్షులు అంబు రాథోడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపాల్ మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టాన్ని ప్రజలందరూ ఉపయోగించుకునే విధంగా చైతన్య పరచాలని సూచించారు. అనంతరం భూపాల్ రెడ్డి మాట్లాడుతూ నాసిరకం వస్తువులను అంటగట్టే వ్యాపారస్తులను నిలదీసే విధంగా చైతన్యపరిచేందుకు వారికి అవగాహన కల్పిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్ రాజ్, అడ్వైజర్ యాదయ్య, రామ్మోహన్ స్వామి, దిలీప్ కుమార్, శ్రీధర్, ప్రశాంత్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్‌కు మున్సిపల్ కార్మికులు




**నవతెలంగాణ - తుర్కయాంజల్**

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్, ఎన్ఎమ్ఆర్ తదితర సిబ్బంది ని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం తుర్కయాంజాల్ మున్సిపల్ కార్మికులు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిషన్ ఆధ్వర్యంలో ఛలో హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ 12వ పీఆర్సీ ఛైర్మన్ సిఫారసు చేసిన వేతనాలు వివిధ కేటగిరీల వారీగా రూ.19,000, రూ.22,900, రూ.31,040 కనీస వేతనాలు నిర్ణయించి ఇవ్వాలని, ప్రమాదంలో మరణించిన మున్సిపల్ కార్మికులందరికీ రూ.25లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని వర్తింపజేయాలని, ఇతర పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తుర్కయాంజాల్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.నగేష్, నాయకులు ఎస్.యాదగిరి, మేతరి నవీన్, మహేష్, రవి చందర్, శివ, మురళి, మహిపాల్, అమర్, రమేష్, లక్ష్మమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్ నగర్‌లో బోనాల చెక్కులు పంపిణీ



**నవతెలంగాణ- సంతోష్ నగర్**

బోనాల పండుగ సందర్భంగా యాకూత్ పురా నియోజకవర్గం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని దామోదర సంజీవయ్య నగర్ కాలనీ (డీఎస్) నల్ల పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ అసోసియేషన్ సభ్యులకు నియోజకవర్గ ఇంచార్జి సామ సుందర్ రెడ్డిలతో కలిసి ఆలయ కమిటీ నిర్వాహకులకు బోనాల చెక్కులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బోనాల పండుగను ప్రతిష్టాత్మకంగా తీసుకుని అన్ని ఆలయాలకు నిధులు మంజూరు చేసిందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుడు సోమ్లా నాయక్‌కు పరామర్శ



**నవతెలంగాణ- సంతోష్ నగర్**

గ్రేటర్ హైదరాబాద్ స్వచ్ఛ ఆటో ఓనర్ కం డ్రైవర్ పాత్లావత్ సోమ్లా నాయక్‌ను బుధవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కలమడుగు రాజేందర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కాట్రావత్ గోపాల్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జున్, హంస రాజు, శేఖర్, ప్రవీణ్, పరశురాం, ప్రభాకర్, మహానంది, లక్ష్మణ్, రాము, రేణు కుమార్ నాయక్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 12న దిలు సుఖ్‌నగర్ సరస్వతి కాలనీ పరిధిలో గుర్తుతెలియని వాహనం సోమ్లా నాయక్‌ను ఢీ కొట్టిందన్నారు. విషయం తెలుసుకొని సోమ్లా నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి..రూ.52 వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. సోమ్లా నాయక్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం అంద జేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో పీర్జాదిగూడ శానిటరీ ఇన్‌స్పెక్టర్

**నవతెలంగాణ-బోడుప్పల్**

కార్పొరేషన్ కార్యాలయానికి శానిటరీ వస్తువులు సరఫరా చేసే కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటుండగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానకిరెడ్డిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండడ్ గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసే కె.జానకి రెడ్డి కార్యాలయానికి శానిటరీ వస్తువులు సరఫరా చేసే కాంట్రాక్టర్ శ్రీరాములు కు బిల్లులు మంజూరు చేయడానికి గాను లంచం డిమాండ్ చేయడంతో అ కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను సంప్రదించి జరిగిన విషయం చెప్పాడు. నిఘా పెట్టిన ఏసీబీ అధికారులు బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో కార్యాలయంలోని శానిటేషన్ విభాగంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సహాయకురాలు సరోజ ద్వారా కాంట్రాక్టర్ నుంచి రూ.20 వేలు తీసుకుంటుండగా కాపు కాసి ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకుని విచారించగా చేసిన నేరం అంగీకరించారు. వారి వద్ద నుండి రూ. 20 వేలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరిచారని ఏసీబీ అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ తెలిపారు.

## చిరు వ్యాపారికి మూడు రోజుల జైలు

**నవతెలంగాణ -సంతోష్ నగర్**

నిబంధనలు అతిక్రమించిన ఓ చిరు వ్యాపారికి మూడు రోజుల జైలు శిక్ష పడింది. డబీర్పురా సీఐ కోటేశ్వర్ రావు కథనం ప్రకారం..డబీర్పురాలోని కాలిబాటలపై తరుణ్ అనే వ్యక్తి చిరు వ్యాపారం చేస్తుంటాడు. సోమవారం అర్ధరాత్రి గడువు ముగిసినా వ్యాపారం కొనసాగిస్తుండడంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం నాంపల్లి 6వ ప్రత్యేక ఎంఎం న్యాయ స్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి లక్ష్మణ్ రావు జైలు శిక్ష విధించినట్లు సీఐ కోటేశ్వర్ రావు తెలిపారు.

## భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

- ప్రొఫెసర్ కోదండరామ్



**నవతెలంగాణ-ఘట్కేసర్**

ఘట్కేసర్-కొండాపూర్ రైల్వే వంతెన నిర్మాణం కోసం భూమి కోల్పోయిన భూ నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ డిమాండ్ చేశారు. ఘట్కేసర్ మున్సిపాలిటీలోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్లో బుధవారం ఘట్కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశానికి కోదండరామ్ ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 17 సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న రైల్వే వంతెనను నిర్మించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ వంతెన నిర్మాణం చేయకపోవడంతో ఘట్కేసర్ అభివృద్ధి కుంటుపడిందని, అలాగే ఆర్థిక లావాదేవీలకు అవరోధం కలుగుతుందన్నారు. మంత్రి మల్లారెడ్డి నిర్లక్ష్యం వలనే వంతెన నిర్మాణంలో జాప్యం జరుగుతుందన్నారు. రైల్వే వంతెన సాధనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. వెంటనే రైల్వే వంతెన నిర్మాణం చేపట్టకపోతే నిరహార దీక్షలకు పూనుకుంటామని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తోటకూర వజ్రేషాదవ్, హరివర్ధన్‌రెడ్డి, బద్దం గోపాల్రెడ్డి, మహేష్ గౌడ్, విక్రంరెడ్డి, కందికంటి అశోక్ కుమార్ గౌడ్, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కోమటి రవి, బాలమల్లేష్, హనుమాన్, ప్రవీణ్‌రావు, చింతల యాదయ్య, కర్రె రాజేష్, వేముల సంజీవగౌడ్, సబిత, మారం లక్ష్మారెడ్డి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి'



**నవతెలంగాణ- సంతోష్ నగర్**

వాహనాల రాకపోకలు సాగించే మార్గాలలో నిర్లక్ష్యంగా ఉండకూడదని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట టీటీఐ సీఐ జి.నాగరాజు సూచించారు. యాకుత్‌పురా నియోజకవర్గం మీరుచౌక్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ సీఐ యన్. సైదిరెడ్డి, ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) కృష్ణ, సుమన్ కుమార్ ఆధ్వర్యంలో 'రోడ్డు భద్రత..ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా రాయల్ మిషన్ హై స్కూల్ విద్యార్థినులకు ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ విద్యతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తహెరాఫర్హా, ఇంచార్జి సైదా సారా ఫాతిమా, ట్రాఫిక్ శిక్షణ సంస్థ సిబ్బంది, ఏఎస్ఐ ఆర్. శివరాములు, పోలీస్ సిబ్బందులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సర్కార్‌ది ధనార్జనే ధ్యేయం

- మేయర్ పారిజాత నర్సింహా రెడ్డి



**నవతెలంగాణ-బడంగ్ పేట్**

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న కేసీఆర్ నియంత పాలనకు.. రానున్న ఎన్నికల్లో ప్రజలు చరమ గీతం పాడాలని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బాలాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నిరంకుశ పాలనపై ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త పోరాటం చేయాలని కోరారు. ఉచిత విద్యుత్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలను ప్రభుత్వం వక్రీకరిస్తుందని, కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలను ఓర్వలేకనే పార్టీపై అక్కసు చూపిస్తున్నారని మండిపడ్డారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హతవేటుపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుంటే..కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు బండారి మనోహర్, నేనావత్ బాలు నాయక్, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, బడంగ్‌పేట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుబాన్ యాదవ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పలు చోట్ల రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం



**నవతెలంగాణ-బోడుప్పల్**

రైతు వ్యతిరేక వాక్యాలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను బోడుప్పల్ అంబేద్కర్ సర్కిల్ వద్ద బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ జాతీయ పార్టీగా ఉన్న కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేకిగా మాట్లాడడం సరికాదన్నారు. తెలంగాణాలో ఉచిత కరెంటు అవసరం లేదంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వాక్యాల వెనుక టీడీపీ అధినేత చంద్రబాబు ఉన్నట్లు అని తెలంగాణ రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకనే రేవంత్ రెడ్డి రైతులపై విషం కక్కుతుండని అన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవి గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

**ఉప్పల్ :**



రైతులకు మూడు గంటల కరెంటు చాలు అని వ్యాఖ్యానించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాటలకు నిరసనగా బుధవారం చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ఆధ్వర్యంలో వార్డు కార్యాలయం వద్ద రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి రైతులపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని తెలంగాణ రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక ఆలోచన విధానాలకు నిదర్శనంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొక్కొండ జగన్, యాదగిరి, రామానుజం, ఆటో శ్రీనివాస్, పోచయ్య, నారాయణ రెడ్డి, ముద్దం శ్రీనివాస్, బింగి శ్రీనివాస్, ఉపేందర్, సుధాకర్, రవీందర్ గౌడ్, ఎండి షఫీ ,ఫోటో బాలు, రమేష్, నర్సింగ్ నేత, హనీఫ్ బాయ్, మహ్మద్ గౌస్ , షఫీ, రామ్ రెడ్డి, జిల్లాల ప్రవీణ్, శ్యామ్, శ్రీకాంత్, బీరప్ప గడ్డ బాలు, సుభద్ర, సైనజ్, సరిత, అండాలు, సత్యవతి, ఉమా, అంజలి తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్**



రైతుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. బుధవారం అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్ గౌడ్ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి.. రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి, సర్పంచ్ చెరుకు కిరణ్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు పూజారి చక్రవర్తి గౌడ్, నాయకులు కోట లక్ష్మారెడ్డి, యాదయ్య, గౌరీ శంకర్ చారి, దేవేందర్ గౌడ్, కోట వెంకట్ రెడ్డి, యువజన నాయకులు వినయ్ కుమార్ రెడ్డి, జీవన్ రెడ్డి, ఉమాకాంత్, భాస్కర్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, ఇమ్రాన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ' కాలనీ పార్క్‌పై డిప్యూటీ మేయర్ పెత్తనం ఏంటీ..?'



**నవతెలంగాణ-బోడుప్పల్**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ కమలానగర్ కాలనీలోని పార్క్ స్థలంపై డిప్యూటీ మేయర్ పెత్తనం సరికాదని కాలనీ వాసులు మండిపడ్డారు. ఈ మేరకు కాలనీ వాసులు కార్పొరేషన్‌లోని కమిషనర్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేశారు. తర్వాత కమిషనర్‌తో వాగ్వివాదానికి దిగారు. ఈ సందర్భంగా కమలా నగర్ అధ్యక్షుడు చిందు పాండు మాట్లాడుతూ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్‌లోని కమలా నగర్ రోడ్డు 1లో ఉన్న పార్క్ స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు కౌన్సిల్‌లో తీర్మానం చేసిన అనంతరం..నిధులు లేని కారణంగా కాలనీ వాసులందరూచందాల ద్వారా పార్కుకు ఇరువైపులా గేటు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిపై పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ మనసులో అక్కసు పెట్టుకొని మా కాలనీపై పెత్తనం చేసేందుకు కమిషనర్‌పై ఒత్తిడి తెచ్చి గేటు కూల్చివేయించారని వాపోయాడు. కాలనీలో పార్క్ అభివృద్ధి కోసం పాటు పడుతుంటే కబ్జా చేశారంటూ అనవసరమైన ఆరోపణలు చేసి మమ్మల్ని బద్నాం చేసేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు. కమిషనర్ వచ్చి కాలనీ వాసుల అభిప్రాయం తెలుసుకోకుండా.. ఏకపక్షంగా వ్యవహరించి పార్క్ గేటును కూల్చివేశాడని ఇది సరైనది కాదని అన్నారు. ఇప్పటికైనా కమిషనర్ మరోసారి వచ్చి పార్క్ అభివృద్ధి కోసం గేటును ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తూంకుంట్ల శ్రీధర్ రెడ్డి, కాలనీ ఉపాధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి మధన్ మోహన్, కాలనీ వాసులు ఫణీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని సమస్యలపై మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ డి.అమోయ్‌కుమార్‌కు మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ బుధవారం వినతి పత్రం అందజేశారు. ఏఎస్‌రావు నగర డివిజన్ పరిధిలోని జైజవాన్ కాలనీవాసుల భూ రిజిస్ట్రేషన్, ఉప్పల్ డివిజన్‌లోని దేవేందర్ నగర్ కాలనీ, అంబేద్కర్ ఆవాస్ యోజన పథకం కింద ఇచ్చిన గృహాలకు లోన్ మాఫీ, లక్ష్మీనారాయణ కాలనీ ఇండస్ట్రియల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌గా మార్చాలనికోరారు. కేటీఆర్‌నగర్‌ను గతంలో ఉప్పల్ భగాయత్ లే ఔట్‌లో చేర్చుతు హెచ్ఎండీఏ సంస్థ నోటిఫై చేసిందని తెలిపారు. ఇప్పటికీ ఆసమస్య అలాగే ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గంధం నాగేశ్వర్ రావు, మేకల హన్మంతురెడ్డి, ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## యాద్గర్‌పల్లి గ్రామాభివృద్ధికి కృషి : కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-కీసర

యాద్గర్‌పల్లి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. బుధవారం కీసర మండలం యాద్గర్‌పల్లి గ్రామంలో పర్యటించారు. సుమారు రూ.25లక్షలతో గ్రామంలోని మెయిన్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకు న్నారు. పలు ఆలయలను, ఈద్గా సందర్శించారు. సొంత నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, ఆలయ నిర్మాణలు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చెర్మెన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ , సర్పంచ్ పుట్ట రాజు, ఎంపీటీసీ వెంకటేష్, కీసర బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

- వారి న్యాయమైన సమ్మె పట్ల వివక్ష తగదు
- జీవో 60ని పకడ్బందీగా అమలు చేయాలి
- తక్షణమే చర్చలకు పిలవాలి
- కార్మికుల అర్థనగ్న ప్రదర్శనలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల పెంపు జీవో 60ని పకడ్బందీగా అమలు చేసి వారికి కనీస వేతనం ఇవ్వాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. కీసర ఎంపీడీవో ఆఫీస్ ఎదుట ఏడు రోజులుగా జరుగుతున్న సమ్మెకు బుధవారం కేవీపీఎస్ జిల్లా నాయకత్వంతో కలిసి స్కైలాబ్ బాబు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. అనంతరం కార్మికుల అర్ధనగ్న ప్రదర్శనలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్మికులతో వెట్టిచాకిరీ చేయించే జీవో 51ని రద్దు చేసి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. తక్షణమే గ్రామ పంచాయతీ కార్మికులను చర్చలకు ఆహ్వానించాలన్నారు. వారి న్యాయమైన సమ్మె పట్ల వివక్ష తగదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెలో న్యాయం, ధర్మం, నీతి ఉందన్నారు. గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసమే నేడు సమ్మె చేపట్టినట్టు తెలిపారు. కార్మికులను పర్మినెంట్ చేస్తామనీ, వేతనాలు పెంచుతామని సీఎం గతంలో అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మాటలు నిలబెట్టుకోవాల న్నారు. జీవో 51 ద్వారా మల్టీపర్పస్ విధా నాన్ని తీసుకొచ్చి కార్మికులకు పని భారం పెంచడం సరికాదన్నారు. ప్రమాదవశాత్తు కార్మికులు చనిపోతే ప్రభుత్వం కనీసం ఎక్స్‌గ్రేషియా కూడా ఇవ్వలేకపోవడం సిగ్గు చేటన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ నేడు టెంట్ల వద్ద మద్దతు ఇచ్చినప్పటికీ అసలు కార్మికుల ప్రాథమిక హక్కులను కాల రాసి కార్పొరేట్లకు ఉపయోగపడే నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికుల పొట్టలు కొట్టి కార్పొరేట్లకు కేంద్రం మేలు చేస్తుందన్నారు. 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచిన ఘనత బీజేపీకి సర్కార్‌దే అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీపీ జేఏసీని చర్చలకు ఆహ్వానించి సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. మరింత ఐక్యమత్యంతో ఉద్యమించి డిమాండ్లు సాధించుకోవాలన్నారు. కులవక్ష వ్యతిరేక పోరాట సంఘం అండగా నిలబడుతుందని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కపాసాగర్, ఎన్‌బాలపీరు, గ్రామపంచాయతీ సిబ్బంది జేఏసీ జిల్లా నాయకులు, గ్రామపంచాయతీ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శివబాబు, గ్రామపంచాయతీ యూనియన్ మండల కార్యదర్శి (ఐఎఫ్టీయూ) ఎం.నరసింహ, రవి, సీఐటీయూ మండల నాయకులు సుక్కమ్మ, వెంకటేష్, యాదయ్య పాల్గొన్నారు.



## మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్‌లో క్వాడ్రియా రూ.1300 కోట్ల పెట్టుబడులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

All that piece and parcel of land bearing open Plot Nos. 351 & 352 each admeasuring 267 Sq.Yards in total 534 Sq.Yards or 446.48 Sq, mtrs In the layout consisting of Survey Nos. 98 to 106 situated in Abdullapur village & Gram Panchayath, Hayathnagar Revenue Mandal, (Now under Abdullopurmet Handal) R.R.District, Hyderabad East Registration Sub-District (now SRO Pedda Amberpet), bounded by: **North** : Plot No.353, **South** : Plot No.350 **East** : 40' wide Road, **West** : Plot Nos.357 & 358

**// BY ORDER OF THE COURT //**

**MATTAPALLY SRINIVAS**
**ADVOCATE**
H.No. 2-3-930, Road No. 2, Arunodaya Nagar colony, Nagole, Hyderabad - 068.
Cell: 9848804811 Counsel for Plaintiff

---

**AUCTION NOTICE**
**IN THE COURT OF THE HON'BLE 1st SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT : HYDERABAD**
**I.A . NO. 560 OF 2009**
**IN**
**O.S. NO. 3417 OF 2004**

**BETWEEN :-**
K. J. Buddeshwar Rao & Others .....Petitioners/Plaintiffs
AND
K. Uma Maheshwara Rao & Others .....Respondents/Defendants

TO,
THE PUBLIC AT LARGE

Whereas the above named petitioners/ plaintiffs filed the above I.A. NO. 560 OF 2009. for passing final decree in the above partition suit. whereas the petitioners / plaintiffs and requesting the Hon'ble Court to sell away the property covered by the schedules appended hereunder as the property is not divisible. The Hon'ble Court on 13-07-2023 ordered for publication and open auction/sale of properties, covered by the A & B schedules described hereunder on 27-7-2023 at 10:30 A.M. onwards at Court premises of I Senior Civil Judge, City Civil Court, Hyderabad. Therefore, the public at large are hereby informed that the interesting parties may participate in the above said auction/sale, subject to the terms and conditions as laid down in C.P.C. and C.R.P. The other particulars and information can be had from the Advocate, whose address particulars area given hereunder or from the Court, during office hours on all working days.

**SCHEDULE 'A' PROPERTY**

All that of house bearing No. 12-11-514, situated at Warasiguda to an extent of 300 Sq. Yards is bounded by : **North**: Neighbours House, **South** : Neighbours House, **East** : Road, **West** : Neighbours House.

**SCHEDULE 'B' PROPERTY**

All that of House bearing No. 1-7-230 86 231, old house at Bakaram to an extent of 88 Sq. Yards Musheerabad Mandal, Hyderabad District, is bounded by : **South** : Road, **West** : H.No. 1-7-232, West : H.No. 1-7-229, **North** : House.

**(BY ORDER OF THE COURT)**

**Sd/-**
**Counsel for the petitioner/plaintiff**
**B.Srinivasulu,**
**Jamuna Tiwari, Asma Begum,**
**Advocates,**
Flat No.211, Santhosh Plaza Apartments, Vinaynagar Colony Nagarjuna Sagar Road, Saidabad-59,
Cell No. 989490 97394.

---

**IN THE COURT OF HON'BLE JUNIOR CIVIL JUDGE, AT ALAIR**
**O.S. No. 197 OF 2022**

**BETWEEN :**
D. Ram Reddy ....Plaintiff
A N D
Smt. Chamakura Venkata Narasamma & others ....Defendants

To
1. Smt. Chamakura Venkata Narasamma, W/o. Late Ram Reddy, Aged about 80 years, Occ : Household, R/o. 8-30/11, Sai Nagar, Peerjaguda, Doduppal, Medchal-Malkajgiri District.
2. Chamakura Santosh Reddy, S/o. Late Chamakura Ramakrishna Reddy, Aged Major, Occ. : Business, R/o. 9-2/3/50, Plot No.64, Ashok Nagar, Boduppal, Ghatkesar, Medchal-Malakjgiri District.
3. Smt. Ch. Urmila, W/o. Late Ch. Laxma Reddy, Aged major, Occ. : Housewife, R/o. H.No.8-30/1, Sai Nagar, Firzadiguda, Boduppal, Medchal-Malkajgiri District.
4. Chamakura Vignesh Reddy, S/o. Late Chamakura Ramakrishna Reddy, Aged Major, Occ. : Business, R/o. H.No.8-30/1, Sai Nagar, Firzadiguda, Boduppal, Medchal-Malkajgiri District.
5. Chamakura Srinivas Reddy, S/o. Late Ram Reddy, Aged Major, Occ. : Business, R/o.9-2/3/50, Plot No. 64, Ashok Nagar, Boduppal, Ghatakesar, Medchal-Malkajgiri District.
6. Chamakura Shekar Reddy, S/o. Chamakura Srinivas Reddy, Aged Major, Occ. : Business, R/o. H.No.8-30/1, Sai Nagar, Firzadiguda, Boduppal, Medchal-Malkajgiri District.
7. Chamakura Rajavardhan Reddy, S/o. Ch. Chandram Reddy, Aged Major, Occ. : Business, R/o. H.No.8-30/1, Sai Nagar, Firzadiguda, Boduppal, Medchal-Malkajgiri District.
8. Chamakura Chandram Reddy, S/o. Late Ch. Ram Reddy, Aged Major, Occ. : Business, R/o.9-2/3/50, Plot No. 64, Ashok Nagar, Boduppal, Ghatakesar, Medchal-Malkajgiri District.
9. Chamakura Saketh Reddy, S/o. Ch. Vasudev Reddy, Aged Major, Occ. : Business, R/o.9-2/3/50, Plot No. 64, Ashok Nagar, Boduppal, Ghatakesar, Medchal-Malkajgiri District.

**N O T I C E**

Please take notice that the Plaintiff has filed the above suit seeking perpetual injunction against 1 to 9 of you. All of you failed to receive the summons sent by the court through R.P.A.D. The above suit is posted to **02-08-2023**. You may therefore enter your appearance in the above suit either in person or through your counsel failing which the matter will be decided on merits, in your absence.

**(By order of the Hon'ble court)**

**Sd/- K. Rohit & Associates,**
**Advocates,**
# 1-1-65, Santosh Nagar, Malkajgiri, Hyderabad - 500 047. Cell : 8121828998

---

**IN THE COURT OF HON'BLE JUNIOR CIVIL JUDGE, AT ALAIR**
**I.A. No. 519 OF 2022**
**IN**
**O.S. No. 197 OF 2022**

**BETWEEN :**
D. Ram Reddy ....Petitioner/Plaintiff
A N D
Smt.Chamakura Venkata Narasamma & others ....Respondents/Defendants

To
1. Smt. Chamakura Venkata Narasamma, W/o. Late Ram Reddy, Aged about 80 years, Occ : Household, R/o. 8-30/11, Sai Nagar, Peerjaguda, Doduppal, Medchal-Malkajgiri District.
2. Chamakura Santosh Reddy, S/o. Late Chamakura Ramakrishna Reddy, Aged Major, Occ. : Business, R/o. 9-2/3/50, Plot No.64, Ashok Nagar, Boduppal, Ghatkesar, Medchal-Malakjgiri District.
3. Smt. Ch. Urmila, W/o. Late Ch. Laxma Reddy, Aged major, Occ. : Housewife, R/o. H.No.8-30/1, Sai Nagar, Firzadiguda, Boduppal, Medchal-Malkajgiri District.
4. Chamakura Vignesh Reddy, S/o. Late Chamakura Ramakrishna Reddy, Aged Major, Occ. : Business, R/o. H.No.8-30/1, Sai Nagar, Firzadiguda, Boduppal, Medchal-Malkajgiri District.
5. Chamakura Srinivas Reddy, S/o. Late Ram Reddy, Aged Major, Occ. : Business, R/o.9-2/3/50, Plot No. 64, Ashok Nagar, Boduppal, Ghatakesar, Medchal-Malkajgiri District.
6. Chamakura Shekar Reddy, S/o. Chamakura Srinivas Reddy, Aged Major, Occ. : Business, R/o. H.No.8-30/1, Sai Nagar, Firzadiguda, Boduppal, Medchal-Malkajgiri District.
7. Chamakura Rajavardhan Reddy, S/o. Ch. Chandram Reddy, Aged Major, Occ. : Business, R/o. H.No.8-30/1, Sai Nagar, Firzadiguda, Boduppal, Medchal-Malkajgiri District.
8. Chamakura Chandram Reddy, S/o. Late Ch. Ram Reddy, Aged Major, Occ. : Business, R/o.9-2/3/50, Plot No. 64, Ashok Nagar, Boduppal, Ghatakesar, Medchal-Malkajgiri District.
9. Chamakura Saketh Reddy, S/o. Ch. Vasudev Reddy, Aged Major, Occ. : Business, R/o.9-2/3/50, Plot No. 64, Ashok Nagar, Boduppal, Ghatakesar, Medchal-Malkajgiri District.

**N O T I C E**

Please take notice that the Petitioner herein has filed the above I.A. seeking ad-interim injunction against 1 to 9 of you and another. All of you failed to receive the summons sent by the court through R.P.A.D. The above I.A. is posted to 02-08-2023. You may therefore enter your appearance in the above I.A. either in person or through your counsel failing which the matter will be decided on merits, in your absence.

**(By order of the Hon'ble court)**

**Sd/- K. Rohit & Associates,**
**Advocates,**
# 1-1-65, Santosh Nagar, Malkajgiri, Hyderabad - 500 047. Cell : 8121828998

---

**IN THE COURT OF HON'BLE JUNIOR CIVIL JUDGE, AT ALAIR**
**I.A. No. 520 OF 2022**
**IN**
**O.S. No. 197 OF 2022**

**BETWEEN :**
D. Ram Reddy ....Petitioner/Plaintiff
A N D
Smt.Chamakura Venkata Narasamma & others ....Respondents/Defendants

To
1. Smt. Chamakura Venkata Narasamma, W/o. Late Ram Reddy, Aged about 80 years, Occ : Household, R/o. 8-30/11, Sai Nagar, Peerjaguda, Doduppal, Medchal-Malkajgiri District.
2. Chamakura Santosh Reddy, S/o. Late Chamakura Ramakrishna Reddy, Aged Major, Occ. : Business, R/o. 9-2/3/50, Plot No.64, Ashok Nagar, Boduppal, Ghatkesar, Medchal-Malakjgiri District.
3. Smt. Ch. Urmila, W/o. Late Ch. Laxma Reddy, Aged major, Occ. : Housewife, R/o. H.No.8-30/1, Sai Nagar, Firzadiguda, Boduppal, Medchal-Malkajgiri District.
4. Chamakura Vignesh Reddy, S/o. Late Chamakura Ramakrishna Reddy, Aged Major, Occ. : Business, R/o. H.No.8-30/1, Sai Nagar, Firzadiguda, Boduppal, Medchal-Malkajgiri District.
5. Chamakura Srinivas Reddy, S/o. Late Ram Reddy, Aged Major, Occ. : Business, R/o.9-2/3/50, Plot No. 64, Ashok Nagar, Boduppal, Ghatakesar, Medchal-Malkajgiri District.
6. Chamakura Shekar Reddy, S/o. Chamakura Srinivas Reddy, Aged Major, Occ. : Business, R/o. H.No.8-30/1, Sai Nagar, Firzadiguda, Boduppal, Medchal-Malkajgiri District.
7. Chamakura Rajavardhan Reddy, S/o. Ch. Chandram Reddy, Aged Major, Occ. : Business, R/o. H.No.8-30/1, Sai Nagar, Firzadiguda, Boduppal, Medchal-Malkajgiri District.
8. Chamakura Chandram Reddy, S/o. Late Ch. Ram Reddy, Aged Major, Occ. : Business, R/o.9-2/3/50, Plot No. 64, Ashok Nagar, Boduppal, Ghatakesar, Medchal-Malkajgiri District.
9. Chamakura Saketh Reddy, S/o. Ch. Vasudev Reddy, Aged Major, Occ. : Business, R/o.9-2/3/50, Plot No. 64, Ashok Nagar, Boduppal, Ghatakesar, Medchal-Malkajgiri District.

**N O T I C E**

Please take notice that the Petitioner herein has filed the above I.A. seeking ad-interim injunction against 1 to 9 of you and another. All of you failed to receive the summons sent by the court through R.P.A.D. The above I.A. is posted to **02-08-2023**. You may therefore enter your appearance in the above I.A. either in person or through your counsel failing which the matter will be decided on merits, in your absence.

**(By order of the Hon'ble court)**

**Sd/- K. Rohit & Associates,**
**Advocates,**
# 1-1-65, Santosh Nagar, Malkajgiri, Hyderabad - 500 047. Cell : 8121828998

## మత్తు పదార్థాల పట్టివేత

- ఆకస్మిక దాడుల్లో బయటపడ్డ మత్తు పదార్థాలు
- నాంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ వర్మ



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

నగరం లోనిమోడల్ హౌస్, పంజాగుట్ట, అల్లూరి సెంటర్ ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సహాయ కమీషనర్, హైదరాబాద్ అనిల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు చేపట్టినట్లు నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ వర్మ తెలిపారు. హైదరాబాదుకు చెందిన డైరెక్టర్ ప్రోహిబిషన్ ఎక్సైజ్ అధికారి ముషరఫ్ అలీ ఫరూఖీ ఆదేశాల మేరకు జరిపిన దాడుల్లో సుమారు 3.50 లక్షల విలువ చేసే పలు రకాలు మత్తు పదార్థాలు పట్టుకున్నామని తెలిపారు. ఎల్ ఎస్‌ఓ బ్లాట్స్ 104,50 గ్రాముల ఎండిఎంఎ, 27ఈసీ ఎస్ పిల్స్,50వేల నగదు, 3 చరవాణీలు, ఒక ద్విచక్రవాహనం సీజ్ చేశామని చెప్పారు. ఈ దాడుల్లో పట్టుబడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించామని వెల్లడించారు.ఈ దాడుల్లో ప్రోహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌లు జె.రవి, నిజాముద్దీన్ సిబ్బంది పాల్గొన్నారు.

## నాంపల్లి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

- మొబైల్ ఫింగర్ ప్రింట్ డివైజర్ ద్వారా
నేరస్తుల గుర్తింపు: ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాస్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల భద్రత కోసం పటిష్ట బందోబస్తు చర్యలు చేప ట్టామని నాంపల్లి రైల్వే పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్ తెలిపారు. గవర్న మెంట్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (జీ ఆర్ పి) ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నాంపల్లి రైల్వే స్టేషన్ లో మొబైల్ ఫింగర్ ప్రింట్ డివై జర్ తో అనుమానిత ప్రయాణికులను తని ఖీ చేస్తున్నా మ న్నా రు. ఈ మిషన్ ద్వారా నేరాలు చేసిన నేరస్తు లను పట్టు కో వడం సులువు అవు తుంద న్నారు. ప్రయాణికుల భద్రత కోసం ఎప్పటికప్పుడు రైల్వే ప్లాట్ ఫాం ల వద్ద రైల్వే పోలీ సులు తనిఖీలు చేపడు తున్నారన్నారు ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులు రైల్వే పోలీసులకు సహకరించాలని సూచించారు.

## రేవంత్ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా

# బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు







నవతెలంగాణ-అంబర్‌పేట

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అమెరికాలో ఉండి రైతులకు మూడు గంటల కరెం టు ఇస్తే చాలని, రైతులకు ఇస్తున్న 24 గంటల కరెంటుపై,రైతులను అవమానపరిచే విధంగా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ పాల్గొని కోరంటి చౌరస్తాలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు వ్యతి రేకంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్పొరే టర్ విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడు తూ పలు దఫాలుగా రైతు రుణమాఫీ చేస్తూ అనేక కార్యక్రమాలతో రైతులకు అండగా ప్రభు త్వం నిలుస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు,అంబర్ పేట డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, డాక్టర్ శిరీష యాదవ్, డాక్టర్ ఓం ప్రకాష్ యాదవ్, పులీజల గెలవయ్య, ఆర్ కే.బాబు, సతీశ్ బాబ్లీ,పాల్గొన్నారు.

### రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు - ఎడ్ల.సుధాకర్‌రెడ్డి

రేవంత్‌రెడ్డి తెలంగాణ రైతులపై చేసిన వ్యాఖ్యలు సరికాదని, వెంటనే రైతులకు, ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ అంబర్‌పేట ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం నెంబర్. 6, ఎక్స్ రోడ్‌లో ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.ఎడ్ల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు 24 గంటల కరెంటు తెలంగాణ ప్రభుత్వం ఇస్తుంటే రేవంత్ రెడ్డి మాత్రం మూడు గంటలు కరెంటు ఇస్తే చాలు అని అనడం రైతు వ్యతిరేకి మాటలేనని, దివాలా తీసిన పార్టీకి ఎంపీ రేవంత్‌ను టీపీసీసీగా నియమించారన్నారు. మాజీ కార్పొరేటర్ పులి జగన్, విజితా రెడ్డి, మురళీకృష్ణ నాగేష్ గౌడ్, జీవన్ గౌడ్,బీవి రమణ, జనార్ధన్, నాగరాజు గౌడ్, చందర్ చారి, మహేష్ గంగపుత్ర, జెడి రాహుల్, దిలీప్ కుమార్, వెంకటమ్మ, అండలు, పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

రైతులకు తెలంగాణ రాష్ట్రంలో మూడు గంటలు ఉచిత కరెంటు ఇస్తే సరిపోతుందని, తెలంగాణ ప్రభుత్వం అనవసరంగా 24 గంటలు కరెంటు ఇస్తుందని, రైతులను కించపరుస్తూ టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిచేసిన వ్యాఖ్యాలకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో, రాష్ట్ర వ్యాప్తంగా రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేయాల న్నారు. అందులో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో యూసఫ్ గూడ బస్తీ చౌరస్తాలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మనుదహనంచేశారు. కార్పొరేటర్‌లు రాజ్‌కుమార్ పటేల్,సి.ఎన్.రెడ్డి, దేదీప్యరావ్, అన్ని డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. జూబ్లీహిల్స్, మధుర నగర్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### '3 గంటలు కరెంటు ఇస్తామనడం సిగ్గుచేటు'

భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 3 గంటలు మాత్రమే కరెం టు ఇస్తామనడం సిగ్గుచేటని భారత లోక్‌దళ్‌పార్టీ రాష్ట్ర అధ్య క్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో విమ ర్శించారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు సరఫరాపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఒక ఎకరానికి నీళ్లు కా వాలంటే ఒక గంట కరెంటు చాలని, అదే విధంగా మూడు ఎకరా లకు మూడు గంటల కరెంటు సరిపోతుందని మాట్లాడడం శోచనీ యమన్నారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణ ప్రజలు, రైతులు భగ్గుమంటున్నారన్నారు.వ్యవసాయ రంగాన్ని కుదేలు చేసేలా కాంగ్రెస్ నిర్ణయాలు ఉన్నాయని ఆయన మండిపడ్డారు.

### రైతులకు ఉచిత విద్యుత్ రద్దు చేసేందుకు కాంగ్రెస్ కుట్ర

-తెలంగాణ ఉద్యమ నేత ఆర్వీ మహేందర్ కుమార్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్ ను రద్దు చేయాలన్న కాంగ్రెస్ పార్టీ దుష్ట ఆలోచనను ప్రజలు గుర్తించి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించి బంగాళాఖాతంలో కలిపేయాలని తెలంగాణ ఉద్యమ నేత, గోషామహల్ నియోజకవర్గం సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు ఆర్.వి.మహేందర్ కుమార్ పిలుపునిచ్చారు. బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు బుధవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో విద్యుత్ సౌధా ఎదుట చేపట్టిన ధర్నా కార్యక్రమానికి ఆర్వీ మహేందర్ కుమార్ ఆధ్వర్యంలో గోషామహల్ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు తరలి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్ అవసరం లేదంటూ, ఉచిత విద్యుత్ రద్దు చేయాలని టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్‌కి తగదన్నారు

### రేవంత్ రెడ్డి రైతులందరికీ క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతులకు 3గంటల కరెంటు సరిపోదని తెలంగాణ యావత్తు రైతాంగ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయడమేనని రాష్ట్ర చైర్మెన్ గజ్జెల కాంతం అన్నారు. సీతక్కను తెలంగాణకు ముఖ్యమంత్రిని చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పి దళిత గిరిజన ఆదివాసీలను ప్రలోభ పెట్టడం కాదని, సోనియా, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేతో చెప్పించాలని, అంతేగాని ప్రజలను మభ్య పెట్టాలని చూడడం సరికాదు అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర చైర్మెన్ గజ్జెల కాంతం గారి తో పాటుగా జాతీయ ప్రైయివేటు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంధం రాములు, జె.ఎ.సి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి, సురేందర్ సన్ని, సంజీవ్ నాయక్, జగన్నాథం, ప్రవీణ్, దండుగుల రామకృష్ణ, సునిల్ కుమార్, రవీందర్, సముద్రాల ప్రశాంత్, మోహన్ నాయక్‌లు పాల్గొన్నారు.



## స్వచ్ఛందంగా విద్యా సంస్థలు బంద్

- విద్యా సంస్థల బంద్ విజయవంతం
- బంద్ పాటించని సెయింట్ పాల్స్ స్కూల్ యాజమాన్యం'
- విద్యార్థి, యువజన సంఘాల నేతలు అరెస్ట్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

బుధవారం తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యా సంస్థల (పాఠశాలలు, కళాశాలలు) బంద్ విజయవంతం అయిందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నేతలు తెలిపారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని అన్ని విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించగా హైదర్‌గూడలోని సెయింట్ పాల్స్ స్కూల్ మాత్రం తరగతులను నిర్వహించిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ముందు విద్యార్థి, యువజన సంఘాలు ధర్నా నిర్వహించగా, నారాయణగూడ పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెరకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేస్తున్నామని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యా సం స్థలను అభివృద్ధి చేస్తున్నామని పాల కులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి, ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక సదుపాయాలు కల్పించి ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు, ఎంఈఓ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు.ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్, కార్యదర్శి గ్యార నరేష్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా నేతలు మాజీద్, హరి, ఏఐఎస్ఎఫ్ జిల్లా నేతలు కళ్యాణ్, శివ, సందీప్, పాల్గొన్నారు.

## మాణికేశ్వర్‌నగర్‌లో ఆస్పత్రి నిర్మించకపోతే ఉద్యమం చేస్తాం

- కాంగ్రెస్ నాయకులు నోముల ప్రకాష్‌రావు



నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో ఆసుపత్రి కోసం బస్తీవాసులు నిరాహార దీక్షలు చేస్తున్నారు. బుధవారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు నోముల ప్రకాష్‌రావు వారిని కలిసి దీక్షకు సంఘీభావం తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఆసుపత్రి కావాలన్నా స్థానిక ప్రజల న్యాయమైన సమ స్యను పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం, ప్రజల ఆరోగ్యంపై వారికున్న స్పష్టత ఏ పాటిదో తెలియకనే తెలుస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ప్రభుత్వం ఆస్పత్రుల పరిస్థితి అధ్వానంగా ఉందని, స్థానిక ఎమ్మెల్యే మాటలకి చేతలకి పొంతన లేకుండా పోతుందని ఆయన విమర్శించారు. ఉద్యమాల గడ్డగా పేరుగాంచిన మాణికేశ్వర్ నగర్‌లో ప్రజల జీవన స్థితిగతులు దయనీయంగా ఉన్నాయని ఆయ న ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మాణికేశ్వర్ నగర్ లో ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తానని ప్రభుత్వానికి హెచ్చరించారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మాణికేశ్వర్ నగర్ లో ఆసుపత్రి నిర్మించాలని లేనిపక్షంలో స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని నోముల ప్రకాష్ రావు హెచ్చరించారు. శీను, నరసింహ, లాజరస్, లింగయ్య, సురేష్ లాల్, ప్రవీణ్ లాల్, అభిషేక్, మహమ్మద్ నజీర్, శివ,సందీప్, రవికుమార్, తార్నాక డివిజన్ బ్రహ్మజీ, పాల్, ప్రశాంత్, పాల్గొన్నారు.

## బోనాల ఏర్పాట్లపై కార్పొరేటర్ సమీక్ష



- జీహెచ్‌ఎంసీ శానిటేషన్ ఉద్యోగుల సమావేశంలో పాల్గొన్న గన్ ఫౌండ్రి డివిజన్ కార్పొరేటర్ డాక్టర్.సురేఖ ఓం ప్రకాష్

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గన్ ఫౌండ్రి డివిజన్‌లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్ తెలిపారు. బుధవారం డివిజన్ కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ ఉద్యో గులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్ మాట్లాడుతూ బోనాల పండుగ నేపథ్యంలో దేవాలయాల వద్ద పారిశుద్ధ్యంతో భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని సూచించారు. ఆది, సోమవారం బోనాలు. ఫలహార బండ్లు ఊరేగింపు ఉం టుందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉద్యోగులు పని చేయాలని సూచించారు. రోడ్లపై ఎలాంటి చెత్త పేరుకుపోకుండా చూడాలని సూపర్‌వైజర్ రమేష్‌కు సూచించారు.ఈ సమావేశంలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్. జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సూపర్వైజర్ రమేష్, జగత్, నగర బిజెపి కార్యాలయ సెక్రెటరీ వివేకానంద ఓబీసీ సెల్ జిల్లా సెక్రెటరీ నాగేశ్వరరావు జీహెచ్‌ఎంసీ ఎస్ఎఫ్ఏలు,బస్తీ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని బుధవారం రాష్ట్ర వ్యాప్తబంద్‌లో భాగంగా మినిస్టర్ క్వార్ట ర్స్ ముట్టడి చేసిన వామపక్ష విద్యార్థి సంఘం నాయకులను, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టులను భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. ఖమ్మం జిల్లా కేంద్రంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులపై, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం బంద్ పాటించకపోవడం కాకుండా గుండాలతో దాడి చేయిం చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ లు పేర్కొన్నారు. చట్ట విరుద్ధంగా నడుస్తున్న ఖమ్మం లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో గుర్తింపు లేని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం బంద్‌కు సహకరించాలని విద్యార్థి సంఘాల నాయకులు అడుగుతున్న సందర్భంలో యాజమాన్యం గుండాలతో దాడి చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ పరిష్కరించాలని మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడించిన సందర్భంగా పోలీసులు అరెస్టు చేసిన వామపక్ష విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## రేవంత్‌రెడ్డి వ్యాఖ్యాలను వక్రీకరించారు

- మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్



నవతెలంగాణ-ముషీరాబాద్ :

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విద్యుత్తుపై మా ట్లాడిన వ్యాఖ్యాలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించి ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ ఎం.అంజన్ కుమార్ యాదవ్ ఆరోపిం చారు. బుధవారం ముషీరాబాద్ కాంగ్రెస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం ముషీరాబాద్ లోని ఆయేషా ఫంక్షన్ హాల్లో ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ రైతుల పక్షపాతి అని, రైతుల సంక్షేమానికి తమ పార్టీ అదినేత పోరాడుతుంటే బీఆర్‌ఎస్ నాయకులు తమ రాజకీయ లబ్ధికోసం రేవంత్‌రెడ్డి తప్పుడు విమర్శలు చేస్తూ రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. ప్రజలు బిఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీల మాటలు నమ్మవద్దని సూచించారు. అతిథులను పెండం శ్రీనివాస్ యాదవ్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు ఆర్‌ఎల్ రమేష్, పట్నం నాగభూషణం గౌడ్, జనిగే శ్రీనివాస్ యాదవ్, చారి, వెంకట్, లింగంగుప్తా, గౌస్, వెంకటేష్ పాల్గొన్నారు.

## బీసీలకు ముఖ్యమంత్రి ఎస్సీ ఎస్టీలకు ఉపముఖ్యమంత్రి పదవులు ప్రకటించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ



నవతెలంగాణ-అడిక్ మెట్

రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో బీసీలకు ముఖ్యమంత్రి-ఎస్సీ, ఎస్టీలకు ఉపముఖ్యమంత్రి పదవులు ప్రకటించాలని, అటువంటి పార్టీలకే తన ఉంటుందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. బుధవారం విద్యానగర్ బీసీ భవన్‌లో బీసీ నాయకులు సమావేశానికి హాజరైన ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ ప్రధాన అంశమైన సోషలిజం సెక్యులరిజం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ బిజెపి రెండు పార్టీలు ఓకే అగ్రకులదిపత్యంలో ఉన్న సమయంలో సోషలిజాన్ని పాతాళానికి తొక్కి వేశారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు పి. సుధాకర్ ముదిరాజ్, నాగుల శ్రీనివాస్ యాదవ్, జిల్లపల్లి అంజి, పగిళ్ల సతీష్, మోడీ రాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలి







- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, భూపాల్
- కొనసాగుతున్న సీఐటీయూ జీపుజాత

నవతెలంగాణ-బాలానగర్/బేగంపేట

కార్మికులకు కనీస వేతనాలను వెంటనే సవరించాలని, వారికి పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, భూపాల్‌లు అన్నారు. కార్మికుల సమస్యలను తెలుసుకోవాలని జీపుజాతాను సీఐటీయు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ జాతా బుధ వారం బాలానగర్ పారిశ్రామిక ప్రాంతానికి బుధవారం చేరుకుంది. ఈ జీపుజాతా కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ లో కార్మికులకు కనీస వేతనాలను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులను కట్టు బానిసలుగా చూస్తూ కార్మిక చట్టాలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఎ. అశోక్, జిల్లా సహా య కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, ఎంటీఏఆర్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, రమణ, శంకర్ రెడ్డి, అమిత్ కేపసిటర్ కార్యదర్శి బి.మల్లేష్ ,లక్ష్మీ, వనిత, సబిత, జగన్, సుగుణ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

### సనత్‌నగర్ క్లస్టర్‌లో

సీఐటీయూ జీపుజాతా సనత్‌నగర్ క్లస్టర్‌లో కూడా పర్యటించింది. ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ భూపాల్, మల్లికార్జున, రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్‌లు సనత్ నగర్ క్లస్టర్ లోని లోహియా అగ్రోటెక్ ప్రయివేటు లిమిటెడ్‌లోని స్టాఫ్ అండ్ వర్కర్స్‌తోనూ, నాట్కో కార్మికులతోనూ కలిసి మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు సోమన్న సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు కే అజయ్ బాబు, నగర సీనియర్ నాయకులు సిహెచ్ చంద్రశేఖర్, స్థానిక నాయకులు శ్రీధర్ రెడ్డి, వినోద్, రాకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నిరసనకు మద్దతు



నవతెలంగాణ-ఓయూ

నిజాం కాలేజ్‌లో 5ఏండ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సును పునరుద్ధరించా లని అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట విద్యా ర్థులు గత రెండు రోజుల నుండి నిరసన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మాజీ ఐఎఎస్ ఆకునూరి మురళి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్‌లు సంఘీభావం ప్రకటించారు. అనం తరం వారు మాట్లాడుతూ విద్యార్థుల న్యాయమైన డిమా ండ్‌ను యూనివర్సిటీ అధికారులు తీర్చాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతం



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈ నెల 12వ తేదీన బంద్ పిలుపులో భాగంగా బుధవారం ఓయూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వ ర్యంలో ఎంఎంఎస్ ఇంటర్ కాలేజి, జమియా ఉస్మానియా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బంద్ నిర్వహిం చారు.తెలంగాణ రాష్ట్రంలో కేజీ టు పీజీ ఉచిత విద్య అందించాలని,పెండింగ్‌లో ఉన్న రూ.5,100 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్స్ తక్షణమే విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యా రంగంలో ఖాళీగా ఉన్న 25 వేల ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. పలు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయ వంతమయ్యిందన్నారు.ఈ కార్యక్రమంలో ఓయూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ- ఏఐఎస్ఎఫ్-పీడీఎస్‌యూ(వి) నాయకులు ఓయూ కార్యదర్శి రవి నాయక్, ప్రెసిడెంట్ ఆంజనేయులు, రామాటేంకి శ్రీను, కృష్ణ, అజయ్, శ్రీనాద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఓయూ కార్యదర్శి సత్య, ఉదయ్, లెనిన్. పీడీఎస్‌యు అధ్యక్షులు సుమంత్, పాషా, పీడీఎస్‌యు, ఓయూ కన్వీనర్ అఖిల్, దిలీప్ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి

- మంత్రి కేటీఆర్‌కు మర్రి రాజశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఓల్డ్ బోయినపల్లి డివిజన్ సెంటర్ పాయింట్ బ్రిడ్జి న్యూ బోయినపల్లి నుంచి ఆర్‌ఆర్‌నగర్ ప్రాగా టూల్స్ ఓపెన్ ల్యాండ్ దాదాపుగా 2.5 కిలో మీటర్ వర్షం నీటి కాల్వ నిర్మాణం కావడంతో దాదాపుగా 12 కాలనీలు ముంపునకు గురవుతున్నాయనే సమస్యను బీఆర్‌ఎస్ కంటోన్మెంట్ అసెంబ్లీ, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలం కావడంతో భారీ వర్షాలకు ఓల్డ్ బోయినపల్లి డివిజన్‌లోని 12 కాలనీలు వరద ముంపునకు గురవుతాయని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అనుకుని ఉన్న కంటోన్మెంట్ నియోజకవర్గంలో నాలా ఆవుట్ లైట్ పాయింట్ అయిన సెంటర్ పాయింట్ బ్రిడ్జి నుంచి వరద నీరు వెళ్లడానికి వరద కాలువలు లేకపోవటం వల్ల కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ వరద ముంపునకు గురి అవుతుందని తెలిపారు. వరద ముంపును నివారించటానికి వరద కాల్వ నిర్మాణం చేపట్టాలని కోరారు. సెంటర్ పాయింట్ బ్రిడ్జి నుంచి న్యూ బోయినపల్లి నుంచి ఆలీ కాంప్లెక్సు ఓల్డ్ బోయిన్‌పల్లి వరకు దాదాపు 2.5 కిలో మీటర్ల పొడవున వర్షం నీటి కాల్వ నిర్మాణం చేపట్టాలనీ, ఈ పనులకు దాదాపుగా రూ.30 కోట్లు ప్రత్యేక నిధులు ఎస్ఎన్‌డీపీ ఫండ్స్ నుంచి మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కేటీఆర్ వెంటనే రూ.కోట్లను మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్టు మర్రి తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో రైతులకు సీఎం కేసీఆర్ అండగా నిలిస్తే.. కాంగ్రెస్ రైతుల పొట్టకొట్టేందుకు చూస్తుందన్నారు. ఉచిత విద్యుత్‌పై ఎంపీ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. చంద్రబాబు నాయుడు శిష్యుడు రేవంత్ రెడ్డి ఉచిత కరెంట్ వద్దనడం సరికాదన్నారు. దేశానికి అన్నంపెట్టే అన్నదాతలు అంటే కాంగ్రెస్‌కు మొదటి నుంచి కండ్ల మంటే అన్నారు. ఇలాంటి కాంగ్రెస్ తెలంగాణకు అవసరమా..? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్యానందిత, నివేదిత, శ్రీ గణేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ టి.ఎస్.శ్రీనివాస్, మాజీ బోర్డు సభ్యులు భాగ్యశ్రీ శ్యామ్‌కుమార్, పాండు యాదవ్, నళిని కిరణ్, తేజ్‌పాల్, సరిత, సంతోష్, శ్రీకాంత్, సురేష్, సోమయ్య, సుజిత్, పాల్గొన్నారు.

## బీసీల డిమాండ్‌లు నెరవేరాలి



నవతెలంగాణ-అడిక్‌మెట్

అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్ కుమార్ అన్నారు. బుధవారం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని బీసీల న్యాయమైన డిమాండ్ లు నెరవేర్చాలని కోరారు. నాయకులు నంద గోపాల్, భూపేష్ సాగర్, రాము, నరేష్ ,నరేందర్, బాలిరెడ్డి, హాజరయ్యారు

# గరం గరం పకోడి

ఇప్పుడిప్పుడే వాతావరణం చల్లబడుతోంది... ఈ చల్లని వాతావరణానికి తోడు చిన్న చిన్న తుంపరలు పడుతున్నాయి... సాయంత్రం సమయంలో ఈ కాంబినేషన్‌కు పకోడీలు తోడయితే... ఆ మజానే వేరు... అయితే తినే పకోడీలనే కాస్త ఆరోగ్యంగా చేసుకుంటే రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం కూడా ఉంటుంది కదా.. అందుకే మన శరీరానికి పోషకాలు అందించి రోగనిరోధక శక్తిని పెంచే కొన్ని పకోడీ వెరైటీలను ట్రై చేద్దాం...



### మీల్‌మేకర్‌తో

**కావాల్సిన పదార్థాలు :** మీల్‌మేకర్ గ్రాన్యూల్స్ - అరకప్పు, ఉల్లిగడ్డ (సన్నగా తరగాలి) - మూడు, పచ్చి మిర్చి - ఐదు (సన్నగా తరగాలి), కొత్తిమీర - కట్ట, కరివేపాకు - నాలుగైదు రెబ్బలు, జీలకర్ర - చెంచా, కందిపప్పు పొడి - పావుకప్పు, ఉప్పు - తగినంత, నూనె - వేయించడానికి సరిపడా.

**తయారు చేసే విధానం :** మీల్ మేకర్ గ్రాన్యూల్స్‌ని ఉడికించి నీళ్ల పిండేసి ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అందులో నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసుకుని బాగా కలపాలి. అవసరాన్ని బట్టి కొద్దిగా నీళ్ల కూడా చేర్చుకోవాలి. స్టవ్ మీద కడాయిలో నూనె పోసి వేడయ్యాక మంటను మధ్యస్తంగా పెట్టుకోవాలి. ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న మొత్తంలో పకోడీల లాగా నూనెలో వేసి వేయించుకోవాలి. బాగా వేగాక తీసుకుంటే సరిపోతుంది.



### ఆకుకూరలతో...

**కావాల్సిన పదార్థాలు :** మునగాకు - కప్పు, మెంతి ఆకులు - కప్పు, తోటకూర - కప్పు, అల్లం వెల్లుల్లి ముద్ద - రెండు చెంచాలు, పచ్చిమిర్చి ముద్ద - రెండు చెంచాలు, కారం - చెంచా, ఉప్పు - తగినంత, శెనగపిండి - కప్పు, బియ్యప్పిండి - అరకప్పు, ధనియాల పొడి - రెండు చెంచాలు, కరివేపాకు రెబ్బలు - కొన్ని, నూనె - వేయించడానికి సరిపడా.

**తయారు చేసే విధానం :** ముందుగా మునగాకు, మెంతి ఆకులూ, తోటకూర, కరివేపాకును సన్నగా తరిగి పెట్టుకోవాలి. ఇందులో నూనె మినహా మిగిలిన పదార్థాలన్నీ వేసుకుని బాగా కలపాలి. అవసరాన్ని బట్టి నీళ్ల చల్లుకుని పిండి కలపొచ్చు. ఇప్పుడు కడాయిలో నూనె వేడి చేసుకొని ఈ పిండిని పకోడీలా వేసుకోవాలి. మంట తగ్గించి ఎర్రగా వేయించుకుని తీసుకోవాలి. ఇవి రుచిగా ఉంటాయి. శరీరానికి కావాల్సిన పోషకాలనూ అందిస్తాయి.



### మటన్‌తో...

**కావాల్సిన పదార్థాలు :** మటన్ - అర కేజీ, పెరుగు - ఒకటిన్నర కప్పులు, బీట్‌రూట్ పేస్టు - కప్పు, ఉల్లిగడ్డలు - నాలుగు, అల్లం వెల్లుల్లి ముద్ద - రెండు చెంచాలు, గరం మసాలా - రెండు చెంచాలు, ఉప్పు - తగినంత, నూనె - వేయించడానికి సరిపడా, కారం - రుచికి సరిపడా.

**తయారు చేసే విధానం :** ముందుగా మటన్‌కు పెరుగు, బీట్‌రూట్ పేస్ట్, అల్లం వెల్లుల్లి ముద్ద బాగా పట్టించి అరగంట సేపు పక్కన పెట్టుకోవాలి. తర్వాత అందులో కారం, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఒక పాత్రలో ఈ మిశ్రమాన్ని వేసి 20 నిమిషాల పాటు మధ్యస్తంగా ఉండే మంట మీద అడుగంటకుండా ఉడికించుకోవాలి. చల్లారిన తర్వాత అందులో శెనగపిండి కలిపి మరికొంచెం కారం, ఉప్పు వేసి కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని నూనెలో పకోడీల మాదిరిగా వేసుకొని వేయించుకోవాలి. అంతే... మటన్ పకోడీ రెడీ...



### జీడిపప్పు, పల్లీలతో...

**కావాల్సిన పదార్థాలు :** జీడిపప్పు పలుకులు - కప్పు, పల్లీలు - కప్పు, పట్నాలపప్పు - అరకప్పు, బియ్యప్పిండి - అరకప్పు, శెనగపిండి - కప్పు, కారం, ఉప్పు - తగినంత, వాము - కొద్దిగా, పుదీనా ఆకులు - కట్ట, గరంమసాలా - రెండు చెంచాలు, నూనె - వేయించడానికి సరిపడా.

**తయారు చేసే విధానం :** పుట్నాలపప్పును మరీ మెత్తగా కాకుండా పొడి చేసుకోవాలి. అందులో మిగిలిన పదార్థాలన్నీ ఒక్కొక్కటిగా వేసుకోవాలి. తర్వాత నీళ్ల చల్లుకుంటూ చపాతి పిండి కంటే కొద్దిగా పలచని పిండిలా కలుపుకోవాలి. బాణలిలో నూనె వేడిచేసి ఈ పిండిని పకోడీల్లా వేసుకొని వేయించుకోవాలి. వేడివేడిగా జీడిపప్పు, పల్లీల పకోడీ సిద్ధం.

# సిద్ధంగా ఉండాలి...



మహిళలకు పిల్లలు పుట్టి, పెరిగి, పెద్దయ్యే వరకు సమయమే తెలీదు. అలా ఏండ్లు గడిచిపోతాయి. పిల్లలు ఎప్పటికీ తల్లిదండ్రుల దగ్గరే ఉండిపోరు కదా.. ఒక యేజ్ వచ్చేసరికి చదువుల కోసమని, చదువులు ముగించుకుని ఉద్యోగాల కోసమని దూరంగా వెళ్ళిపోతారు. లేదంటే పెండ్లి చేసుకున్నాకైనా సరే వారి పనుల్లో బిజీ అయిపోతారు. అక్కడ నుండి తల్లులకు కాలం నెమ్మదిగా గడుస్తుంది. అప్పటివరకు ఎంతో ఓపికగా, శారీరక ఆరోగ్యంతో, మానసిక ఉల్లాసంతో అన్ని బాధ్యతలు మోసిన తల్లులకు సమయం చేజారిపోతుంది. తర్వాత నుంచి ఇంకేం చెయ్యాలో తోచదు. ఉత్సాహం కూడా రాదు. "ఇప్పుడు మీ కోసం సమయం దొరికింది కదా.. మీకు నచ్చినట్టు దాన్ని మలచుకోండని.. ఇష్టమైనట్టు గడపండి" అని ఎవరైనా చెబితే ఒక రకమైన నిస్తేజం నిరుత్సాహం కూడా వెలిబుచ్చుతారు. అదెలా సాధ్యం? 'ఇష్టం' అనే మాట మరచిపోయి ఏండ్లు గడచిపోయాయి. పైగా ఇప్పుడు కొత్తగా ఏదో చేసి సాధించి, నిరూపించుకునేది ఏముందని కూడా అనిపిస్తుంది. ఈ కాలంలో ఏం చేయాలో ఖాళీ సమయాన్ని ఎలా గడపాలో తెలీక, పిల్లల్ని వదిలి వుండటానికి అలవాటు పడలేక ఎందరో తల్లులు మానసిక సంఘర్షణకు గురవుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే వారు తమని తాము తప్పక మార్చుకోవల్సిందే.. అందుకోసం...

### సమయం తెలియకుండా...

పిల్లలు దూరంగా వెళ్ళిన వెంటనే ఏం చేయాలో తోచదు. వారి ఆలోచనలతో గడపటం కంటే వీలయితే దగ్గరి స్నేహితులతో బయటకి వెళ్ళటం, చుట్టాలు, తెలిసిన వారి ఇండ్లకు వెళ్ళి వారిని పలకరించడం వంటివి చేస్తుంటే అందరి మధ్య సమయం గడవటమే కాక, ఉల్లాసం కలుగుతుంది కూడా. ఆ తరువాత కావాలసిన సామగ్రి కొనటానికి స్వయంగా ఒక్కరే మార్కెట్‌కు, బజారుకు వెళ్ళటం, ఇంటిని రీమోడలింగ్ చేయడానికి కొత్త కొత్త ఇంటీరియర్ చిట్కాలు ప్రయత్నించడం వంటివి కూడా సమయాన్ని తెలియనివ్వవు. అలాగే మానసిక స్వాంతన చేకూరడానికి మొక్కల పెంపకం కూడా చక్కగా ఉపయోగపడుతుంది.

### ప్రయత్నించాలి

పిల్లలు పెద్దయి దూరంగా వెళ్ళాక తల్లుల మానసిక స్థితిని 'ఎంప్టీ నెస్ట్ సిండ్రోమ్' అంటారని నిపుణులు అంటున్నారు. కొందరు ఆ పరిస్థితిలో తమని తాము ఎలా సంభాళించుకోవాలో ముందుగానే ఆలోచించి పెట్టుకుంటే, మరికొందరు అప్పటి ఆ సమయాన్ని ఎలా గడపాలో మార్గాలు అన్వేషిస్తారు. ఇలా ఆ ఖాళీ సమయాన్ని అనుకూలంగా మలచుకునేందుకు ప్రయత్నించే వారికి ఇబ్బంది లేదు. కానీ, ఆ ఖాళీ సమయాన్ని చూసి బాధపడేవారు రోజురోజుకీ శారీరకంగా, మానసికంగా కుంగిపోవడం, సరైన ఆహారం తీసుకోకపోవడం, దేనిపైనా మనసు నిలపలేకపోవటం వంటి ఇబ్బందులకు గురవుతున్నట్టు చెబుతున్నారు నిపుణులు. ఆ స్థితి అలాగే కొనసాగితే వారి శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత దెబ్బ తింటుందని, దాని నుంచి బయటకి రావటానికి ప్రయత్నించాలని సూచిస్తున్నారు.

### గుర్తిస్తే బెంగ వుండదు

పిల్లలు చిన్న వయసులో ఉన్నప్పుడు, బాధ్యతలు ఎప్పుడు తీరతాయి.. పిల్లలు ఎప్పుడు వారి వారి జీవితాల్లోకి అడుగుపెడతారా అని ఎదురు చూస్తుంది తల్లి. తీరా వారు పెద్దయి దూరంగా వెళ్ళినప్పుడు దగ్గర లేరంటూ బెంగ పెట్టుకుంటుంది. అలా కాకుండా ఇప్పుడు పిల్లల పరుగు మొదలైందని గుర్తిస్తే, వారిపై బెంగ కొంచెం తగ్గుతుంది. ఎప్పుడో వచ్చిపోయే అతిథుల్లా పిల్లలు దూరంగా వెళ్ళిపోయారని బాధపడేకంటే, వారితో చక్కటి అనుబంధాన్ని కొనసాగిస్తూ, ఈ సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో ఆలోచించాలి. దానికి తగ్గట్టు జీవితాన్ని సన్నద్ధం చేసుకోవాలి.

# ముల్తానీతో మెరుపు



ముఖారవిందం కోసం లోషన్‌లు అని, కాస్మోటిక్స్ అని ఎక్కువ ఖర్చు చేస్తుంటారు చాలా మంది. అలా కాకుండా సహజ సిద్ధంగా చర్మానికి కాంతినిచ్చి, హాని చేయని ముల్తానీ ప్యాక్‌లు ట్రై చేస్తే డబ్బు ఆదా చేయవచ్చు. ముఖం కూడా కాంతులీనుతుంటుంది. అవెలాగంటే...

- బయట నుంచి వచ్చాక ముల్తానీ మట్టిలో రోజ్‌వాటర్ కలుపుకుని ఫేస్ ప్యాక్‌లా వేసుకుంటే ఎండ ప్రభావం వల్ల చర్మంపై ఏర్పడ్డ టాన్ తొలగిపోతుంది.
- మొటిమలూ, వాటి తాలూకు మచ్చలతో ముఖం కాంతిని కోల్పోతే ముల్తానీ మట్టిని చెంచా తులసి పొడి, చెంచా గంధం పొడి వేసి అన్నింటినీ పచ్చిపాలతో మెత్తని పేస్ట్‌లా కలుపుకోవాలి. దీన్ని రోజూ రాత్రిపూట ముఖానికి పూతలా వేసుకుని గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకుంటే సమస్య దూరమవుతుంది. చర్మం తాజాగా మారుతుంది.
- చర్మం సాగినట్లనిపిస్తే అరకప్పు ముల్తానీ మట్టీ, కోడిగుడ్డులోని తెల్లసొన, చెంచా ఓట్స్, రెండు చెంచాల టమాటా గుజ్జుని కలుపుకుని ఫేస్ ప్యాక్‌లా వేయాలి. పదిహేను నిమిషాల తర్వాత శుభ్రం చేసుకుని ముఖానికి బాదం నూనె పట్టిస్తే చర్మం నిగనిగలాడుతుంది.
- పొడి చర్మం కలవారు ముల్తానీ మట్టిలో చెంచా తేనె, చెంచా బాదం నూనె, అరచెంచా మీగడ, గులాబీ నీరూ కలిపి ముఖానికీ, మెడకీ, చేతులకీ రాసుకోవాలి. పూర్తిగా ఆరకుండానే కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మంలోని సహజ నూనె గ్రంథులు బయటికి పోవు. చర్మానికి తగిన తేమ అందుతుంది. కాంతివంతంగా కనిపిస్తుంది.

## పసలేని వాదనలతో కాలయాపన

(మొదటిపేజి తరువాయి)

కొనసాగుతుంది. మిశ్రా పదవీకాలం ఈ సంవత్సరం నవంబరుతో ముగియాల్సి ఉంది. దేశంలో 40 పారామితులపై సమీక్షలు జరుగుతాయి. వాటిలో మనీ లాండరింగ్, ఉగ్రవాదులకు ఆర్థిక సాయంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జరిపే సమీక్ష ఒకటి. ఈ విషయాన్ని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలియజేయలేదు. వాస్తవానికి ఎఫ్ఏటీఎఫ్ ఆర్థిక మంత్రిత్వ శాఖ అధీనంలో ఉంటుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రెవెన్యూ శాఖకు జవాబుదారీగా ఉంటుంది. 2019 నుండి మిశ్రా రెవెన్యూ కార్యదర్శి వద్ద పని చేస్తున్నారు. ఆ శాఖలో ముగ్గురు కార్యదర్శులు ఉన్నారు. ఆర్థిక వ్యవహారాల విభాగంలో కూడా అంతే. ఏదైనా విభాగంలో కార్యదర్శులే కీలక పాత్ర పోషిస్తారు కానీ విచారణ సంస్థ డైరెక్టర్ కాదు. ఎఫ్ఏటీఎఫ్‌పై ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి సమీక్ష జరుపుతారు. నలభై సభ్య దేశాలకు చెందిన బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంటుంది. సంవత్సరంన్నర కాలంలో సమీక్షను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ సంవత్సరం ప్రారంభంలోనే సమీక్ష మొదలైంది. వచ్చే సంవత్సరం చివరి వరకూ తుది నివేదికను సమర్పించరు.

అసలు ఈడీ పనితీరును పరిశీలిస్తే ఆ సంస్థ ఏర్పడినప్పటి నుండి నేటి వరకూ ఆరు వేల కేసులు దాఖలయ్యాయి. వీటిలో మనీ లాండరింగ్ నిరోధక చట్టానికి సంబంధించి 25 కేసుల్లో విచారణ పూర్తయింది. ఇరవై నాలుగు కేసుల్లో శిక్షలు పడ్డాయి. 2018-19 నుండి 2021-22 మధ్యకాలంలో ఈడీ నమోదు చేసిన కేసులు 505% పెరిగాయి. 2018-19లో 195 కేసులు నమోదైతే 2020-21 నాటికి 1,180 కేసులు నమోదయ్యాయి. ఈడీ దాడులు 2004-14 నుండి 2014-22 వరకూ భారీగా అంటే 2,555% పెరిగాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం 2004-14 మధ్య ఈడీ 112 దాడులు చేసి రూ.5,346 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. అయితే ఎన్ని కేసులలో దర్యాప్తు పూర్తయి విచారణ ప్రారంభమైంది? ఎన్ని కేసులు నమోదయ్యాయి? వేర్వేరు కారణాలతో ఎన్ని కేసులను ముగించారు? కోర్టులలో ఫిర్యాదు దాఖలైన తర్వాత ఎంతమంది నిందితులను నిర్దోషులుగా విడిచిపెట్టారు? అటాచ్ చేసిన ఆస్తులలో ఎన్నింటిని జప్తు చేశారు? వంటి ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానాలు లేవు.

## బీజేపీ చేతిలో కీలుబొమ్మ

**న్యూఢిల్లీ :** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బీజేపీ చేతిలో కీలుబొమ్మ అని, ఆ సంస్థ తన విశ్వసనీయతను కోల్పోయిందని కాంగ్రెస్ ఎంపీ రణదీప్ సింగ్ సుర్జేవాలా విమర్శించారు. ఈడీ అధిపతి పదవీకాలం పొడిగింపు చట్టవిరుద్ధమంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈడీ అధిపతి సంజయ్ కుమార్ మిశ్రా పదవీకాలాన్ని 2021 నవంబర్‌లోనూ, తిరిగి 2022 నవంబర్‌లోనూ పొడిగించడం చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. అయితే నూతన అధిపతి నియామకంపై కేంద్రం చేసిన అభ్యర్థన మేరకు మిశ్రా ఈ నెల 21 వరకూ పదవిలో కొనసాగేందుకు న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో 2021 తర్వాత మిశ్రా తీసుకున్న నిర్ణయాలన్నీ చట్టవిరుద్ధమేనని సుర్జేవాలా అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేస్తూ రెండు పర్యాయాలు పదవీకాలాన్ని పొడిగించినందుకు రాజకీయ నాయకులు, అధికారులు బాధ్యత వహించరా అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు న్యాయానికి లభించిన విజయమని ఆయన అభివర్ణించారు. వ్యక్తులు ముఖ్యం కానప్పుడు మిశ్రా పదవీకాలాన్ని ఎందుకు పొడిగించారని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ ప్రశ్నించారు.

## మోడీ ఓ నియంత

(మొదటిపేజి తరువాయి)

కమిటీ చైర్మెన్ మధుయాష్కీ మాట్లాడుతూ ఒకే రకమైన నేరానికి వివిధ రాష్ట్రాల్లో కేసులు వేయడం వాటిని కోర్టు సమర్థించడం సరైందికాదన్నారు. ఉపా కేసులు పెట్టి వరవరరావు లాంటి వారిని జైల్లో పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మోడీ వాట్సాప్ యూనివర్శిటీ రాహుల్‌పై అసమర్థుడు అనే ముద్ర వేయడానికే ప్రయత్నం చేసిందన్నారు. అదానికి, మోడీకి సంబంధం ఏంటనే దానికి సమాధానం చెప్పేందుకు మోడీ భయపడుతున్నారని ఎద్దేవా చేశారు.దేశంలో న్యాయ స్థానాలపై నమ్మకం కోల్పోయే పరిస్థితి వస్తోందని చెప్పారు.

## మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాల్సిందే

(మొదటిపేజి తరువాయి)

కార్మికులు తమ సత్తా ఏంటో చూపిస్తారని హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని మున్సిపల్ కమిషనర్, డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాది మంది మున్సిపల్ కార్మికులు పచ్చడి మెతుకులు, రొట్టెలతో సద్దులు కట్టుకుని తరలొచ్చారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి భాస్కర్ మాట్లాడుతూ.. చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రోశయ్య, కేసీఆర్ ఇలా సీఎంలందరూ మూడు దశాబ్దాలుగా మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి మోసం చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. వారికి కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ లాంటి సౌకర్యాలేవీ అమలు కావడం లేదని వాపోయారు. పొద్దస్తమానం మురికికూపంలో పనిచేసి అనారోగ్యాలపాలవుతున్న మున్సిపల్ కార్మికులకు హెల్త్ కార్డులు ఎందుకు ఇవ్వరని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనం, హెల్త్ అలవెన్స్ కలిపి నెలకు రూ.21 వేలు చెల్లిస్తున్నారనీ, ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ఆ వేతనం ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. 11వ పీఆర్సీ జీవో నెం.60లో పేర్కొన్న వేతనాలను కేటగిరీల వారీగా చెల్లించాలనీ, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ హెల్త్ కార్డులు, హెల్త్ ఇన్సూరెన్స్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'వాళ్ల డిమాండ్లు నెరవేర్చుకునేందుకు ఐఏఎస్ అధికారులకు సంఘాలుంటాయ్, ఉద్యోగులకు సంఘాలుంటాయ్. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేటోళ్లకు సంఘాలుంటయ్. వ్యాపారులకు సంఘాలుంటాయ్. మరి కార్మికులకు సంఘాలెందుకు వద్దంటున్నవ్' అని ప్రధాని మోడీని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వాన్ని కార్మికులు గద్దె దింపే రోజులు దగ్గర పడ్డాయని ఆయన హెచ్చరించారు.

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్ మాట్లాడుతూ..హైకోర్టు ఆదేశాల మేరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కార్మికులకు రూ.24 వేల జీవితాన్ని అమలు చేయాలని కోరారు. హైదరాబాద్ చుట్టూ కొత్తగా ఏర్పడిన మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న కార్మికులకు కూడా జీహెచ్ఎంసీ కార్మికుల మాదిరిగానే సమాన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ టెండర్లను లేబర్ లైసెన్సులు లేని కాంట్రాక్టర్లకు ఇవ్వడంతో కార్మికులు పీఎఫ్, ఈఎస్ఐ లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. అందువల్ల లేబర్ లైసెన్సులు లేని కాంట్రాక్టర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాత్రి పనులు చేసే సమయంలో అతి వేగంగా వచ్చే వాహనాల కింద పడి అనేకమంది కార్మికులు మరణిస్తున్నారనీ, అలాంటి కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు మాట్లాడుతూ..వయస్సు మీరిందనే సాకుతో 30 నుంచి 40 ఏండ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. అటువంటి కార్మికులను తొలగిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్‌గా రూ.10 లక్షలు, వారసులు లేని వారికి రూ.15 లక్షలివ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు ఆదివారాలు, పండుగ సెలవులివ్వాలని విజ్ఞప్తి చేశారు. 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి. శ్రీనివాస్‌రెడ్డికి యూనియన్ బృందం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేసింది. ఆయన వాటిపై సానుకూలంగా స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. బుజ్జమ్మ, ఉప్పలయ్య, ఎ. వెంకటేష్, బాలనర్సింహా, డి. కిషన్, రాష్ట్ర కార్యదర్శులు రాజనర్సు, ఎస్. వెంకటస్వామి, నవనీత, సత్యం, హంసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు

(మొదటిపేజి తరువాయి)

190 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రొఫెసర్ నుంచి అడిషనల్ డీఎంఈగా పదోన్నతి పొందేందుకు ఉన్న వయోపరిమితిని 57 ఏండ్ల నుంచి 64 ఏండ్లకు పెంచాలని నిర్ణయించారు. ప్రొఫెసర్ల బదిలీలకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే పంపాలని రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ కె.రమేశ్ రెడ్డిని ఆదేశించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని మొత్తం 112 డిప్యూటీ సివిల్ సర్జన్, సివిల్ సర్జన్ పదోన్నతుల ప్రక్రియ వెంటనే చేపట్టి 15 రోజుల్లోగా పూర్తి చేయాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు. ఆ విభాగంలోనే 371 నర్సుల ప్రమోషన్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. వచ్చే 10 రోజుల్లో లోకలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి, నెల రోజుల్లో ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, రేడియోగ్రాఫర్లకు సంబంధించిన పదోన్నతుల ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని కోరారు.

### పీఎంపీ, ఆర్ఎంపీల శిక్షణ అంశంపై కమిటీ

హైకోర్టు ఆదేశాలకు లోబడి పీఎంపీ, ఆర్ఎంపీలకు శిక్షణ ఇచ్చే విషయంపై పూర్తి నివేదిక రూపొందించేలా కమిటీని ఏర్పాటుచేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఆ కమిటీ వారం రోజుల్లో తన నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

### 32 సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ మిషన్ల కొనుగోలు

డెంగ్యూ వ్యాధి చికిత్సలో ఉపయోగించే 32 సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ల మిషన్లను రూ.10 కోట్లతో కొనుగోలు చేయాలని హరీశ్ రావు ఆదేశించారు. వాటిని అన్ని జిల్లా ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయాలని కోరారు. వీటితో సకాలంలో రోగనిర్ధారణ జరిగి సత్వర చికిత్స చేసేందుకు వీలవుతుందని తెలిపారు. ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన నూతన వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. నిమ్స్ నూతన భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. కొత్తగా సమకూర్చుకున్న 228 అమ్మఒడి వాహనాలు, రెండు వందల నాలుగు 108 వాహనాలు, 34 హార్సే వాహనాలను ఆగస్టు ఒకటో తేదీన ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దందాను అరికట్టాలి



నవతెలంగాణ-బంజారాహిల్స్/విలేకరులు

విద్యారంగ సమస్యలు పరిష్కారించాలని, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని నియంత్రించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు బుధవారం తలపెట్టిన రాష్ట్రవ్యాప్త బంద్ విజయవంతమైంది. హైదరాబాద్, రంగారెడ్డి, సిద్దిపేట, హన్మకొండ, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో శాంతియుతంగా బంద్ కార్యక్రమం చేస్తున్న విద్యార్థులను పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో మంత్రుల నివాస ముట్టడికి వెళ్లిన నాయకులు, విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేసి.. చొక్కాలు చింపి లాక్కెళ్లారు. ఈ క్రమంలో ఉద్రిక్తత ఏర్పడింది. ఖమ్మం జిల్లా కేంద్రంలో బంద్ పాటించాలని కోరిన వామపక్ష విద్యార్థి సంఘాల నాయకత్వంపై ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం బౌన్సర్లతో దాడి చేయించడాన్ని విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీలు ఖండించాయి. అరెస్టులను ఖండిస్తూ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి.

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయాల ముట్టడికి ప్రయత్నించిన వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాలు నాయకులు ఆర్ఎల్ మూర్తి, టి.నాగరాజు(ఎస్ఎఫ్ఐ), పుట్టా లక్ష్మణ్(ఏఐఎస్ఎఫ్), పరుశరాం, ఎస్.నాగేశ్వరరావు, రామకృష్ణ, మహేష్ (పీడీఎస్‌యు), మల్లేష్ (ఏఐడీఎస్ఓ), గవ్వ వంశీధర్‌రెడ్డి(ఏఐఎస్‌బి), మురళీ (ఏఐఎఫ్‌డీఎస్), విజయ్(పీడీఎస్‌యు(వి)) మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం సక్రమంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాల్లో సౌకర్యాలు లేవన్నారు. నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో టీచర్స్ లేరని, రాష్ట్రంలో 24 వేల టీచర్స్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని చెప్పారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మన ఊరు -మన బస్తీ - మన బడి పథకాన్ని అన్ని పాఠశాలలకు వర్తింపజేయాలని కోరారు.

రాష్ట్రంలో కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల ఫీజుల దందాను అరికట్టేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదని విమర్శించారు. లక్షల రూపాయల ఫీజులు, డొనేషన్ల పేరుతో దోచుకుంటున్నా కనీసం ప్రభుత్వం తల్లిదండ్రులకు భరోసానిచ్చే ప్రయత్నం కూడా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బడ్జెట్ పాఠశాలలకు ఎలాంటి రాయితీలూ ఇవ్వడం లేదని, కార్పొరేట్ విద్యాసంస్థల మాదిరిగా కమర్షియల్ ట్యాక్స్, కరెంట్ బిల్లులు, వాటర్ బిల్లులు వసూలు చేస్తున్నారని తెలిపారు. కనీసం కమర్షియల్ పరిధిలో నుంచి డొమెస్టిక్ పరిధిలోకి మార్చాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే రానున్న కాలంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడి సందర్భంగా పోలీసులుకు, విద్యార్థులకు తీవ్ర తోపులాట జరిగింది. లాఠీలతో విద్యార్థులను కొడుతూ.. చొక్కాలు చించి లాక్కెళ్లారు.

### ఖమ్మం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దౌర్జన్యం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. కానీ ఖమ్మం నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బంద్ నిర్వహించడానికి వెళ్లిన ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ నాయకులపై పాఠశాల యాజమాన్యం రౌడీలను పట్టి దాడి చేయించింది. గాయపడిన వారు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. దాడిని సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ (ఎంఎల్), ప్రజాపంథా, న్యూడెమోక్రసీ ఖమ్మం జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, నున్నా నాగేశ్వరరావు, గోకినపల్లి వెంకటేశ్వరరావు, మందుల రాజేంద్రప్రసాద్ ఖండిస్తున్నట్టు పత్రిక ప్రకటనలో తెలిపారు. అన్ని విద్యా సంస్థలు బంద్‌కు సహకరించాయని, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం మాత్రమే సహకరించకుండా.. అక్కడికి వెళ్ళిన విద్యార్థి నాయకులపై నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాసరావు కిరాయి గూండాలతో దాడిచేయించి గాయపరిచారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పైగా పోలీసులకు తప్పుడు రిపోర్టు ఇచ్చి అరెస్టు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా చరిత్రలో ఏ విద్యా సంస్థా ఇటువంటి గూండాగిరికి పాల్పడలేదన్నారు. అన్ని నిబంధనలను ఉల్లంఘించి, విపరీతమైన ఫీజులతో విద్యార్థులను పీడిస్తూ, గూండాలను పెంచి పోషించి బరితెగించి వ్యవహరిస్తున్న ఢిల్లీ స్కూల్ యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు.


## నడికర్ తిలకంతో మలయాళంలోకి మైత్రి ఎంట్రీ


లాల్ జూనియర్, టోవినో థామస్

స్టార్ హీరోలతో అనేక బ్లాక్ బస్టర్‌లను అందించి టాలీవుడ్ లో ప్రముఖ నిర్మాణ సంస్థగా నిలిచిన మైత్రీ మూవీ సంస్థ మలయాళంలోకి అడుగు పెడుతోంది. మలయాళ స్టార్ హీరో టోవినో థామస్‌తో 'నడికర్ తిలకం' అనే భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మించ నుంది. 'డ్రైవింగ్ లైసెన్స్' దర్శకుడు లాల్ జూనియర్ దీనికి దర్శకత్వం వహించనున్నారు.
నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, అల్లన్ ఆంటోని, అనూప్ వేణు గోపాల్ ఈ చిత్రానికి నిర్మాతలు. ఈ చిత్ర ముహూర్త వేడుక బుధవారం ఘనంగా జరిగింది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా కొచ్చిలో ప్రారంభమైంది. 120 రోజుల పాటు వివిధ లొకేషన్లలో ఈ చిత్రాన్ని షూట్ చేయనున్నారు. టోవినో థామస్ ఈ చిత్రంలో అనేక సవాళ్ళతో కూడిన సూపర్ స్టార్ డేవిడ్ పడిక్కల్ పాత్రను పోషిస్తున్నారు. సౌబిన్ షాహిర్ బాల పాత్రలో కనిపించ నుండగా, భావన కథానాయిక.
ధ్యాన్ శ్రీనివాసన్, అనూప్ మీనన్, షైన్ టామ్ చాకో, అజు వర్గీస్, శ్రీనాథ్ భాసి, లాల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.
ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: లాల్ జూనియర్, డీవోపీ: ఆల్బీ, సంగీతం: యక్జాన్ గారి పెరీరా, నేహా నాయర్, స్క్రీన్ ప్లే: సువిన్ ఎస్ సోమశేఖరన్, ఎడిటింగ్: రతీష్ రాజ్, ప్రొడక్షన్ డిజైనర్: ప్రశాంత్ మాధవ్.

# నవచిత్రం

## షూటింగ్ పూర్తి చేసిన మొయిద్దీన్ భాయ్


రజనీకాంత్

లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ప్రాజెక్ట్ 'లాల్ సలాం'. విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఐశ్వర్య రజనీకాంత్ డైరెక్ట్ చేస్తున్నారు. ముంబై డాన్ మొయిద్దీన్ భాయ్‌గా రజనీకాంత్ కనిపించనున్నారు. జీవితా రాజశేఖర్, క్రికెట్ లెజెండ్ కపిల్ దేవ్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.
ఈ సినిమాలో రజని పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తయ్యింది. ఈ విషయాన్ని దర్శకురాలు ఐశ్వర్య రజనీకాంత్ సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'మీతో సినిమా చేయటం ఓ అద్భుతం. నాన్నా.. మీరు ఎప్పుడూ నటనతో మ్యాజిక్ చేస్తుంటారు. 'లాల్ సలాం'లో మొయిద్దీన్ పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తి' అని ఆమె పేర్కొన్నారు. రజినీకాంత్ సహా యూనిట్ మొత్తం కలిసి దిగిన ఫొటోను కూడా ఆమె షేర్ చేశారు.
ఈ సందర్భంగా లైకా ప్రొడక్షన్స్ ప్రతినిధులు మాట్లాడుతూ, 'మా బ్యానర్‌లో రజనీకాంత్ నటించటం మాకెప్పుడూ గర్వకారణంగానే ఉంటుంది. ఆయన్ని ఓ పవర్‌ఫుల్ పాత్రలో చూడబోతున్నారు. ఐశ్వర్యా రజనీకాంత్ పర్‌ఫెక్ట్ ప్లానింగ్‌తో ఈ మూవీలో ఆయన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ని పూర్తి చేశారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అలాగే మరో వైపు కమల్ హాసన్, డైరెక్టర్ శంకర్ కాంబోలో రూపొందుతున్న 'ఇండియన్ 2', అరుణ్‌విజయ్, ఎమీజాక్సన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న 'మిషన్ చాప్టర్ 1', అజిత్‌తో చేస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'విడా ముయర్చి', '2018' వంటి బ్లాక్ బస్టర్ మూవీని తెరకెక్కించిన దర్శకుడు జూడ్ ఆంథని జోసెఫ్ దర్శకత్వంలోనూ ఓ భారీ చిత్రం.. ఇలా క్రేజీ ప్రాజెక్ట్స్‌లో మా లైకా ప్రొడక్షన్స్ ప్రేక్షకులను మెప్పించటానికి సిద్ధమవుతోంది' అని తెలిపారు.

## ఆరాధ్య..కి ప్రేమికులు ఫిదా


సమంత, విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటిస్తున్న చిత్రం 'ఖుషి'. బుధవారం ఈ చిత్రం నుంచి రెండో పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. 'ఆరాధ్య..' అంటూ సాగే ఈ పాట ఇప్పుడు ప్రేమికుల గీతంగా నిలవడం విశేషం. ఈ పాటను దర్శకుడు శివ నిర్వాణ తెలుగులో రాయగా, తమిళంలో మదన్ కార్కీ సాహిత్యాన్ని అందించారు. తెలుగు, తమిళంలో సిద్ శ్రీరామ్, చిన్మయి ఆలపించారు. హిందీలో జుబిన్ నాటియల్, పలక్ ముచ్చల్, కన్నడలో హరిచరణ్ శేషాద్రి, చిన్మయి, మలయాళంలో కేఎస్ హరిశంకర్, శ్వేతా మోహన్ ఆలపించారు. హిషామ్ అబ్దుల్ వాహబ్ అందించిన బాణీ శ్రోతలకు వినసొంపుగా ఉంది. అలాగే సమంత, విజయ్ కెమిస్ట్రీ మరింతగా హైలెట్ అవుతోంది. శివ నిర్వాణ కొరియోగ్రఫీ అందరినీ ఆకట్టుకుంటోంది. దీంతో ఈ పాటకు మ్యూజిక్ లవర్స్ ఫిదా అయిపోయారు. తొలిపాట 'నా రోజా నువ్వే' యూట్యూబ్‌లో వంద మిలియన్లకు చేరువలో ఉంది. ఈ సెకండ్ సింగిల్ 'ఆరాధ్య' కూడా ట్రెండింగ్ అవ్వడం ఖాయమని అంటోంది చిత్ర బృందం. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాని సెప్టెంబర్ 1న తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయబోతున్నారు. జయరాం, సచిన్ ఖేడేకర్, మురళీ శర్మ లక్ష్మీ, అలీ నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు : నవీన్ యేర్నేని, రవిశంకర్ యలమంచిలి.

## మాస్‌కి కనెక్ట్ అయ్యే కాన్సెప్ట్


ఆనంద్ దేవరకొండ

ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య, విరాజ్ అశ్విన్ నటించిన చిత్రం 'బేబీ'. మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్‌కేఎన్ నిర్మించారు. సాయి రాజేష్ దర్శకుడు. ఈ సినిమా ఈనెల 14న రిలీజ్ అవుతోంది. ఈ నేపథ్యంలో హీరో ఆనంద్ దేవరకొండ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు. 'ఇప్పటి వరకు పక్కింటి అబ్బాయిలా కనిపించే సినిమాలు చేశాను. కానీ మొదటి సారి ఓ వైడ్ రేంజ్ ఆడియెన్స్‌ను పలకరించే సినిమాతో వస్తున్నాను. ఇందులోని పాత్రను పోషించగలననే నమ్మకాన్ని నాలో దర్శకుడు సాయి రాజేష్ నింపాడు. నా కెరీర్‌లో బేబీ ఎప్పటికీ నిలిచిపోతుంది. ప్రేమలో సంతోషం, బాధ అన్నీ ఉంటాయి. ఆ ఎమోషన్స్‌ను బాగా చూపించాం. ట్రైలర్‌లో చూపించిన ఎమోషన్ కంటే సినిమాలో మరో యాభై శాతం ఎక్కువే ఉంటుంది. తొలిప్రేమ అనేది ఎప్పటికీ ఓ అందమైన అనుభూతి. దాన్నే ఈ సినిమాలో చక్కగా చూపించాం. ప్రేమ మీద ఎన్నో సినిమాలు వచ్చాయి. కానీ ఈ సినిమాలో ప్రేమను దర్శకుడు సాయిరాజేష్ తన కోణంలోంచి చూపించారు. ఆయన రైటింగ్ కొత్తగా ఉంటుంది. హీరో, హీరోయిన్లు ప్రేమలోఉన్నా, విడిపోతున్నా ప్రేక్షకులు ఫీల్ అవ్వాలంటే దానికి మ్యూజిక్ ముఖ్యం. విజయ్ బుల్గానిన్ అద్భుతమైన సంగీతం, ఆర్‌ఆర్ అందించారు. ఇందులో వైష్ణవీ చైతన్య అద్భుతంగా నటించింది.

నాకు ఇంత వరకు థియేట్రికల్ హిట్ లేదు. మా సినిమా బజ్ చూసి, ట్రైలర్ రియాక్షన్ చూసి, పాటలకు వచ్చి చూసిన రెస్పాన్స్‌తో వేసిన ప్రీమియర్స్ హౌస్ ఫుల్ అవుతున్నాయి. ఈ సినిమాకు యూత్‌తో పాటు మాస్ జనాలూ కనెక్ట్ అవుతారు. నా కెరీర్‌లో 'బేబీ'ది గ్రేట్ జర్నీ, ప్రస్తుతం 'గం గం గణేశా' సినిమా షూటింగ్ పూర్తి కాబోతోంది.

## హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్


శివ రాజ్‌కుమార్

శివరాజ్ కుమార్ నటిస్తున్న హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'ఘోస్ట్'. ఈ పాన్ ఇండియా సినిమాకి దర్శకుడు శ్రీని దర్శకుడు. రాజకీయ నాయకుడు, నిర్మాత సందేశ్ నాగరాజ్ తన సందేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శివరాజ్ కుమార్ పుట్టినరోజుని పురస్కరించుకుని మేకర్స్ ఈ చిత్రం నుండి బిగ్ డాడీ టీజర్‌ని బుధవారం రిలీజ్ చేశారు.
'ఈ టీజర్‌నిలో షాట్స్, 'మీరు గన్నుతో ఎంత మందిని భయపెట్టారో అంత కంటే ఎక్కువ మందిని నేను నా కళ్ళతో భయపెట్టాను. దే కాల్ మీ ఓ జీ... ఒరిజినల్ గ్యాంగ్ స్టర్" అనే పవర్‌ఫుల్ డైలాగ్, శివన్న (శివరాజ్‌కుమార్) టెర్రిఫిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో సూపర్ స్వాగ్‌తో ఆకటుకున్నారు. అర్జున్ జన్య అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్, యాక్షన్ ఫిల్మ్‌కి తగ్గ లైటింగ్ మూడ్‌ను అందించిన సినిమాటోగ్రాఫర్ మహేష్ సింహా పనితనం ఆకట్టుకుంటుంది. 'బిగ్ డాడీ'గా ఏకంగా వార్ టాంకర్‌నే తెచ్చిన దర్శకుడు శ్రీని విజన్‌ను మెచ్చుకోకుండా ఉండలేం. నిర్మాత సందేశ్ నాగరాజ్ అత్యంత భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని టెక్నికల్‌గా టాప్ లెవెల్‌లో నిర్మిస్తున్నారు అని చిత్ర బృందం పేర్కొంది. అనుపమ్ ఖేర్, జయరామ్, ప్రశాంత్ నారాయణ్, అర్చన జాయిస్, సత్య ప్రకాష్, దత్తన్న ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని కన్నడ, తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో దసరా కానుకగా భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు.

## థియేటర్లు పెంచుతున్నాం


సుభాష్ కట్టా, దివ్య భావన, ఆర్యన్‌గౌరా

ఆర్యన్‌గౌరా, మిస్తీ చక్రవర్తి జంటగా నటించిన చిత్రం 'ఓ సాథియా'. దివ్యభావన దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని తన్విక-జశ్విక క్రియేషన్స్ పతాకంపై సుభాష్ కట్టా, చందన కట్టా నిర్మించారు. ఈనెల 7న ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీగా విడుదలైన ఈ సినిమాకి ప్రేక్షకులనుండి మంచి స్పందన లభిస్తుండటంతో చిత్ర బృందం సక్సెస్‌మీట్ ఏర్పాటు చేసింది.
దర్శకురాలు దివ్యభావన మాట్లాడుతూ,'మా సినిమాకి వచ్చిన చక్కటి రెస్పాన్స్ చూసి చాలా ఆనందపడ్డాను. కానీ చాలా చోట్ల, చాలా జిల్లాల్లో ఈ సినిమా థియేటర్లలో విడుదల కాలేదని డిప్రెషన్‌కి లోనయ్యాను' అని అన్నారు.
'సినిమా చూసిన ప్రతి ఒక్కరూ సినిమా గురించి గొప్పగా మాట్లాడుతుండటంతో రెండోవారంలో థియేటర్లను పెంచుతున్నాం. మంచి కాన్సెప్ట్‌తో చేసిన ఈ సినిమా మరింత మంచి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాం' అని నిర్మాత సుభాష్ కట్టా చెప్పారు.
హీరో ఆర్యన్ మాట్లాడుతూ,' 'నేనూ, మా హీరోయిన్ థియేటర్లకు వెళ్లి పబ్లిక్ టాక్‌ను, రెస్పాన్స్‌ను కళ్లారా చూశాం. వారి స్పందన చూసిన తర్వాత సినిమా రెండో వారం నుండి పెద్ద ఎత్తున సక్సెస్ సాధిస్తుందని నమ్ముతున్నాను. ఈ వారం మంచి థియేటర్లను సంపాదించి మీ ముందుకు వస్తున్నాం. ప్రేక్షకులు ఆదరించి మా చిన్న సినిమాను బ్రతికించాలని కోరుకుంటున్నా' అని తెలిపారు.


## ప్రయోగాత్మక చిత్రం


రూపా కొడవాయూర్, సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సయ్యద్ సోహైల్ రియాన్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'మిస్టర్ ప్రెగ్నెంట్'. రూపా కొడవాయుర్ హీరోయిన్‌గా మైక్ మూవీస్ బ్యానర్‌లో అన్నపరెడ్డి అప్పిరెడ్డి, రవిరెడ్డి సజ్జల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీనివాస్ వింజనంపాటి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 18న విడుదలకు సిద్ధమవుతోంది.
సినిమాలో హీరో సోహైల్ ప్రెగ్నెంట్‌గా కనిపించనున్నాడు. తెలుగు తెరపై ఇదొక కొత్త తరహా ప్రయత్నంగా చెప్పుకోవచ్చు. సినిమా అవుతట్ పుట్ విషయంలో మేకర్స్ సంతృప్తిగా ఉన్నారు. రిలీజ్‌కి కూడా ఆగస్టు 18 మంచి డేట్‌గా భావిస్తున్నారు. వైవిధ్యమైన సినిమాలకు ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో ఈ సినిమా మంచి సక్సెస్ సాధిస్తుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి. అలాగే మేకర్స్ సైతం సినిమా విజయంపై గట్టి నమ్మకంతో ఉన్నారు. అందరినీ అలరించే సినిమా' అని చిత్ర యూనిట్ తెలిపింది. సుహాసిని మణిరత్నం, రాజా రవీంద్ర, బ్రహ్మాజీ, అలీ, హర్ష నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - నిజార్ షఫీ, సంగీతం - శ్రావణ్ భరద్వాజ్, ఎడిటింగ్ - ప్రవీణ్ పూడి, ఆర్ట్ - గాంధీ నడికుడికర్.

## 22, 23న రెజ్లింగ్ ట్రయల్స్

### సెలక్షన్స్ రూల్స్‌పై సర్వత్రా ఆసక్తి



**న్యూఢిల్లీ :** భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నియమించిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అడ్ హాక్ కమిటీ ఆసియా క్రీడల జట్ల ఎంపికకు సెలక్షన్ ట్రయల్స్‌పై ఎట్టకేలకు నిర్ణయం తీసుకుంది. ఆసియా క్రీడలకు జట్లను పంపేందుకు రెజ్లింగ్ క్రీడాంశం వరకు జులై 10 వరకు గడువు ఇవ్వాలని ఆసియా ఒలింపిక్ కమిటీని (ఓసీఏ) ఐఓఏ అభ్యర్థించగా.. అందుకు ఓసీఏ నిరాకరించింది. దీంతో రెజ్లింగ్ ట్రయల్స్‌కు షెడ్యూల్ ప్రకటించాలని అడ్‌హాక్ కమిటీని ఐఓఏ సూచించింది. జులై 22, 23న న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహిస్తామని అడ్‌హాక్ కమిటీ చీఫ్ భూపిందర్ సింగ్ బజ్వా వెల్లడించారు. 'జులై 22, 23న జాతీయ సెలక్షన్ ట్రయల్స్ నిర్వహణకు నిర్ణయించాం. తొలి రోజు ట్రయల్స్‌లో గ్రీకో రోమన్, మహిళా రెజ్లర్లు పోటీపడతారు. రెండో రోజు ట్రయల్స్‌లో మెన్స్ ఫ్రీ స్టయిల్ రెజ్లర్లకు పోటీలు ఉంటాయి. అండర్-20 రెజ్లర్లకు ట్రయల్స్‌లో పోటీపడే అవకాశం ఇవ్వాలని అనుకున్నాం. ఆసియా చాంపియన్‌షిప్స్‌లో పోటీపడుతున్న యువ రెజ్లర్లు జులై 21న స్వదేశానికి రానున్నారు. సెలక్షన్ ట్రయల్స్ నిబంధనలు, ఫార్మాట్‌పై నిర్ణయం తీసుకోలేదు. ఆ వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని' బజ్వా అన్నారు.
**రెజ్లింగ్ వర్గాల్లో ఆసక్తి :** బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల కేసులో చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన ఆరుగురు రెజ్లర్లకు ట్రయల్స్‌లో మినహాయింపు ఇస్తారా? లేదా ? అనేది ఆసక్తిగా మారింది. ఆందోళనలో పాల్గొన్న ఆరుగురు రెజ్లర్లు శారీరకంగా, మానసికంగా ట్రయల్స్‌లో పోటీపడే స్థితిలో లేనందున.. ప్రాథమిక ట్రయల్స్‌లో విజేతగా నిలిచిన రెజ్లర్‌తో ఆరుగురు రెజ్లర్లకు సింగిల్ బౌట్ నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. అడ్‌హాక్ కమిటీ నిర్ణయంపై కొందరు విమర్శలు గుప్పించారు. దీంతో ఆరుగురు రెజ్లర్లకు ట్రయల్స్ నిర్వహణపై ఏం చేయాలని ఆలోచన చేస్తుంది. భారత ఒలింపిక్ సంఘం, క్రీడా మంత్రిత్వ శాఖలను సంప్రదించి తగిన నిర్ణయం తీసుకుంటామని బజ్వా తెలిపారు. బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్ ప్రస్తుతం విదేశాల్లో శిక్షణలో ఉన్నారు. ఆరుగురు రెజ్లర్లను రిజర్వ్ క్రీడాకారులుగా ఎంపిక చేసి.. ఆగస్టులో రౌండ్ రాబిన్ పద్ధతిలో పోటీలు నిర్వహించి ఉత్తమ రెజ్లర్‌ను ఆసియా క్రీడల్లో పోటీలకు ఎంపిక చేయటం సముచితంగా ఉంటుందని అడ్‌హాక్ కమిటీ సభ్యుడు, కోచ్ సింగ్ అన్నారు. ఆసియా క్రీడలకు గ్రీకో రోమన్, ఫ్రీ స్టయిల్ (మెన్), ఫ్రీ స్టయిల్ (ఉమెన్) ఫార్మాట్లలో ఒక్కో ఫార్మాట్‌లో ఆరు వెయిట్ విభాగాల చొప్పున ఓవరాల్‌గా 18 వెయిట్ విభాగాల్లో ఎంపిక ట్రయల్స్ నిర్వహించాల్సి ఉంది.

## ఆసియా క్రీడలకు దీప

### జిమ్నాస్టిక్స్ జట్టులో చోటు



**భువనేశ్వర్ :** 21 నెలల నిషేధం ముగించుకుని నేరుగా ఆసియా క్రీడల సెలక్షన్ ట్రయల్స్‌లో పోటీపడిన భారత స్టార్ జిమ్నాస్ట్ దీప కర్మాకర్ ఘనంగా పునరాగమనం చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంది. భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో రెండు రోజుల పాటు జాతీయ సెలక్షన్ ట్రయల్స్‌లో దీప కర్మాకర్ పోటీపడింది. వాల్ట్ ఈవెంట్‌లో 360 డిగ్రీల ఫ్రంట్, 360 డిగ్రీల బ్యాక్‌తో పాటు టీమ్‌ఫైనా మెరుగైన ప్రదర్శన కనబరిచింది. ఆకట్టుకునే ప్రదర్శన చేసిన దీప కర్మాకర్ తొమ్మిది మందితో కూడిన ఆసియా క్రీడల భారత జిమ్నాస్ట్ జట్టులో చోటు సాధించింది. ఆసియా క్రీడల్లో వాల్ట్‌లో దీప కర్మాకర్ 540 ఫ్రంట్, 720 బ్యాక్ ప్రదర్శన కనబర్చనుందని ఆమె కోచ్ బిశ్వేశ్వర్ నంది తెలిపారు.
**భారత జిమ్నాస్ట్ జట్టు :** దీప కర్మాకర్, ప్రణతి దాస్, ప్రణతి నాయక్, సమంత, బిడిశ గయాన్ (మహిళలు). యోగేశ్వర్ సింగ్, రాకేశ్ పాత్ర, తపన్ మోహంతి, గౌరవ్ కుమార్, సత్యజిత్ మండల్, అనాస్ అలీ షేక్ (పురుషులు).

## అభిషేక్ పాల్‌కు కాంస్య పతకం

### ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

**బ్యాంకాక్ (థాయ్‌లాండ్)**
ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో టీమ్ ఇండియా బోణీ కొట్టింది. ఆసియా అథ్లెటిక్ సమాఖ్య ఏర్పాటై 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఈ మెగా పోటీల తొలి రోజే భారత్ పతకం సాధించింది. 10000 మీటర్ల రేసులో భారత స్ప్రింటర్ అభిషేక్ పాల్ కాంస్య పతకం సాధించాడు. పది కీమీ నడక రేసును అభిషేక్ పాల్ 29.33.26 సెకండ్లలో పూర్తి చేశాడు. డెకథ్లాన్ తొలి రోజు పోటీల్లో తేజస్విన్ శంకర్ ఆకట్టుకున్నాడు. 4124 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన తేజస్విన్ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో తొలి పసిడి దిశగా దూసుకెళ్తున్నాడు. మహిళల జావెలిన్ త్రోలో అన్ను రాయ్ 59.10 మీటర్ల త్రోతో నాల్గో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది అన్ను రాయ్ 60 మీటర్ల మార్క్‌ను చేరుకోవాల్సి ఉంది. మెన్స్ 400 మీటర్ల పరుగులో రాజేశ్ రమేశ్, మహ్మద్ అజ్మల్‌లు ఫైనల్స్‌కు అర్హత సాధించారు. 45.76 సెకండ్లతో తొలి సెమీఫైనల్లో నాల్గో స్థానంలో నిలిచిన అజ్మల్.. నాన్ ఆటోమెటిక్ అథ్లెట్లలో వేగవంతమైన స్ప్రింటర్‌గా మెడల్ రేసుకు చేరుకున్నాడు. 45.91 సెకండ్లతో రెండో సెమీఫైనల్లో మూడో స్థానంలో నిలిచిన రమేశ్ నేడు పతకం కోసం పరుగెత్తనున్నాడు. మహిళల 400 మీటర్ల హీట్స్‌లో 53.58 సెకండ్లతో మెరిసిన ఐశ్వర్య మిశ్రా ఫైనల్స్‌కు అర్హత సాధించింది. మహిళల 1500య మీటర్ల రేసు ఫైనల్లో 4.27.61 సెకండ్లతో లిలి దాస్ ఏడో స్థానంలో నిలిచింది.ప్రత్యేక సందర్భంలో నిర్వహిస్తున్న ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌కు హిందూ దేవుడు 'హనుమంతుడు'ని అధికారిక మస్కట్‌గా ప్రకటించిన సంగతి తెలిసిందే. అథ్లెట్లకు ఉండాల్సిన లక్షణాలు హనుమాన్‌లో ఉన్నాయని ఈ సందర్భంగా ఆసియా అథ్లెటిక్స్ సమాఖ్య వెల్లడించింది.

## మాయతో మొదలైంది!

- అశ్విన్, జడేజా మాయజాలం
- వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ 68/4
- భారత్, విండీస్ తొలి టెస్టు

భారత్, వెస్టిండీస్ తొలి టెస్టు మాయజాలంతో మొదలైంది. టాస్ ఓడిన టీమ్ ఇండియా.. తొలి సెషన్లోనే స్పిన్‌ను ప్రయోగించి ఆతిథ్య కరీబియన్లను కంగుతినిపించింది. అశ్విన్, జడేజాలకు తోడు శార్దుల్ మెరవటంతో లంచ్‌లోపే వెస్టిండీస్ 4 వికెట్లు చేజార్చుకుంది. రోహిత్‌సేన తొలి సెషన్లోనే పట్టు సాధించింది!.

నవతెలంగాణ-రోజో



మాయగాళ్లు మెరిశారు. కరీబియన్ గడ్డపై తొలి సెషన్లోనే స్పిన్ మ్యాజిక్‌తో అదరగొట్టారు. ట్రంప్‌కార్డ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ (2/25), రవీంద్ర జడేజా (1/6) బంతిని తిప్పేయగా.. కరీబియన్ బ్యాటర్లు విలవిల్లాడారు. కొత్త బంతితో మహ్మద్ సిరాజ్ నిప్పులు చెరిగినా.. వికెట్ కాపాడుకున్న విండీస్ స్పిన్నర్ల రాకతో చతికిల పడింది. తొలి సెషన్‌లో 28 ఓవర్లలో 68 పరుగులు చేసిన వెస్టిండీస్ 4 వికెట్లు కోల్పోయింది.
**మ్యాజిక్ షో :** టాస్ నెగ్గిన వెస్టిండీస్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఇక్కడ తొలి రెండు రోజులు బ్యాటింగ్‌కు అనుకూలం. దీంతో కరీబియన్లు మంచి స్కోరుపై కన్నేశారు. మహ్మద్ సిరాజ్, జైదేవ్ ఉనద్కత్‌లు కొత్త బంతితో విండీస్ ఓపెనర్లను ఇబ్బంది పెట్టారు. అయినా, క్రెయిగ్ బ్రాత్‌వేట్ (20), చందర్‌పాల్ (12) నిలబడ్డారు. ఈ పిచ్ సంప్రదాయంగా స్పిన్‌కు అనుకూలం. దీంతో కెప్టెన్ రోహిత్ శర్మ కాస్త ముందునే స్పిన్నర్ల చేతికి బంతి అందించాడు. రవిచంద్రన్ అశ్విన్ 10 ఓవర్లలో 25 పరుగులే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. ఓపెనర్లు ఇద్దరూ అశ్విన్ మాయలో పడిపోయారు. తొలి వికెట్‌కు 31 పరుగులు జోడించిన బ్రాత్‌వేట్, చందర్‌పాల్ అశ్విన్ మాయకు పెవిలియన్‌కు చేరారు. శార్దుల్ ఠాకూర్ ఓవర్లో రేమన్ రీఫర్ (2) నిష్క్రమించగా.. లంచ్ విరామానికి చివరి బంతికి జెర్మైన్ బ్లాక్‌వుడ్ (14)ను రవీంద్ర జడేజా సాగనంపాడు. అరంగేట్ర బ్యాటర్ అలిక్ ఆల్తానెజ్ (13 బ్యాటింగ్, 26 బంతుల్లో 2 ఫోర్లు) తొలి సెషన్‌లో అజేయంగా నిలిచాడు.
**యశస్వి, కిషన్ ఇన్ :** వెస్టిండీస్‌తో తొలి టెస్టుకు భారత్ ఇద్దరు యువ ఆటగాళ్లను బరిలో నిలిపింది. యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్‌లు తొలి టెస్టు అవకాశం దక్కించుకున్నారు. యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ ఓపెనర్‌గా రానుండగా.. తెలుగు కుర్రాడు శ్రీకర్ భరత్ స్థానంలో ఇషాన్ కిషన్ వికెట్ కీపర్‌గా తుది జట్టులో నిలిచాడు. ఆల్‌రౌండర్లు జడేజా, శార్దుల్ నిలువగా.. సిరాజ్‌కు తోడుగా జైదేవ్ ఉనద్కత్ రెండో పేసర్‌గా ఎంపికయ్యాడు.
**9.30 గంటల వ్యత్యాసం :** వెస్టిండీస్‌తో తొలి టెస్టు మ్యాచ్ భారత కాలమానం ప్రకారం రాత్రి 7.30 గంటలకు ఆరంభమైంది. కరీబియన్ దీవులతో భారత కాలమానం తొమ్మిది గంటల 30 నిమిషాలు వ్యత్యాసం. దీంతో మూడో సెషన్ ముగిసే సరికి భారత్‌లో అర్ధరాత్రి 3 గంటలు అవుతుంది.
**స్కోరు వివరాలు :**
**వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ :** క్రెయిగ్ బ్రాత్‌వేట్ (సి) రోహిత్ (బి) అశ్విన్ 20, చందర్‌పాల్ (బి) అశ్విన్ 12, రేమన్ రీఫర్ (సి) ఇషాన్ (బి) ఠాకూర్ 2, బ్లాక్‌వుడ్ (సి) సిరాజ్ (బి) జడేజా 14, ఆల్తానెజ్ నాటౌట్ 13, ఎక్స్‌ట్రాలు : 7, **మొత్తం : (28 ఓవర్లలో 4 వికెట్లకు) 68.**
**వికెట్ల పతనం :** 1-31, 2-38, 3-47, 4-68.
**బౌలింగ్ :** మహ్మద్ సిరాజ్ 6-2-17-0, జైదేవ్ ఉనద్కత్ 5-2-7-0, రవిచంద్రన్ అశ్విన్ 10-3-25-2, శార్దుల్ ఠాకూర్ 3-1-7-1, రవీంద్ర జడేజా 2-0-6-1.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

# తప్పొకరిది... శిక్ష కుటుంబానికి..!

మధ్యప్రదేశ్‌లోని సీధీ జిల్లా కుర్బీ గ్రామంలో ఒక ఆదివాసీ కూలీపై మూత్రం పోసిన ప్రవేశ్ శుక్లాపై జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద కేసు నమోదు చేసిన అక్కడి ప్రభుత్వం... ఇటీవల అతడి ఇంటిని బుల్డోజర్‌తో కూల్చివేసింది. నిరసనల్లో పాలుపంచుకున్నారని గతంలో ఉత్తరప్రదేశ్, బీహార్, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లోనూ ఇలాంటి కూల్చివేతలు జరిగాయి. ఉత్తరాఖండ్‌లో హత్యకేసులో నిందితులకు సంబంధించి వ్యాపార సముదాయాన్ని ప్రభుత్వం నేలమట్టం చేసింది. అయితే ఇలాంటి కూల్చివేతలకు అక్రమ నిర్మాణాలు అని ముద్రవేస్తున్న ప్రభుత్వాలు... కోర్టులకు సైతం ఆక్రమణలంటూ సమాచారాన్ని ఇస్తున్నాయి. అయితే ప్రజల్లో మాత్రం చేసిన తప్పుకు శిక్ష అంటూ ప్రచారం చేస్తున్నాయి. ఇది నాణానికి ఒకవైపైతే... ఇండ్లను కూల్చివేయడంతో సదరు నిందితుల కుటుంబాల బాధలు వర్ణనాతీతం.'బుల్డోజర్ శిక్ష'ను అమలుచేసే ముందుకు సదరు ఫ్యామిలీ మెంబర్స్ గురించి ప్రభుత్వాలు ఆలోచించకపోవడం బాధాకరం.



ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ సీఎం అయ్యాక ఈ 'బుల్డోజర్ జస్టిస్' స్టార్ట్ అయిందని చెప్పవచ్చు. ఆ తర్వాత అది క్రమంగా మధ్యప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, అస్సాం ఇలా బీజేపీ పాలిత రాష్ట్రాలకు వ్యాపించింది. మొదట మాఫియా, క్రిమినల్స్ ఇండ్లను ప్రభుత్వాలు కూల్చడం ప్రారంభించి ఆ తర్వాత వివిధ రకాల నిరసనల్లో పాల్గొన్న సామాన్య వ్యక్తుల ఇండ్లపై కూడా బుల్డోజర్లు నడిపించడం స్టార్ట్ చేశారు. అయితే ఢిల్లీ, యూపీ, మధ్యప్రదేశ్‌లాంటి రాష్ట్రాల్లో ఇలాంటి కూల్చివేతలు ఎక్కువగా జరిగాయి. ముందుగా ఇలాంటి చర్యలకు పాలకులు ఒక మతానికి సంబంధించిన వారిని టార్గెట్‌గా చేసుకున్నారనే విమర్శలు వచ్చాయి. ఇలాంటి చట్టవ్యతిరేక కూల్చివేతలపై పలువురు హైకోర్టు, సుప్రీంకోర్టులను సైతం ఆశ్రయించారు. అయితే వీటిని ఆక్రమణలుగా ప్రభుత్వాలు సుప్రీం కోర్టుకు తెలిపాయి. దీంతో 'కూల్చివేతలనేవి చట్టానికి లోబడి ఉండాలని... అవి ప్రతీకారం తీర్చుకునేలా ఉండకూడదు' అని యూపీ ప్రభుత్వాన్ని గతంలోనే సుప్రీం కోర్టు హెచ్చరించింది. అంతేకాకుండా అస్సాంలో విచారణ ముసుగులో ఐదుగురు నిందితుల ఇండ్లపై బుల్డోజర్ నడిపించినందుకు గౌహతి కోర్టు అస్సాం పోలీసు సూపరింటెండెంట్‌ను మందలించింది. అయితే ఆ తర్వాత లైంగిక దాడులు, హత్యల్లాంటి నేరాలు చేసిన వారి ఇండ్లనూ కూల్చడం ప్రారంభించారు. బీజేపీ పాలిస్తున్న నాలుగైదు రాష్ట్రాల్లో ఇలాంటి న్యాయాన్నే అమలు చేస్తున్నట్టు కనిపిస్తున్నది.

తప్పు చేసిన వారికి చట్టప్రకారం శిక్షపడాలి. దీనికోసం పోలీసులు, న్యాయస్థానాలు నిరంతరం పని చేస్తూనే ఉన్నాయి. నేర నిర్ధారణ అనేది చట్ట పరమైన ప్రక్రియ ద్వారానే జరగాలి. వారికి శిక్ష విధించవలసింది న్యాయస్థానమే తప్ప అధికారంలో ఉన్న రాజకీయ నాయకులో, అధికారులో కాదు. అయితే నిందితులను గుర్తించడం, ఆధారాలు సేకరించడం, కేసు నమోదు చేయడం, అరెస్టులు చేయడం, న్యాయస్థానాల్లో ప్రవేశపెట్టడం వంటి సుదీర్ఘ ప్రక్రియ వల్లనే, న్యాయంపై అధికశాతం ప్రజల్లో అవిశ్వాసం ఏర్పడుతున్నదని, అందుకే తమ ప్రభుత్వం ఇన్‌స్టంట్ జస్టిస్ మార్గాన్ని ఎంచుకున్నదని ఆయా రాష్ట్రాల పాలకులు బహిరంగంగానే చెబుతున్నారు.



ఫిరోజ్ ఖాన్

చట్టప్రకారం నిందితులకు సరైన శిక్ష పడకపోతే బాధితులకు న్యాయం జరగదని సోషల్ మీడియా ద్వారా తెగ ప్రచారం చేస్తున్నారు. ఇండ్లను కూల్చివేసిన తర్వాత ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రుల ప్రకటనలు సైతం ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎవరు తప్పుచేసినా ఇలాంటి ట్రీట్‌మెంట్ ఉంటుందని స్వయంగా పాలకులే హెచ్చరిస్తుండడం రాజ్యాంగంపై, చట్టాలపై ప్రజలు నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తున్నది. అంతేకాకుండా ప్రజల ప్రాథమిక హక్కులకు తీవ్ర భంగం కలుగుతున్నది. మరోవైపు కూల్చివేతలు జరుగుతున్నప్పుడు కొందరు అధికారులు వాటిని తమ ట్వీట్లలో నేరానికి విధించిన శిక్షగా పేర్కొంటుండడం గమనార్హం. బుల్డోజర్లతో వెంటనే గుణపాఠం చెప్పాలన్న యావలో, చట్టపరంగా వ్యవహరించాల్సిన కర్తవ్యానికి ప్రభుత్వాలు నీళ్లొదులుతున్నాయి. చివరకు తాము చేసిన చట్టాలను సైతం సరైన రీతిలో అమలుచేసే సహనాన్ని కోల్పోతున్నాయి.తక్షణ రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రభుత్వాలు ఇలా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు ఎదుర్కొంటున్నాయి.

మధ్యప్రదేశ్‌లో నిందితుడు ప్రవేశ్ తల్లిదండ్రులు తమ ఇంటిని కూల్చొద్దని వేడుకున్నా అధికారులు కనికరించలేదు. రాజకీయ కక్షలతో పాత వీడియోను వైరల్ చేశారని, ఇంటిని కూల్చివేస్తే తల్లిదండ్రులు ఎక్కడికి వెళ్లాలని నిందితుడి సోదరి చెప్పినా పట్టించుకోలేదు. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన నిరసనల్లో జావెద్ మహమ్మద్ అనే వ్యక్తి ఇంటిని కూల్చి వేయగా, అది అతని భార్య పేరున ఉన్నదని, ఆమె కుటుంబం నుంచి బహుమతిగా వచ్చినట్టు తేలింది. ఈ ఇంటిపై ఎలాంటి వివాదాలు లేకున్నా కూల్చివేయడం చట్టవిరుద్ధమని ఆ కుటుంబం వాపోయింది. ఢిల్లీలోని జహంగీర్‌పురిలో అక్రమ నిర్మాణాలంటూ ఇండ్ల కూల్చివేత బాధితులకు కన్నీళ్లనే మిగిల్చింది. అన్ని పత్రాలున్నప్పటికీ తన జ్యూస్ షాప్‌ను ధ్వంసం చేశారంటూ గణేశ్ కుమార్ గుప్తా అనే చిరు వ్యాపారి వాపోయారు. బుల్డోజర్లతో ఓ చిన్నపాటి ఇంటిని కూల్చేస్తుంటే అందులో నివసించే ఓ మహిళ విలవిల్లాడిపోయింది. కూల్చి వేయొద్దంటూ అధికారులను బతిమాలింది. అయినప్పటికీ కనికరం చూపని అధికారులు... చూస్తుండగానే ఆమె సామగ్రిని జేసీబీలతో ఎత్తి ట్రాక్టర్‌లోని మట్టిలో పడేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిర్మించినా ఇండ్లనూ కూల్చి వేసిన సందర్భాలున్నాయి. ఇలాంటి చర్యల ద్వారా కోర్టు బయటే పాలకులు నేరాలను నిర్ధారించినట్లవుతున్నది. దీంతో నిందితులకే కాకుండా వారి కుటుంబాలకు సైతం శిక్షలు వేసినట్లవుతున్నది. ఒక వ్యక్తి చేసిన నేరానికి ఒక కుటుం బానికి సామూహికంగా ఇబ్బందులకు గురి చేయడం సరికాదు. ఇలాంటి చర్యలకు రాజ్యాంగంలో, ప్రజాస్వామ్యంలో చోటులేదు. ఇదిలా ఉంటే ఇండ్లను కూల్చివేయడం ద్వారా సదరు నిందితుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. నిలువ నీడ లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నాయి. నివాస గృహాన్ని కలిగి ఉండటమనేది ప్రాథమిక హక్కుగా గతంలోనే పలు కేసుల్లో కోర్టు తీర్పులుండగా ఎలాంటి తప్పు చేయకున్నా ఆ కుటుంబాలు ఆ హక్కును కోల్పోతున్నాయి.

సెల్:9640466464

# సమ్మెబాటలో మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాన్న భోజనం మంటలు చెలరేగుతున్నాయి. చాలీచాలని వేతనాలు, పెట్టుబడికి సరిపడా డబ్బులు రాక పోవడం, పెంచిన వేతనాలు చెల్లించక పోవడంతో సోమవారం నుండి మూడు రోజుల పాటు వంట కార్మికులు మధ్యాహ్న భోజనానకి విరామం ప్రకటించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు కుటుంబ పోషణ భారంగా మారటం వల్లనే చాలా మంది పేదలు పిల్లలని బడికి పంపకుండా పనులు చేయిస్తూ ఉన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకే ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. విద్యార్థులందరూ చదువు కోవటంతోపాటు పోషకాహారలోపాన్ని నివారించటం దీనిలక్ష్యం. కాని ప్రభుత్వం నిర్లక్ష్యంతో లక్ష్యాలు నీరుగారుతున్నాయి. పథకం మొక్కుబడిగా అమలవుతోంది. మధ్నాహ్న భోజనం కాస్త మిథ్యాహ్న భోజనంగా మారిపోయింది. ప్రభుత్వ పాఠశాల్లలో లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నట్లు అధికారులు గణాంకాలు చూపుతున్నా క్షేత్రస్థాయిలో పూర్తిగా భిన్నమైన పరిస్థితి నెలకొంది. సగం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు సరిగ్గా అందడం లేదని తెలుస్తోంది. రోజు రోజుకూ కూరగాయలు, కందిపప్పు, వంటనూనెల ధరలు విపరీతంగా పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం కార్మికులకు 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు రూ.5.45 చొప్పున, 6 నుంచి 8వ వరకు విద్యార్థులకు రూ.8.17, 9 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.10.67 చొప్పున చెల్లిస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు, ప్రభుత్వం చెల్లిస్తున్న మొత్తం గిట్టుబాటు కావడంలేదని కార్మికులు చెబుతున్నారు. అందుకే మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణకు వారు వెనుకాడుతు సమ్మెకి దిగారు. పాఠశాలలకు మధ్యాహ్న భోజనం కార్మికులు రావటంలేదు. ఆయా చోట్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి స్థానిక మహిళా సంఘాల సభ్యులతో వంట చేయిస్తున్నారు. విద్యార్థులకు నామమాత్రంగా మధ్యాహ్న భోజనం అందిస్తున్నా మెనూ మాత్రం అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గిట్టుబాటు కాకపోయినా చాలా ఏళ్లుగా పనిచేశామన్న భావనతో మధ్యాహ్న భోజనం పథకాన్ని నెట్టుకొస్తున్నారు. రోజూ వివిధ రకాల కూరగాయలతో వంటలు చేయాల్సి ఉన్నా ధరలు ఎక్కువగా ఉన్నాయన్న కారణంతో పలచని పప్పు, కిచిడీ, నీళ్లచారునే ఎక్కువగా వడ్డిస్తున్నారు. భోజనం సరిగ్గా లేక విద్యార్థులు పూర్తిగా తినక పస్తులుంటున్నారు. దీంతో సాయంత్రం 4.45గంటల వరకు అలాగే ఉండాల్సి రావటంతో ఆకలితో అలమటిస్తున్నారు.



కామిడి సతీష్‌రెడ్డి
9848445134

మెనూ ప్రకారం విద్యార్థులకు వారంలో మూడు రోజులు కోడిగుడ్లు అందజేయాలి. కోడిగుడ్లు అందించిన రోజు మధ్యాహ్న భోజనం కార్మికులకు ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై అదనంగా రూ.5 చెల్లిస్తుంది. ప్రస్తుతం కోడిగుడ్డు ధర రూ.6 నుండి 7 ఉంది. దీని ధర అధికంగా ఉండటంతో నిర్వాహకులు ముందుకు రావటం లేదు. ఈ కారణంగా ఎక్కడా అమలు కావటంలేదు. ప్రభుత్వం రూ.5చెల్లిస్తూ వారానికి మూడు రోజులు కోడిగుడ్డు అందించాలని చెప్పటం ఎంతవరకు సమంజసమనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం సరఫరా చేసే బియ్యంలోనూ తరుగు వస్తున్నది. కొన్ని సార్లు ముక్కిపోయిన బియ్యం సరఫరా చేస్తున్నారు. కొన్ని జిల్లాల్లో వంట నిర్వాహకులు మధ్యాహ్న భోజనం అందించే ప్రయత్నం చేస్తున్నా కొన్నిచోట్ల వంట కార్మికులు ముందుకు రాలేదు. ప్రభుత్వ ఆదేశాలతో స్థానిక మహిళ సంఘాల సభ్యులతో విద్యార్థులకు భోజనం అందించే ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నా, మధ్యాహ్న భోజనం అమలు కావడంలేదు. కొన్ని చోట్ల ఇంటి నుంచే భోజనం తెచ్చుకుని మధ్యాహ్నం తింటున్నారు. మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు భారీగా పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్న మొత్తాలు ఏమాత్రం వారికి గిట్టుబాటు కావడం లేదు. విద్యార్థులకు అన్నం, పప్పుతో భోజనం అందిస్తున్నారు. మెనూ అమలు చేయడం వారికి కష్టంగా మారింది. బిల్లులు కూడా సకాలంలో చెల్లించడం లేదు. అప్పులు తెచ్చి సరుకులు కొనుగోలు చేస్తున్నారు.



మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, అలాగే వారికి నెలనెలా బిల్లును సకాలంలో చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదివరకు అసెంబ్లీలో సీఎం చేసిన ప్రకటన ద్వారా జీఓ నెంబర్ 8 ప్రకారం ఏరియర్స్ చెల్లించాలని, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని అడుగుతున్నారు. వంట షెడ్లు, పాత్రలు మౌలిక సదుపాయాలు కల్పించాలని, గుడ్లకు అదనపు బడ్జెట్ కేటాయించాలని, గ్యాస్ సబ్సిడీ ద్వారా అందించి, కాటన్ వస్త్రాల యూనిఫాంలు ఇవ్వాలని విన్నవిస్తున్నారు అలాగే రాజకీయ వేధింపులు ఆపాలని, ఎలాంటి షరతులు లేకుండా బ్యాంక్‌ల ద్వారా ప్రభుత్వం రుణాలు ఇప్పించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులు డిమాండ్ చేస్తూ సమ్మెబాట పట్టారు. విద్యార్థులతో ముడిపడి ఉన్న వీరి సమస్యతో పాటు న్యాయమైన వీరి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

# 'బీజేపీ-ఆరెస్సెస్ హీనసంస్కృతి'

ఈ నెల 8న ఈసీఐఎల్ చౌరస్తాలో అఖిల భారత శాంతి సంఘం పాలస్తీనాకు సంఘీభావంగా, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శన చేయగా, దాన్ని చూసి ఒకరు పోస్ట్ పెట్టారు. అదేమిటంటే "కాశ్మీర్లో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడని మీరు పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించటం విడ్డూరం" అని ఆర్ఎస్ఎస్, బీజేపీ మిత్రుడు ఆ పోస్ట్‌లో ప్రశ్నించారు. అవును నిజమే. కాశ్మీర్లో ఉగ్రవాదం ప్రజ్వరిల్లుతుండగా దానికి వ్యతిరేకంగా పోరాడింది భారత సైనికులు, ప్రజాతంత్రవాదులు. వాళ్లే అనేకమంది అక్కడి ఉగ్రవాదానికి బలయ్యారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక గతంలో నాయకులందరూ పనికిమాలిన వారు, మేము పూర్తిగా అణిచివేసి, శాంతియుత కాశ్మీర్‌ను మీకందిస్తామని భారత ప్రజలకు చెప్పారు. ఆనాడు కాశ్మీర్ ప్రజల ఆశలకనుగుణమైన 370 ఆర్టికల్‌ను సహించేది లేదంటూ బీజేపీ కేంద్ర ప్రభుత్వం దాన్ని రద్దుచేసింది. కాశ్మీర్లో ఎవరైనా ఆస్తులు కొనుగోలు చేయవచ్చని, భారతదేశం అంతా ఒకటేనని చెప్పింది. ఆ రూపంగా బడా పెట్టుబడిదారులకు, తమ తాబేదారులైన వారికి వేల ఎకరాలు సమర్పించుకున్నారు. ఇంకా అంతా శాంతి అని ఊదరగొట్టారు. బీజేపీ పాలన తొమ్మిదేండ్లు గడిచింది. అయినా నిత్యం దేశంలో ఏదో ఓచోట రావణకాష్టంలో మండుతూనే ఉంది. ఇది బీజేపీ ప్రభుత్వం వైఫల్యం కాదా? నేడు మణిపూర్‌లో రిజర్వేషన్ల చిచ్చుపెట్టి, ప్రజల్లో వైషమ్యాలు సృష్టించి, పరస్పరం దాడులు చేసుకొనే విధంగా నేడు అగ్నిగుండంగా మారిపోయింది. కాశ్మీర్ ఫైల్స్ అంటూ ఒక వర్గాన్ని టార్గెట్ చేసి సినిమాలు తీయడం, రెండో పక్క శాంతియుతంగా ఉన్న కేరళ ప్రజలకు ఉగ్రవాదం ముద్ర వేసి కేరళ స్టోరీ అనే పేరు మీద సినిమాలు తీసి ప్రజల్లో వైషమ్యాలు సృష్టించారు. ఎక్కడ అవకాశమున్న అక్కడ అంతా ప్రజలను మతాలుగాను, కులాలుగాను విభజించి భారతీయతకు మూలమైన ఐక్యతను దెబ్బకొడుతున్నారు. మతం అనేది వ్యక్తిగతం, మతోన్మాదం దుర్మార్గమైంది. దాన్ని రెచ్చగొట్టే వాళ్ళందరూ ఉగ్రవాదులే! ఆ ఉగ్రవాదాన్ని నేడు బీజేపీ ప్రభుత్వమే కొమ్ముకాసి పెంచి పోషిస్తున్నది. ప్రజాతంత్ర వాదులను, లౌకిక భావాలు కలిగిన వారిని హత్యలుచేయటం పరిపాటిగా మారింది. మతోన్మాదాన్ని, పాలకుల దుర్మార్గాలను వ్యతిరేకించే వారిని దేశద్రోహ కేసులను పెట్టి జైల్లో పెడుతున్నారు. భావోద్వేగాలను రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకుంటున్నారు.

పుల్వామా ఘటనను ఆసరాగా తీసుకొని రెండోసారి ఎన్నికల్లో గెలిచారు. అయితే ఆ సంఘటనలో సైనికులకు విమానాల్లో పంపించే విధంగా కాకుండా రోడ్డు మార్గంలో ప్రయాణం చేయడం వల్ల 40మందిని కోల్పోయాం. పుల్వామా దాడిని ముందే పసిగట్టి ప్రధానమంత్రికి ఆనాటి గవర్నర్ వివరించినా మిన్నకుండి, సైనికులు అమరులైనాక దానిని ప్రచార అస్త్రంగా ఉపయోగించుకున్నారు. దాన్ని బయటపెట్టిన ఆనాటి గవర్నర్‌ను ఇబ్బందుల పాలు చేశారు. మహిళలు ధరించే హిజాబ్ విషయాన్ని కూడా రాజకీయంగా మలుచుకున్నారు. రైతులపై దాడి చేసి సంవత్సరం పైగా పోరాటం చేస్తే, వందలాది రైతులు అమరులైన పట్టించు కోకుండా వ్యవహరించగా దేశవ్యాప్తంగా వచ్చిన నిరసనలకు తలవగ్గి దుష్ట చట్టాలు మూడింటిని రద్దు చేశారు. అయినా న్యాయమైన మద్దతు ధర చట్టాన్ని కోరగా, వెంటనే చట్టం చేస్తామని చెప్పి మోసగించారు. బీజేపీ ఆర్ఎస్ఎస్ వారిదంత మహిళలను అణిచివేయాలనే లక్ష్యం కలిగినవారు. లైంగికదాడులు ఆ తర్వాత హత మార్చడం చేయాల్సిందే! చివరకు కాల్చివేయడం లాంటి హీనసంస్కృతిని పెంచి పోషిస్తున్నారు. చివరకు ప్రపంచ క్రీడల్లోనే ఒలంపిక్‌లో సైతం పథకాలు సాధించిన మహిళా రెజర్లను లైంగి కంగా వేధించటం బీజేపీ ఎంపీకే దక్కింది. దానికి వ్యతిరేకంగా పోరాడిన మహిళలపై కేసులు దుర్మార్గాలు చేసింది. అతని రక్షించుకుంటూ నేటి పాలకులు నిస్సి గ్గుగా వ్యవహరిస్తున్నారు. ఇటువంటి దుర్మార్గాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉన్నది. ప్రపంచ శాంతికోసం పోరాడుతున్న అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం ఇటువంటి దుర్మార్గాలకు వ్యతిరేకంగా పోరాడితే అటువంటి వారికి బుద్ధి వస్తుందని నా భావన. అంతే కాకుండా ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజలందరూ కూడా పోరాడాల్సిందే!

- గొడుగు యాదగిరిరావు, 9490098660

బిజినెస్

# హాస్టల్‌లో ఒక్క పూట విడిదీ పొందవచ్చు..!

- త్వరలో పిగోలో అవకాశం
- ఫౌండర్ హరి క్రిష్ణ వెల్లడి
- స్మార్ట్ మీటర్ల కోసం రేడియస్‌తో ఒప్పందం

నవతెలంగాణ - బిజినెస్ బ్యూరో

విద్యార్థులు, ఉద్యోగులు సాధారణంగా ఒక్క నెల లేదా అంతకంటే ఎక్కువ రోజులు హాస్టల్‌లో ఉండటానికి వీలుంటుంది. కానీ.. ప్రయివేటు హాస్టళ్ల అగ్రిగేటర్ అయినా పిగో ఒక్క పూట లేదా అంతకంటే ఎక్కువ రోజులు కూడా విడిది చేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించిన కసరత్తు జరుగుతోందని.. ఈ సౌలభ్యాన్ని తమ అనుసంధానిత హాస్టళ్లలో త్వరలోనే తీసుకురానున్నామని పిగో ఫౌండర్, సీఈఓ హరి క్రిష్ణ తెలిపారు. విద్యా, ఉద్యోగార్థులకు, ఇతరులకు ఇప్పటి వరకు ఇలాంటి సదుపాయం లేదన్నారు. బుధవారం హైదరాబాద్‌లో విద్యుత్ స్మార్ట్ మీటర్ల టెక్నాలజీ సంస్థ రేడియస్‌తో పిగో, ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ (ఇట్చా) ఒప్పందం కుదుర్చుకున్నాయి.




ఈ సందర్భంగా హరి క్రిష్ణ మీడియాతో మాట్లాడుతూ.. పిగో 200 నగరాలు, పట్టణాల్లో విస్తరించి ఉందన్నారు. దాదాపుగా 20వేల హాస్టల్స్‌లో ఒప్పందాలు చేసుకుందన్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే 4వేల పైగా హాస్టళ్ల భాగస్వాములతో కలిసి పని చేస్తుందన్నారు. ఇందులో మెజారిటీ ఐటి కారిడార్‌లోనే ఉన్నాయన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే 15వేల గదుల్లో స్మార్ట్ విద్యుత్ మీటర్లను అమర్చామని, మరో తొలి దశలో రెండు లక్షలు, రెండో దశలో మరో 2 లక్షల యూనిట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వీటి వల్ల కనీసం 15 శాతం విద్యుత్ ఆదా కానుందన్నారు. దాదాపు 70 లక్షల యూనిట్ల వినియోగం తగ్గనుందన్నారు.ఇట్చా జనరల్ సెక్రెటరీ తాతా కరుణాకర్ మాట్లాడుతూ.. కరోనా కాలంలో హాస్టల్ రంగం కుదేలయ్యిందన్నారు. భారీ నష్టాలు చవి చూశామన్నారు. తిరిగి ఇప్పుడు పుంజుకుందన్నారు. హైదరాబాద్ మహానగరంలో 10వేల హాస్టళ్లు ఉంటే.. అందులో 4వేల మేర ఐటీ ప్రాంతాల్లోనే ఉన్నాయని తెలిపారు. వీటిల్లో దాదాపు 4 లక్షల మంది అతిథులు ఉంటారన్నారు. ఈ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను విద్యార్థులు లేదా ఉద్యోగులే రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది కాబట్టి.. విద్యుత్ వాడకం పట్ల పొదుపుగా ఉంటున్నారన్నారు. ప్రస్తుతం 30 శాతం మేర వాడకం తగ్గిందన్నారు. ఒక్కో మీటర్ ఏర్పాటుకు రూ.5వేల మేర వ్యయం అవుతుందని రేడియస్ ఎండీ హరి సింగ్ తెలిపారు.

## బైక్‌బజార్ ఫైనాన్స్‌తో 2వేల ఈవీల డెలివరీ: బిగాస్ వెల్లడి

హైదరాబాద్ : బైక్‌బజార్ ఫైనాన్స్ ద్వారా పిక్యూ డెలివరీ భాగస్వాములకు 2,000 విద్యుత్ వాహనాలను డెలివరీ చేయనున్నట్టు బిగాస్ ప్రకటించింది. ఆయా సంస్థలతో భాగస్వామ్యంతో చివరి మైలు డెలివరీ కార్యకలాపాలను ఉన్నతంగా మార్చడంతో పాటుగా రవాణ పరిష్కారాలను ప్రోత్సహించడం లక్ష్యమని బిజి ఎలక్ట్రిక్ స్కూటర్స్ వ్యవస్థాపకుడు, ఎండీ హేమంత్ కబ్రా తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో పలువురి వినియోగదారులకు బిగాస్ ఈవీలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ వాహనాలకు ఫైనాన్స్‌ను అందించడాన్ని బైక్‌బజార్ సులభతరం చేయనుందన్నారు. తాము అమ్మకాల తర్వాత కూడా ఉత్తమ సర్వీసింగ్ సేవలను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

## 28 శాతం జీఎస్టీతో ఆన్‌లైన్ గేమింగ్ నిర్వీర్యం

- అష్నీర్ గ్రోవర్ విమర్శలు



న్యూఢిల్లీ : ఆన్‌లైన్ గేమింగ్‌పై 18 శాతం వస్తు సేవల పన్ను (జీఎస్టీ) విధించడాన్ని భారత్ పే సహ వ్యవస్థాపకుడు అష్నీర్ గ్రోవర్ తప్పుబట్టారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించిన హెచ్చు పన్ను విధానం వల్ల గేమింగ్ రంగం నిర్వీర్యం కానుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చర్య ఎదుగుతున్న గేమింగ్ రంగానికి సవాల్‌గా మారనుందన్నారు. తమ గొంతును బలంగా వినిపించేందుకు టెక్ స్టార్టప్ వ్యవస్థాపకులు రాజకీయాల్లోకి రావాలని గ్రోవర్ పేర్కొనడం విశేషం.




## యాదాద్రికి ఎస్బీఐ మూడు వాహనాల అందజేత

హైదరాబాద్ : కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) యాదాగిరిగుట్టలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి బ్యాటరీలతో కూడిన మూడు వాహనాలను అందించింది. వీటికి సంబంధించిన తాలం చెవులను ఎస్బీఐ సీజీఎం రాజేష్ కుమార్ ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్ గీతాకు అందజేశారు.

## మార్కెట్లోకి నథింగ్ కొత్త ఫోన్

న్యూఢిల్లీ : స్మార్ట్ ఫోన్ తయారీదారు నథింగ్ కంపెనీ కొత్తగా భారత మార్కెట్లోకి నథింగ్ ఫోన్ 2ను విడుదల చేసింది. ఆండ్రాయిడ్ 13 ఆధారిత నథింగ్ ఒఎస్ 2.0తో తీసుకువచ్చింది. వెనుక వైపు రెండు 50 ఎంపి కెమెరాలు, సెల్ఫీ కోసం 32 ఎంపీ కెమెరాలను అమర్చింది. 4,700 ఎంఎహెచ్ బ్యాటరీ కలిగిన 8జిబి ర్యామ్, 128 జీబీ స్టోరేజ్ వేరియంట్ ధరను రూ.44,999గా, 12జీబీ, 512 జీబీ వేరియంట్ ధరను రూ.54,999గా నిర్ణయించింది. జులై 21 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందని నథింగ్ కంపెనీ తెలిపింది.

## ఏఐతో అత్యంత ప్రమాదంలో 27% ఉద్యోగాలు : ఓఈసీడీ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ : కృత్రిమ మేధా (ఏఐ)తో నాలుగింట ఒక్క వంతు ఉద్యోగాలు ప్రమాదంలో పడనున్నాయని ది ఆర్గనైజేషన్ ఆఫ్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) తెలిపింది. ఏఐతో ఇప్పటికే పలు ఉద్యోగాలపై ప్రభావం పడిందని.. ఇది మరింత పెరగనుందని విశ్లేషించింది. రాబోయే రోజుల్లో ఎఐతో భారీ సంఖ్యలో కొలువుల కోత తప్పదనే అభిప్రాయాలు ఓఈసీడీ సర్వేలో వ్యక్తం అయ్యాయి. ఏడు దేశాల్లోని 2,000 సంస్థలలో 5,300 మంది కార్మికులను ఈ సర్వేలో భాగస్వామ్యం చేసింది. నూతన టెక్నాలజీతో 27 శాతం ఉద్యోగులకు ముప్పు పొంచి ఉంది. ఈ విషయమై అనేక మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 38 దేశాలతో కూడిన ఓఈసీడీలో సంపన్న దేశాలతో పాటు మెక్సికో వంటి ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలు కూడా సభ్యులుగా ఉన్నాయి.



కొలువుల ప్రమాదం కంటే ప్రయోజనాలు అధికంగా ఉంటాయా అనేది మనం తీసుకునే విధానపరమైన చర్యలపై ఆధారపడి ఉంటుందని ఓఈసీడీ సెక్రెటరీ జనరల్ మథీస్ కార్మన్ పేర్కొన్నారు. ఏఐ ద్వారా అందివచ్చే ప్రయోజనాల కోసం మార్పులకు అనుగుణంగా కార్మికులు, ఉద్యోగులను ప్రభుత్వాలు సిద్ధం చేయాలని సూచించారు. కార్మికులు, తక్కువ నైపుణ్యంతో కూడిన ఉద్యోగులకు ఏఐ టెక్నాలజీతో ముప్పు అధికంగా ఉందన్నారు. రాబోయే 10 సంవత్సరాలలో ఐదుగురు కార్మికులలో ముగ్గురు ఏఐ వల్ల తమ ఉద్యోగాన్ని కోల్పోతారని ఓఈసీడీ సర్వేలో వెల్లడయ్యింది. ఇంతక్రితం రోజు స్టార్టప్ సంస్థ దుకాన్ తమ ఉద్యోగుల్లో 90 శాతం మందికి ఉద్వాసన పలికింది. వీరి స్థానంలో కృత్రిమ మేధా(ఏఐ)ని ఉపయోగించుకోవాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.

## ద్రవ్యోల్బణానికి టమాట ధరలు ఆజ్యం

- జూన్‌లో 4.81 శాతానికి సీపీఐ

న్యూఢిల్లీ : దేశంలో ద్రవ్యోల్బణానికి హెచ్చు టమాట, ఇతర కూరగాయల ధరలు ఆజ్యం పోశాయి. ప్రస్తుత ఏడాది జూన్‌లో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సీపీఐ) 4.81 శాతానికి ఎగిసిందని కేంద్ర గణంకాల శాఖ బుధవారం వెల్లడించింది. ఇంతక్రితం మేలో 4.31 శాతంగా నమోదయ్యింది. ఇదే నెలలో అహారోత్పత్తుల ద్రవ్యోల్బణం 2.96 శాతంగా ఉండగా.. గడిచిన నెలలో ఏకంగా 4.49 శాతానికి పెరిగింది. గడిచిన నెలలో గ్రామీణ ద్రవ్యోల్బణం 4.72 శాతంగా, పట్టణ ద్రవ్యోల్బణం 4.96 శాతంగా నమోదయ్యింది. మే నెలలో కూరగాయల ధరలు మైనస్ 8.1 శాతంగా ఉండగా.. జూన్‌లో ఏకంగా 0.93 శాతానికి పెరిగాయి. అహారోత్పత్తులు - పానియాలు, ఇంధన ద్రవ్యోల్బణం వరుసగా 4.63 శాతం, 3.92 శాతంగా నమోదయ్యింది. తృణధాన్యాల ద్రవ్యోల్బణం 12.65 శాతం నుంచి 12.71 శాతానికి చేరింది. ప్రధానంగా కూరగాయాల ధరల వల్లే వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ పెరిగిందని ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్ అదితి నయర్ పేర్కొన్నారు. రాబోయే మధ్యస్థ కాలానికి కూరగాయలు, అహారోత్పత్తుల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించాలన్నారు. గత కొన్ని వారాలుగా దేశంలో టమాట, పచ్చి మిర్చి ధరలు రూ.100 నుంచి రూ.200 మధ్య పలుకుతున్నాయి. తగ్గిన ఆదాయాలతో పెరిగిన ధరలతో కొనలేని పరిస్థితితో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వరుసగా ధరలు పెరిగితే ఆర్‌బీఐ మళ్లీ వడ్డీ రేట్లు పెంచే ప్రమాదం ఉంది.



# ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర నుంచి టమాటా సేకరణ

- కేంద్ర ప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా టమాటా ధరలు రికార్డు స్థాయిలో ఎగబాకుతున్నాయి. పలుచోట్ల కిలో టమాట రూ.200లకు చేరింది. దీంతో వీటి ధరలను నియంత్రించేందుకు, ప్రధాన వినియోగ కేంద్రాల్లో పంపిణీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌తో సహా మూడు రాష్ట్రాల నుంచి టమాటాను సేకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రల నుంచి టమాటాను సేకరించాలని కేంద్ర సహకార సంస్థలైన నేషనల్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ (ఎన్ఏఎఫ్ఈడీ), నేషనల్ కో-ఆపరేటివ్ కన్సూమర్స్ ఫెడరేషన్ (ఎన్సీసీఎఫ్)లను వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతాల్లోని ప్రజలకు ఈ నెల 14 నుంచి రాయితీ ధరకు టమాటాలను పంపిణీ చేస్తామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ వెల్లడించింది.



పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో పంట దిగుబడి, సరకు రవాణాలో అంతరాయం కారణంగా టమాట ధర రికార్డు స్థాయిలో నమోదవుతున్నది. ఈ నేపథ్యంలో గత నెల రోజులుగా టమాట ధరలు రికార్డు స్థాయికి చేరుకున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడి రిటైల్ కేంద్రాల్లో పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. 'ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి గుజరాత్, మధ్యప్రదేశ్‌తో పాటు మరికొన్ని రాష్ట్రాలకు టమాటాలు సరఫరా అవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లె నుంచి సరైన పరిమాణంలోనే వస్తున్నాయి. ఢిల్లీకి హిమాచల్‌తో పాటు కర్నాటక నుంచి అధికంగా వస్తాయి. మహారాష్ట్రలోని నారాయణ్‌గావ్, ఔరంగాబాద్‌తోపాటు మధ్యప్రదేశ్ నుంచి త్వరలోనే అదనపు పంట రానుంది. దీంతో త్వరలోనే టమాటా ధరలు దిగివచ్చే అవకాశం ఉంది' అని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ అంచనా వేస్తోంది.

## రఫేల్ విచారణలో సహకరించండి

- భారత్‌ను కోరిన ఫ్రాన్స్ న్యాయస్థానం

న్యూఢిల్లీ : 2016లో జరిగిన రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై జరుపుతున్న విచారణకు సహకరించాల్సిందిగా ఫ్రాన్స్ న్యాయస్థానం భారత ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు అధికారికంగా అభ్యర్థన పంపిందని ఫ్రాన్స్‌కు చెందిన మీడియాపార్ట్ అనే వెబ్‌సైట్ తెలిపింది. ఈ నెల 14 నుండి 16వ తేదీ వరకూ ప్రధాని నరేంద్ర మోడీ ఫ్రాన్స్‌లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా 26 రఫేల్ ఎం నౌకాదళ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన ఒప్పందంపై ఆయన సంతకాలు చేసే అవకాశం ఉంది. దీని విలువ రూ.90 వేల కోట్లు. అయితే మోడీ పర్యటనకు కొద్ది రోజుల ముందు ఫ్రాన్స్ న్యాయస్థానానికి చెందిన మెజిస్ట్రేటు భారత ప్రభుత్వానికి అభ్యర్థన పంపడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2016 సెప్టెంబర్‌లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం ఫ్రాన్స్‌కు చెందిన డస్సాల్ట్ ఏవియేషన్ నుండి 39 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి రూ.59 వేల కోట్ల విలువైన ఒప్పందంపై సంతకాలు చేసింది. అయితే ఈ ఒప్పందంలో అవినీతి, పక్షపాతం చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. కాగా ఈ కేసుకు సంబంధించిన పత్రాలను అధ్యయనం చేసేందుకు ఫ్రాన్స్ న్యాయమూర్తులు ఆసక్తి చూపుతున్నారని వెబ్‌సైట్ తెలిపింది. ఈ ఒప్పందం కోసం డస్సాల్ట్ సంస్థ భారత్‌లోని ఓ మధ్యవర్తికి రహస్యంగా అనేక మిలియన్ యూరోలు ముట్టజెప్పిందని ఆ వెబ్‌సైట్ గతంలో తెలిపింది. దాని కథనం ప్రకారం రఫేల్ యుద్ధ విమానాలను ఉత్పత్తి చేసే డస్సాల్ట్ ఏవియేషన్ కంపెనీ 2007-2012 మధ్యకాలంలో భారత్‌లోని మధ్యవర్తి సుషేన్ గుప్తాకు 7.5 మిలియన్ యూరోలు అందించింది. ఈ లావాదేవీలకు సంబంధించి భారత్‌లోని విచారణ సంస్థలు తగిన ఆధారాలు సేకరించాయి. అయితే ఈ ఆరోపణలను డస్సాల్ట్ సంస్థ, భారత ప్రభుత్వం ఖండించాయి.

నవతెలంగాణ
www.navatelangana.com

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం దాడికి ఎస్ఎఫ్ఐ ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఖమ్మంలో విద్యార్థి సంఘాల నాయకులపై ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం చేసిన దాడిని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన బంద్‌లో భాగంగా అనుమతుల్లేకుండా నడుస్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యాన్ని బంద్ పాటించాలని అడిగితే బౌన్సర్లను పెట్టి విద్యార్థి సంఘాల నాయకులపై దాడి చేయించిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అనుమతుల్లేకుండా పాఠశాల నడుపుతూ, రూ.లక్షల ఫీజులు తీసుకుంటూ శాంతియుతంగా బంద్ చేస్తున్న విద్యార్థి నాయకులపై దాడి చేయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

**ఆ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : డీవైఎఫ్ఐ**

ఖమ్మంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులపై దాడికి పాల్పడిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడించిన నాయకులను అరెస్టు చేయడాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఖమ్మంలో గుర్తింపు లేని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం బంద్‌కు సహకరించాలంటూ విద్యార్థి సంఘాల నాయకులు అడుగుతున్న సందర్భంలో గూండాలతో దాడి చేయించడాన్ని ఖండించారు. ఆ యాజమాన్యంపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడి సందర్భంగా పోలీసులు అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరారు. అరెస్టుల మీద చూపెట్టే శ్రద్ధ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంపై చూపించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**హేయమైన చర్య : ఎంసీపీఐ(యూ)**

రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతుంటే విద్యార్థి నాయకులను అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేయడం హేయమైన చర్య అని ఎంసీపీఐ(యూ) విమర్శించింది. ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళిని పోలీసులు దెబ్బలు కొట్టి బట్టలు చింపి హింసించి అరెస్టు చేసి బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడాన్ని ఖండిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు. అరెస్టు చేసిన విద్యార్థులందరినీ తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## యుఎన్‌హెచ్‌ఆర్‌సి తీర్మానానికి అనుకూలంగా భారత్ ఓటు

**జెనీవా:** ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి (యుఎన్‌హెచ్‌ఆర్‌సి)లో బుధవారం ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా భారత్ ఓటు వేసింది. పవిత్ర ఖురాన్‌ను అపవిత్రం చేసే బహిరంగ, ముందస్తు ప్రణాళిక చర్యలను ఖండిస్తూ, తీవ్రంగా తిరస్కరిస్తూ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 'వివక్ష, శత్రుత్వం లేదా హింసను ప్రేరేపించే మతపరమైన విద్వేషాన్ని నిరోధించడం' అనే ఈ ముసాయిదా తీర్మానాన్ని 47 దేశాలు సభ్యులుగా ఉన్న యుఎన్‌హెచ్‌ఆర్‌సి ఆమోదించింది. 28 దేశాలు ఈ తీర్మానాన్ని ఆమోదించగా, 12 దేశాలు వ్యతిరేకంగా ఓటు వేశాయి. ఏడు దేశాలు గైర్హాజరయ్యాయి. భారత్‌తోపాటు పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్, క్యూబా, మలేషియా, మాల్దీవులు, ఉక్రెయిన్, యుఎఈ, ఖతార్ వంటి దేశాలు అనుకూలంగా ఓటు వేశాయి. అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, బెల్జియం, ఫిన్లాండ్ వంటి దేశాలు వ్యతిరేకంగా ఓటు వేశాయి. పాలస్తీనా చేత ఈ ముసాయిదా తీర్మానాన్ని పాకిస్తాన్ తీసుకువచ్చింది. ఈ తీర్మానం సందర్భంగా యుఎన్‌హెచ్‌ఆర్‌సి హైకమిషనర్ వోల్కర్ టర్క్ మాట్లాడుతూ వందల కోట్లమంది విశ్వాసమైన ఖురాన్‌ను తగులబెట్టడం ఇటీవల కాలంలో పెరిగిందని తెలిపారు. గత నెలలో ఈద్ అల్ అదా రోజున స్వీడెన్‌లోని స్టాక్‌హోమ్‌లో ఒక నిరసనలో ఖురాన్‌ను తగులబెట్టడంతో ఇస్లామిక్ దేశాల నుంచి తీవ్ర ఆగ్రహం, ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

## మణిపూర్ హింసపై ఈయూ పార్లమెంటులో చర్చ

**న్యూఢిల్లీ :** ఫ్రాన్స్ బాస్టిల్లే డే వేడుకల్లో పాల్గొనేందుకు ఈ నెల 14న పారిస్‌కు వెళ్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అనూహ్య రీతిలో ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. మణిపూర్‌లో చోటుచేసుకున్న హింసాకాండపై స్ట్రాస్‌బర్గ్‌లో ఉన్న యూరోపియన్ పార్లమెంటులో బుధవారం నాడు అత్యవసర ప్రాతిపదికన చర్చ చేపట్టారు. చర్చల అనంతరం తీర్మానంపై ఈ నెల 13న ఓటింగ్ నిర్వహించనున్నారు. మానవ హక్కుల ఉల్లంఘన, ప్రజాస్వామ్యం, చట్టాల అమలు తీరుపై చర్చించినట్టు తెలుస్తోంది. అయితే మణిపూర్ అంశం పూర్తిగా తమ అంతర్గత వ్యవహారమని భారత విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వత్రా చెప్పారు. ఈ విషయాన్ని యూరోపియన్ యూనియన్ ఎంపీలకు కూడా తెలియజేసినట్టు తెలిపారు. మణిపూర్ అంశాన్ని ఇయు పార్లమెంటులో లేవనెత్తిన ఎంపీల బృందంలో వామపక్షాలతో యూరోపియన్ సోషలిస్టులు, గ్రీన్స్, ప్రాంతీయ పార్టీలు, కన్జర్వేటివ్స్, మధ్యేవాద మితవాద రాజకీయ, క్రిస్టియన్ గ్రూపులు కూడా ఉండటం విశేషం.

## వ్యవసాయం దండగని చంద్రబాబు అనలేదు: టీడీపీ

నవతెలంగాణ-హైదరాబాద్

వ్యవసాయ దండగని టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు అనని మాటలు అన్నట్టుగా తెలంగాణ రాష్ట్ర మంత్రులు, బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేయడం తగదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్ అన్నారు. ఇతర పార్టీ వాళ్లు ఉచిత విద్యుత్‌పై మాట్లాడితే మా నాయకుడు చంద్రబాబునాయుడు మాట్లాడని విషయాలను మాట్లాడినట్టుగా దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. వ్యవసాయం దండగ అని చంద్రబాబు నాయుడు అన్నట్టు ఆధారాలు ఉంటే చూపించాలని సవాల్ చేశారు. నిరాధారమైన ఆరోపణలు, విమర్శలు చేయడం మంచిది కాదని మంత్రులు, బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు.

## స్మగ్లింగ్ కోసం కారు మాడిఫై ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి స్మగ్లింగ్


- నలుగురు నిందితుల అరెస్ట్




నవతెలంగాణ-సిటీబ్యూరో

గంజాయిని స్మగ్లింగ్ చేసే సమయంలో పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు కారును మాడిఫై చేసి ఏజెన్సీ నుంచి తరలిస్తున్న నలుగురు స్మగ్లర్లను నార్కోటెక్ ప్రత్యేక బృందం, పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.25లక్షల విలువగల 90కిలోల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం డీసీపీ జి.చక్రవర్తి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చింతపల్లికి చెందిన వి.రాజారావు, వి.బాలాజీ, ఈస్ట్‌గోదావరికి చెందిన ఏ.సాయి శివకుమార్, తెలంగాణ సంగారెడ్డి జిల్లాకు చెందిన రాథోడ్ వెంకట్ స్నేహితులు. సులువుగా డబ్బులు సంపాధించడం కోసం గంజాయి స్మగ్లింగ్ చేయాలని నిర్ణయించుకున్నారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు వారి కారును ముందు, వెనుకాల బంపర్లను, డిక్కీని మార్చారు. విశాఖ ఏజెన్సీ నుంచి హైదరాబాద్, శివారు ప్రాంతాలకు గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న టీఎస్-ఎన్ఏబీ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్ రెడ్డి, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ లాలూ నాయక్ నిందితులపై ప్రత్యేక నిఘా వేశారు. పటాన్‌చెరు ప్రాంతంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి యువకులకు, విద్యార్థులకు విక్రయిస్తున్నారు. పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. పిల్లలు ఏం చేస్తున్నారు, ఎటు వెళ్తున్నారో గమనించాలని, వారితో సమయం గడపాలని డీసీపీ జి.చక్రవర్తి అన్నారు.

# యూసీసీ అనవసరం !




## లా కమిషన్‌కు ఐద్వా మెమోరాండం




**న్యూఢిల్లీ :** ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)కి సంబంధించి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా) లా కమిషన్ సభ్య కార్యదర్శికి మెమోరాండం అందచేసింది. యుసిసి అవసరంపై మరోసారి అభిప్రాయాలు తెలియచేయాల్సిందిగా కోరుతూ గత నెల 14న లా కమిషన్ జారీ చేసిన పబ్లిక్ నోటీసును దృష్టిలో పెట్టుకుని దేశవ్యాప్తంగా కోటికిపైగా సభ్యత్వం కలిగిన ఐద్వా తరపున ఈ మెమోరాండాన్ని అందచేసినట్లు ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు పి.కె.శ్రీమతి, మరియం ధావలె, న్యాయ సలహాదారు కీర్తి సింగ్‌లు పేర్కొన్నారు.

అన్ని మతాలకు చెందిన కమ్యూనిటీల్లోనూ పితృస్వామ్య భావజాలంతో కూడిన, వివక్షాపూరితమైన పర్సనల్ చట్టాల భారంతో శతాబ్దాల తరబడి మన దేశంలో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం ఏకరీతి (యూనిఫామ్) చట్టాలు తీసుకువచ్చినంత మాత్రాన మహిళలు సమాన హక్కులు పొందలేరని, అలాగే ఈ చట్టాల్లో వివిధ స్థాయిల్లో అంతర్లీనంగా వున్న వివక్షను రూపుమాపలేరని అందువల్ల యూసీసీకి తాము అనుకూలం కాదని వారు పేర్కొన్నారు. అందువల్లే యూనిఫామిటీ (ఏకరూపత) అంటే సమానత్వం కాదు, మహిళలకు సమానత్వం, న్యాయంతో దీన్ని సరిపోల్చలేం. భారతదేశంలో ఈనాడు ఏకరూపత అన్నది అవసరమూ కాదు, వాంఛనీయం కాదని తాము అభిప్రాయపడుతున్నామని ఆ మెమోరాండంలో ఐద్వా నేతలు పేర్కొన్నారు.

గత 40ఏళ్ళుగా పర్సనల్ లాకి సంబంధించిన అనేక సమస్యలతో ఐద్వా పోరాడుతూ వచ్చింది. ప్రతి రాష్ట్రంలోనూ వివిధ లీగల్ సెల్స్‌లో మహిళల పర్సనల్ లా కేసులను ఎదుర్కొనడంలో క్రియాశీలంగా పనిచేస్తూ వచ్చాం. ప్రతి పర్సనల్ లా లోనూ సంస్కరణలు తీసుకురావడానికి, సమానత్వం తీసుకువచ్చేందుకు, వివక్షను రద్దు చేయడానికి ఐద్వా స్పష్టంగా, నిర్ద్వంద్వంగా కట్టుబడివుంది. ఉదాహరణకు, ఇతర సంస్కరణలతో పాటూ, హిందూ వారసత్వ చట్టంలో, క్రైస్తవులకు సంబంధించి భారత విడాకుల చట్టంలో సంస్కరణలు తీసుకురావడానికి చురుకుగా కృషి చేస్తోంది. అలాగే మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులివ్వడానికి కూడా వ్యతిరేకంగా ప్రచారం చేస్తోంది. వివిధ కమ్యూనిటీల సభ్యులతో ముఖ్యంగా ఈ కమ్యూనిటీలకు చెందిన మహిళలతో సంప్రదింపులు జరపడంతో పాటూ ఈ సంస్కరణల యత్నాలను కొనసాగించాం. పర్సనల్ చట్టాల్లో అంతరం వున్నపుడు లేదా మహిళలకు న్యాయం చేయడానికి ఇటువంటి చట్టాలు తీసుకురావాల్సిన అవసరమున్నపుడు ప్రతి కమ్యూనిటీలోనూ సంస్కరణలకు మద్దతిస్తూ, ఉమ్మడి చట్టాలు తీసుకురావడానికి రెండంచెల వ్యూహాన్ని ఐద్వా పాటిస్తోంది. ఆ రకంగా, వరకట్న చట్టాల్లో, బాల్య వివాహాల నిరోధక చట్టం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టంలో, గృహహింస నిరోధక చట్టంలో సంస్కరణలకు మద్దతిస్తూ వాటికోసం సాగిన పోరాటాల్లో ఐద్వా పాల్గొంది. ఇతర చట్టాలతో పాటూ నివాసం, నగదు నష్టపరిహార హక్కులను గృహ హింస నిరోధక చట్టం కూడా ఇస్తోంది.

యూసీసీపై 21వ లా కమిషన్ తన అభిప్రాయాలను విస్పష్టంగా వ్యక్తం చేసినా కూడా మళ్ళీ 22వ లా కమిషన్ ఈ అంశాన్ని పరిశీలించడం ఆశ్చర్యకరంగా వుందని మెమోరాండం పేర్కొంది. గణనీయమైన రీతిలో సమానత్వంతో పాటూ మహిళలకు ప్రాథమిక హక్కులతో పర్సనల్ లాని కలిపేందుకు యూసీసీ అవసరం కాదని లేదా వాంఛనీయం కూడా కాదన్న తమ అభిప్రాయాన్ని 2018లో 21వ లా కమిషన్ కూడా అంగీకరించిందని వారు ఆ మెమోరాండంలో పేర్కొన్నారు. ఈ అంశంపై 21వ లా కమిషన్ విస్తృతమైన సాక్ష్యాధారాలను తీసుకుంది. విస్తృత పరిశోధన చేపట్టింది. అనేక సెమినార్లలో, చర్చలు, సంప్రదింపుల్లో పాల్గొంది. ఆ తర్వాత యూసీసీకి సమయం ఆసన్నమవ లేదంటూ అభిప్రాయం వ్యక్తం చేసింది. అందుకు కారణాలు తెలిపింది. అవి ::

"ప్రస్తుతమున్న పర్స నల్ లాల్లో వివిధ అంశాలు మహిళలను కించపరుస్తు న్నాయి. ఇది వివక్ష అని, సమానత్వం మూలంలో వున్న తేడా కాదని కమిషన్ అభిప్రాయపడింది. ఈ అసమా నతను పరిష్కరించడానికి గానూ, ప్రస్తుతమున్న కుటుంబ చట్టాలకు కొన్ని సవరణలను కమిషన్ సూచించింది. ....ఈ దశలో అవసరం లేని, వాంఛనీయం కాని ఉమ్మడి పౌర స్మృతిని అందించడం కన్నా వివక్షతో కూడిన చట్టాలను ఈ కమిషన్ ఎదుర్కొంది. అనేక దేశాలు ఇప్పుడు తేడాను గుర్తించడం దిశగా పయనిస్తున్నాయి. కేవలం తేడా వున్నంత మాత్రాన వివక్ష వున్నట్లు కాదు. కానీ, బలమైన ప్రజాస్వామ్యానికి ఇదొక సూచన."

లా కమిషన్ ఏం చేయాలనే దానిపై స్పష్టమైన ప్రణాళిక లేకుండా, కేవలం అస్పష్టమైన పదాలతో జారీ చేసిన నోటీసు ద్వారా ఈ ప్రక్రియనంతటినీ మళ్లీ చేపట్టాల్సిన అవసరం వుందని తాము అనుకోవడం లేదని మెమోరాండం పేర్కొంది. పైగా, కేవలం నెల రోజుల పరిమిత కాలంలో అభిప్రాయాలు తెలియచేయాలని కోరడం ద్వారా, వివిధ సంస్థలు, లేదా ఈ అంశంపై పనిచేసే వివిధ వ్యక్తుల నుండి అభిప్రాయాలు కోరడానికి సీరియస్‌గా ప్రయత్నం జరగడం లేదని, కేవలం లాంఛన ప్రాయంగా చేస్తున్నారని తాము అభిప్రాయపడుతున్నట్లు ఐద్వా నేతలు పేర్కొన్నారు. వివిధ బిజెపి పాలిత రాష్ట్రాలు, ప్రధాని ఇటీవల యుసిసికి అనుకూలంగా మాట్లాడినందున యూసీసీ కావాలని ఏదో ఒక రకంగా సిపార్సు చేయాలన్నది లా కమిషన్ ఎజెండాగా వున్నట్లు కనిపిస్తోంది. వివిధ మతపరమైన సంస్థలను తమ అభిప్రాయాలు తెలియ చేయాలంటూ ప్రత్యేకంగా లా కమిషన్ కోరడం విస్మయానికి గురి చేసిందన్నారు. మహిళల హక్కులు, సమానత్వానికి సంబంధించిన అంశం యుసిసి, అటువంటపుడు ఈ అంశాలపై పనిచేస్తున్న వారందరికీ, అలాగే ఆయా కమ్యూనిటీల్లోని మహిళలకు లా కమిషన్ ప్రాధాన్యత నివ్వాలి. అందువల్ల, యూసీసీ తీసుకురావడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ అంశాన్ని పున:పరిశీలించే ప్రస్తుత ప్రక్రియ అన్నది అనేక మహిళా సంఘాలు, గ్రూపులు, మైనారిటీ కమ్యూనిటీల ఆకాంక్షలకు పూర్తి విరుద్ధంగా వుంది. ఉత్తరాఖండ్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాలు చురుకు గా ఈ ఎజెండాను అనుసరిస్తున్నాయన్నది స్పష్టమైంది. ఉమ్మడి పౌర స్మృతిని తీసుకురావాలన్న తమ ఉద్దేశ్యాన్ని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి బహిరంగంగానే ప్రకటించారు కూడా.

మహిళల సమానత్వ హక్కులకు సంబంధించి నంతవరకు ప్రస్తుత ప్రభుత్వానికి చెడ్డ రికార్డు వుంది. లింగ న్యాయానికి ఎన్నడూ ఈ ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వలేదు. లేదా మహిళల కోసం ఒక్క సంస్కరణను కూడా తీసుకురాలేదు. హిందూ పర్సనల్ లాల్లో కొన్ని సంస్కరణలు తీసుకురావాలంటూ అనేక డిమాండ్లు వచ్చినా ఈ చట్టాలను మార్చడానికి, ఈ మహిళలకు సమాన చట్టాలు తీసుకురావడానికి ప్రభుత్వం ఒక్క చర్య కూడా తీసుకోలేదు.

కేవలం ప్రస్తుతమున్న ముస్లిం లాని, రాజ్యాంగంలో ఆరవ షెడ్యూల కిందకు వచ్చే గిరిజన ప్రాంతాలకు సంబంధించిన చట్టాలను లేకుండా చేయడానికి చేసే ప్రయత్నమే ఈ యుసిసి అని బలంగా అభిప్రాయపడుతున్నట్లు ఐద్వా నేతలు ఆ మెమోరాండంలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య నిబంధనలను దృష్టిలోవుంచుకుని, ఆయా కమ్యూనిటీలతో విస్తృతంగా చర్చలు జరిపిన తర్వాత మాత్రమే ఇది జరగాలి.

హిజాబ్‌ను ధరించే ముస్లిం యువతులను ఎలా లక్ష్యంగా చేసుకుంటున్నారో, దానివల్ల వారి ప్రాథమిక హక్కు అయిన విద్య ఎలా దెబ్బతిందో మనం చూశాం. విడాకులు తీసుకున్న ముస్లిం మహిళల హక్కులను కాపాడకుండా కేంద్రం ప్రభుత్వం మతపరమైన ఉద్దేశ్యాలతో కేవలం ముస్లిం పురుషులను జైల్లో వేసేందుకు చట్టం తీసుకువచ్చింది. ఈ చర్యను సుప్రీం కోర్టు ఇప్పటికే కొట్టివేసింది. హిందూ మహిళలతో వారి సమ్మతి మేరకు సంబంధాలు కొనసాగించే ముస్లిం యువకులను లక్ష్యంగా చేసుకుని బూటకపు లవ్ జిహాద్ కేసుల్లో వారిని జైళ్ళకు పంపింది.

> యూసీసీ అవసరాన్ని పున:పరిశీలించాలన్న సాకుతో ఏకరూపత చట్టాలను, ప్రధానంగా మెజారిటీవాదుల చట్టాలను తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతాయి. అంతే కానీ మహిళలకు గణనీయంగా సమాన హక్కులు కల్పించే చట్టాలు తీసుకు వచ్చే ప్రయత్నాలు కాదివి. ఇంతకుముందు చెప్పినట్లుగా, ఏకరూపత చట్టం తీసుకువచ్చినంత మాత్ర మహిళలకు సమానత్వం రాదు. వాస్తవానికి, దీనివల్ల హిందూ చట్టాల నకలు ఏర్పడవచ్చు, అన్ని కమ్యూనిటీల్లో లింగ వివక్ష వుంటుంది.

తమ పిల్లలపై సమాన సంరక్షక హక్కులు లేకపోవడం వల్ల మన దేశంలో హిందూ మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అత్తింటివారి ఆస్తులపై కూడా వారికి సమాన హక్కులు వుండడం లేదు. వివాహ సమయంలో భార్యాభర్తల్లో ఎవరో ఒకరు, లేదా ఇద్దరు కలిసి సమకూర్చుకున్న ఆస్తే అయినా వాటిపై హక్కు వుండడం లేదు. ఇటీవలే, మద్రాసు హైకోర్టు ఒక కేసులో తీర్పు వెలువరిస్తూ, మహిళలు ఇంట్లో చేసే పనికి కూడా విలువుంటుందని స్పష్టం చేసింది. అందువల్ల ఆమె భర్త సంపాదించిన ఆస్తిలో ఆమెకు కూడా సమాన వాటా వుంటుందని పేర్కొంది. ఆ ఆస్తి ఏర్పాటులో ఆమె ఆర్థికంగా సాయపడినా లేకపోయినా దానిపై హక్కు వుంటుందని తీర్పు చెప్పింది. అయితే, దీనికోసం అనేక మహిళా సంఘాలు, గ్రూపులు అడుగుతున్నా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదు.

కుల దురంహంకారం పేరుతో జరిగే నేరాలు, హత్యలను ఎదుర్కొనేందుకు సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని ఐద్వా సహా అనేక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇటువంటి నేరాలకు పాల్పడే కుటుంబ సభ్యులను, అలాగే తమకిష్టమైన వారిని వివాహం చేసుకునే లేదా ఎంచుకునే హక్కును తిరస్కరించే, యువ దంపతులను వేధించే, హింసించే కుల పంచాయితీలను శిక్షించేందుకు ఈ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటువంటి చట్టం కోసం 2005లోనే ఐద్వా ప్రతిపాదనలు పంపింది. ప్రస్తుత ప్రభుత్వానికి కూడా ఇచ్చింది. కానీ ఇంతవరకు ఆ దిశగా ఏమీ జరగలేదు.

అలాగే, యూపీ, ఉత్తరాఖండ్ సహా కొన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ భూముపై హిందూ మహిళలకు, ఇతర మహిళలకు సమాన హక్కులు వుండడం లేదు. ఈ రెండు రాష్ట్రాల్లో ఇటువంటి ఆస్తులపై వారసత్వం నుంచి వివాహమైన కుమార్తెలను మినహాయిస్తున్నారు. హెచ్‌ఎస్ఎ పరిధి నుంచి వ్యవసాయభూమిని తొలగిస్తున్న మినహాయింపును రద్దు చేయడానికి 2005లో హిందూ వారసత్వ చట్టాన్ని సవరించినప్పటికీ, కొన్ని రాష్ట్ర చట్టాల్లో వ్యవసాయ భూమి వారసత్వం కొనసాగుతోంది. ఈ రాష్ట్ర చట్టాలు ఈ వారసత్వపు హక్కును మహిళలు పొందకుండా అడ్డుకుంటున్నాయి. వాస్తవానికి, ఈ చట్టాలను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పెట్టారు. కోర్టుల పరిధికి వాటిని వెలుపల వుంచాలనే ఉద్దేశంతోనే ఇలా చేశారు. ఒకహిందూ మహిళ తన స్వంతంగా సంపాదించుకున్న ఆస్తికి, ఆమె భర్త, పిల్లలు లేనపుడు అమె కన్నా ఆమె భర్త వారసులకే హక్కు వుంటుందనే అన్యాయమైన నిబంధన హిందూ వారసత్వ చట్టంలో వుంది. దీన్ని కూడా సవరించలేదు. అలాగే, ప్రత్యేక వివాహ చట్టం కింద వివాహం చేసుకోవాలంటే ముందుగా ఒక నెల నోటీసు ఇచ్చి ఆ కాలపరిమితి ముగిసిన తర్వాతనే వివాహం చేసుకోవాలనే నిబంధనను తొలగిస్తూ, ప్రత్యేక వివాహ చట్టాన్ని సవరించాలని కూడా సూచించినట్లు వారు ఆ మెమోరాండంలో పేర్కొన్నారు.

మహిళలకు సమానహక్కులు తీసుకురావడం కోసం ఐద్వాతో సహా పలు ఇతర మహిళా సంఘాలు అనేక సంవత్సరాలుగా కొన్ని సూచనలు చేస్తున్నాయి. అయితే, ఈ డిమాండ్లను గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూనే వచ్చాయి. మరోవైపు, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు లవ్ జిహాద్‌ను లేవనెత్తుతూ, మతాంతర, కులాంతర వివాహాలు చేసుకోవడాన్ని నిలువరించేందుకు నిరంకుశమైన మత మార్పిడి చట్టాలు తీసుకువస్తున్నాయి. ఇప్పుడు ఏకరూపత కోసమంటూ ఉమ్మడి పౌర స్మృతిని తీసుకురావాలని కోరుతున్నాయి. కోలుకోలేని రీతిలో వివాహం విచ్ఛిన్నమైందన్న కారణంతో విడాకుల కోసం చట్టం తీసుకురావాలంటూ కూడా మాట్లాడుతున్నారు. అయితే, అత్తింటివారి ఆస్తిపై సమాన హక్కు లేనపుడు, సరైన భరణానికి సంబంధించిన చట్టలు లేనపుడు అనేకమంది మహిళల మనుగడ అనేది ప్రశ్నార్థకమవుతుంది.

కుటుంబ చట్టాలు లేని రంగాల్లో బహుళ కుటుంబ చట్టాలు (ప్లూరల్ ఫ్యామిలీ లాస్), ఉమ్మడి చట్టాలు రెండు వున్న సుసంపన్నమైన సాంప్రదాయం భారత్‌కు వుంది. ఇంతకుముందే చెప్పినట్లుగా, వరకట్న నిరోధక చట్టం, సతి అమలు (నిరోధక) చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, గృహ హింస నుండి మహిళలను కాపాడే చట్టం ఇవన్నీ ఉమ్మడి చట్టాలు, అన్ని కమ్యూనిటీలకు వర్తిస్తాయి. అలాగే



కుల దురంహకారం పేరుతో జరిగే హత్యలు, నేరాలను నిరోధించే చట్టం కూడా చేయాలి, అత్తింటివారి ఆస్తిపై సమాన హక్కు వుండేలా చట్టం తీసుకురావాలి. అదే సమయంలో, ఆయా కమ్యూనిటీల్లోని మహిళల, మహిళా ఉద్యమాల ప్రతినిధుల అభీష్టానుసారం పర్సనల్ చట్టాల్లో సంస్కరణలు తీసుకురావాలి.

### లా కమిషన్‌తో విస్తృతంగా చర్చలు జరపాలి

యూసీసీని తీసుకురావాలని ప్రభుత్వం నిశ్చయించింది కాబట్టి కేవలం ఆ కారణంతోనే ఈ అంశాన్ని లా కమిషన్ పున:పరిశీలించవద్దంటూ ఐద్వా ఆ మెమోరాండంలో విజ్ఞప్తి చేసింది. ఈ రంగంలో తమకు వున్న అనుభవాన్ని దృష్టిలో వుంచుకుని, లా కమిషన్ పిలిచిన రోజు తాము కూడా వెళ్ళి మౌఖికంగా సాక్ష్యాధారాలు అందచేయాలనుకుంటున్నట్లు ఐద్వా నేతలు తెలిపారు. ఈ అంశంతో సంబంధముండే మహిళా సంఘాలు, ఇతర గ్రూపులు అన్నింటినీ పరిగణన లోకి తీసుకుని లా కమిషన్ వారితో కూడా విస్తృతంగా చర్చలు జరపాలని కోరారు. ముఖ్యంగా మైనారిటీ కమ్యూనిటీలకు చెందిన మహిళలతో మాట్లాడాలని, అలాగే గిరిజన మహిళలతో మాట్లాడాలని ఆ తర్వాతనే యూసీసీ పై సిఫార్సు చేయడానికి నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.

# బెంగాల్ మారుతోంది..!

## హింసాకాండను ప్రతిఘటించి స్థానిక ఎన్నికల్లో వామపక్షాలకు ఆదరణ

- 2021 తర్వాత క్రమంగా తగ్గుతున్న బీజేపీ బలం
- బెదిరింపులు, గూండాగిరితో తృణమూల్ ఆధిపత్యం




**కొల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో పరిస్థితి క్రమంగా మారుతోంది. తృణమూల్, బీజేపీ వన్నాగాలను ప్రజలు ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నారు. ఈ నెల 8న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు చూస్తే ఇదే విషయం అర్థం అవుతుంది. 2021 తర్వాత జరిగిన వివిధ ఎన్నికల్లో సీపీఐ(ఎం), ఇతర వామపక్షాలతో పాటు కాంగ్రెస్, ఐఎస్ఎఫ్ వంటి పార్టీల బలం క్రమంగా పెరుగుతోంది. బీజేపీ ఓటింగ్ శాతం క్రమంగా తగ్గిపోతోంది.

తృణమూల్ కాంగ్రెస్ గూండాలతో పోలీసులు జట్టుకట్టి ఈ ఎన్నికల్లో హింసాకాండ సృష్టించినా, పోలింగ్ కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడినా ప్రజలు తమ శక్తిమేరా ప్రతిఘటించి వామపక్షాలను ఆదరించారు. గతంలో పోలిస్తే వివిధ ఎన్నికల్లో వామపక్షాలు క్రమంగా బలం పుంజుకుంటున్నాయి.

**ఆధిపత్యం నిలుపుకున్న అధికార తృణమూల్ కాంగ్రెస్**

ఈ నెల 8న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాల్జేసి అనేక అక్రమాలకు పాల్పడిన అధికార తృణమూల్ కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని నిలుపుకుంది. బుధవారం సాయంత్రం 7.30 ప్రాంతంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయం విడుదల చేసిన వివరాల ప్రకారం.. మొత్తం 63,229 గ్రామ పంచాయతీ స్థానాల్లో సగానికి పైగా స్థానాల్లో గెలుపొందింది. 34,913 గ్రామ పంచాయితీ స్థానాల్లో విజయం సాధించిన తృణమూల్ కాంగ్రెస్ మరో 607 స్థానాల్లో ముందజలో ఉంది. తృణమూల్‌తో కుమ్మక్కు రాజకీయాలు సాగించిన బీజేపీ 9,722 సీట్లలో గెలుపొంది..మరో 150 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల నాటి ఫలితాలతో పోల్చి చూస్తే బీజేపీ ఓటింగ్ శాతం బాగా తగ్గిపోవడం గమనార్హం.

సీపీఐ(ఎం), కాంగ్రెస్ 6500 స్థానాల్లో విజయం సాధించాయి. వీటి బలం గతంతో పోలిస్తే క్రమంగా పుంజుకుంటూ వస్తోంది. సీపీఐ(ఎం) 2,938 సీట్లలో విజయం సాధించి 67 స్థానాల్లో ముందజలో ఉంది. కాంగ్రెస్ 2,543 స్థానాల్లో గెలుపొందింది..మరో 66 స్థానాల్లో ముందజలో కొనసాగుతోంది.



**పంచాయతీ సమితి :** మొత్తం 9,728 పంచాయతీ సమితి స్థానాలకు ఎన్నికలు జరగగా తృణమూల్ కాంగ్రెస్ 6,430 స్థానాల్లో గెలుపొందింది. మరో 195 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. బీజేపీ 982 సీట్లలో విజయం సాధించి 54 చోట్ల ముందజలో ఉంది. కాగా సీపీఐ(ఎం) 176 స్థానాలను గెలుపొంది మరో 15 స్థానాల్లో ముందజలో ఉంది. కాంగ్రెస్ 266 స్థానాలను గెలుపొంది..6 చోట్ల ముందజలో ఉంది.

**జిల్లా పరిషత్ :** మొత్తం 928 జిల్లా పరిషత్ స్థానాలకు ఎన్నికలు జరగగా తృణమూల్ కాంగ్రెస్ 674 స్థానాల్లో గెలుపొంది 149 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. బీజేపీ 21 స్థానాల్లో గెలుపొందింది. కాగా సీపీఐ(ఎం) 2 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ 6 స్థానాల్లో గెలుపొంది మరో 5 స్థానాల్లో ముందజలో ఉంది.

## దత్తత స్కూల్లో 'హిమాన్షు' జన్మదిన వేడుకలు

`రూ. కోటి వ్యయంతో నిర్మించిన నూతన భవనం ప్రారంభం

- ఎంత ఎదిగినా.. ఒదిగి ఉండటం హిమాన్షు గొప్పతనం
- నేటి యువతకు స్ఫూర్తి : మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- నూతన భవన ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఎమ్మెల్యే గాంధీ



నవతెలంగాణ-మియాపూర్

సీఎం కేసీఆర్ మనుమడు ఓ క్రిడ్జి పాఠశాల సీఏఎస్ అధ్యక్షులు హిమాన్షు.. బుధవారం తన జన్మదినం సందర్భంగా తాను దత్తత తీసుకున్న గచ్చిబౌలి డివిజన్ కేశవ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ప్రభుత్వ విప్ గాంధీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి హిమాన్షు నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, సీఎస్.. హిమాన్షుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎంత ఎదిగినా.. ఒదిగి ఉండటం.. హిమాన్షు గొప్పతనమని, విద్యార్థులతో ఓ సామాన్యునిగా కలిసిపోయి జన్మదిన వేడుకలు జరుపుకోవడం నేటి యువతకు స్ఫూర్తి అని అభినందించారు. నూతనంగా నిర్మించిన పాఠశాలలో అంగన్‌వాడీ నుంచి డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేసి సకల సౌకర్యాలు కల్పించారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు పేద విద్యార్థులే వస్తారని, వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సీఎం కేసీఆర్ చెబుతుంటారని, అందులో భాగంగా రాష్ట్రంలోని 26 వేల పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించటానికి రూ.7200 కోట్లపై చిలుకు నిధులు కేటాయించారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోట్‌పుస్తకాలు అందిస్తూ, డ్రెస్సులు ఇస్తూ, ఉదయం పూట రాగి జావాను అల్పాహారంగా అందిస్తున్నారని తెలిపారు. చాలా మంది ఇంగ్లీష్ మీడియం కోసమే ప్రయివేటు పాఠశాలలకు పోతున్నారని, కేసీఆర్ గతేడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధన ప్రారంభించారని తెలిపారు. 1000 గురుకులాలు స్థాపించి, వాటిలో పాత వాటితో కలుపుకుని 1200 గురుకులాలు జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేశారని చెప్పారు. అన్ని శాఖల్లో కలిపి 1,450 జూనియర్ కళాశాలలు ఉన్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ నా మనుమడు ఏ బియ్యంతో తింటే అదే బియ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు తినాలని చెప్పారని, నేటికి అదేవిధంగా అమలు చేస్తున్నారన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా రాణించేలా తయారు కావాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష అని, ఆ దిశగా నేడు అడుగులు పడ్డాయన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులకు నైతిక విలువలు బోధించాలని పిలుపునిచ్చారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

• హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్‌కు ఆర్టీసీ జేఏసీ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లుకు ఆర్టీసీ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ), స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ), బహుజన కార్మిక యూనియన్ ప్రతినిధుల బృందం అందజేసింది. ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు జరపాలని కోరింది. సర్వీస్‌లో ఉండి చనిపోయిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల పిల్లలకు రెగ్యులర్ ప్రతిపాదికన ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ప్రయాణికుల అవసరాలకు సరిపడా బస్సుల సంఖ్యను పెంచాలని కోరింది. వేతన సవరణ చేయాలని డిమాండ్ చేసింది. ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన రూ.3700 కోట్లను యాజమాన్యం వాడుకున్నదనీ, ప్రభుత్వ నుంచి ఆర్టీసీకి ఆర్థిక సహాయం అందట్లేదని తెలిపింది. కొత్త బస్సులు కొనడం లేదనీ, ప్రయివేట్ బస్సుల అక్రమ రవాణా పెరిగిపోయిందని పేర్కొంది. పర్మిట్ లేకుండ అక్రమంగా తిరుగుతున్న తెల్లనెంబర్ ప్లేట్ కార్లను నియంత్రించాలని డిమాండ్‌చేసింది. టూరిస్ట్ పర్మిట్ గైడ్ లైన్స్‌లో విద్యుత్ బస్సులకు ఫీజు లేకుండా పర్మిట్ ఇచ్చే నిబంధనలను రద్దు చేయాలని కోరింది. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరింది. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మెన్ రాజిరెడ్డి, నాయకులు బి.జక్రయ్య, ఎ.జయ, టీఎస్‌రెడ్డి, కుపిన్, ఆర్.కిషన్ గౌడ్, పర్వతాలు, శంకర్, జి.ముత్యాలు, ప్రకాష్, దశరథ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## 16న ఇంజినీరింగ్ తొలివిడత సీట్ల కేటాయింపు

• ముగిసిన వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియలో వెబ్‌ఆప్షన్ల నమోదు గడువు బుధవారంతో ముగిసింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు 75,172 మంది వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారని వివరించారు. వారు 49,42,005 ఆప్షన్లు నమోదు చేశారని తెలిపారు. ఒక అభ్యర్థి అత్యధికంగా 1,109 ఆప్షన్లను సమర్పించారని పేర్కొన్నారు. ఈనెల 16న ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో తొలివిడత సీట్లు కేటాయిస్తామని తెలిపారు. రాష్ట్రంలో 155 ఇంజినీరింగ్ కాలేజీల్లో 1,07,039 సీట్లున్నాయి. వాటిలో కన్వీనర్ కోటాలో 76,359 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

## ఢిల్లీ అల్లర్ల కేసులో తాహిర్ హుస్సేన్‌కు బెయిల్



**న్యూఢిల్లీ** : మూడేండ్ల క్రితం దేశరాజధాని ఢిల్లీలో చోటు చేసుకున్న అల్లర్లతో సంబంధం ఉన్న ఆప్ కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్‌కు ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఐదు కేసులలో కోర్టు ఆయనకు బెయిల్ ఇచ్చింది. అయితే, ఆయనకు బెయిల్ లభించినప్పటికీ ఇదే ఢిల్లీ అల్లర్లకు సంబంధించిన ఇతర కేసులలో తాహిర్ హుస్సేన్ జైలులోనే ఉండనున్నారు. 2020, ఫిబ్రవరి 23 నుంచి 26 మధ్య ఈశాన్య ఢిల్లీలో మత హింస చెలరేగిన విషయం విదితమే. ఆ సమయంలో కేంద్రం తీసుకొచ్చిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) విషయంలో.. సదరు చట్టానికి మద్దతిస్తున్న వారు, దానిని వ్యతిరేకిస్తున్నవారి మధ్య చోటు చేసుకున్న గొడవే ఈ మత ఘర్షణలకు దారి తీసింది.

## వారికి శిక్షణ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి : హెచ్‌ఆర్‌డీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలకు హైకోర్టు ఆదేశాలకు లోబడి శిక్షణ ఇచ్చేందుకు వీలుగా నివేదిక సమర్పణ కోసం కమిటీ నియమించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ఆదేశించడాన్ని హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌డీఏ) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.మహేశ్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత లేని వారి నుంచి అందుకునే వైద్యచికిత్సలను రాష్ట్రంలో పూర్తిగా నిర్మూలించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా తీసుకుంటున్న చర్యలతో ప్రజారోగ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. డాక్టర్లుగా చెప్పుకుంటూ అర్హత లేకున్నా షెడ్యూల్డ్ ఔషధాలను సిఫారసు చేస్తున్న వారిపైన వైద్యారోగ్యశాఖ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి శిక్షణనిచ్చే ప్రతిపాదను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## వైసీపీ సర్కార్ వైఫల్యాలతో ఏపీ భవిష్యత్తు అంధకారం

• బీఆర్‌ఎస్ ఏపీ అధ్యక్షులు డాక్టర్ తోట ధ్వజం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అన్ని రంగాల్లో వైసీపీ సర్కార్ ఘోర వైఫల్యాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలో కూరుకుపోయిందని బీఆర్‌ఎస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ తోట చంద్రశేఖర్ విమర్శించారు. బుధవారం తిరుపతి జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత అర్కాట్ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ 2022 నాటికి పోలవరం నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితమిస్తామంటూ సీఎం జగన్ ప్రగల్భాలు పలికారని దుయ్యబట్టారు. ఆయన పలు మార్లు ఢిల్లీకి ప్రదక్షిణాలు చేస్తున్నా ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన నిధులను కేంద్రం నుంచి సాధించడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో వైసీపీ పాలకులు ప్రజల్ని గందరగోళానికి గురి చేస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఓ వైపు కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణా రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధిస్తుంటే ఏపీ ప్రభుత్వం ప్రజల నెత్తిన లక్షలాది రూపాయల అప్పులను రుద్దుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

## కనీస వేతనాల జీవోల విడుదల కోసం 14న కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ పరిశ్రమలకు సంబంధించి కనీస వేతనాల జీవోలను విడుదల చేయాలని ఈ నెల 14న హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్టు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, జె.మల్లిఖార్జున్ ప్రకటించారు. ఈ ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కనీస వేతనాల జీవోల కోసం సీఐటీయూ చేపట్టిన జీపుజాతా బుధవారం సనత్‌నగర్‌కు చేరుకున్నది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నిత్యావసర ధరలు పెరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల జీవోలను విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ఆ జీవోలను విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వంపై పైసా భారం పడదన్నారు. పరిశ్రమల అధిపతుల లాభాల కోసం కార్మికుల పొట్టగొట్టడం ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, అజయ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

• మంత్రి సత్యవతికి టీఏజీఎస్ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) గిరిజనశాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కోరింది. ఈ మేరకు బుధవారం టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపీ మిడియం బాబురావు, రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సంఘం రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, ఎస్.కృష్ణారెడ్డిలు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ ఏడాది మే 5, 6 తేదీల్లో టీఏజీఎస్ రాష్ట్ర మూడో మహాసభలు భద్రాచలం పట్టణంలో జరిగాయని వారు ఈ సందర్భంగా ఆమెకు తెలిపారు. ఈ సభల్లో రాష్ట్రంలోని గిరిజన తెగల సమస్యలు-పరిష్కారానికి చేయాల్సిన కృషిని గురించి చర్చించి 14 తీర్మానాలను ఆమోదించినట్టు చెప్పారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. 'దరఖాస్తు చేసిన పోడు సాగుదారులందరికి సర్వే చేసి హక్కు పత్రాలు వెంటనే జారీ చేయాలి. ఆదివాసుల భూమి, ఉపాధి, సంస్కృతి, పరిరక్షణ కోసం 1/70, పిసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. గర్తించిన ప్రతి ఆదివాసీ కుటుంబానికి అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలి. ఆహార భద్రత కల్పించాలి. ప్రతి గిరిజన గూడేనికి మెరుగైన వైద్య, ఆరోగ్య సదుపాయాలు కల్పించాలి. ప్రతి జిల్లాకు ఒక ఐటీడీఏ ఏర్పాటు చేయాలి. గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి. ఆదివాసీలకు మాతృభాషలోనే ప్రాథమిక విద్యనందించాలి. ఏజెన్సీలోని అన్ని పాఠశాలల్లో శిక్షణ పొందిన వాలంటీర్లను (బోధకులను ) నియమించాలి.... ' అనే ప్రధాన డిమాండ్లను వారు మంత్రికి అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

# ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

• ఎఫ్‌టీసీసీఐ హెల్త్‌కేర్ అవార్డు ప్రదానోత్సవంలో సీఎం ముఖ్యసలహాదారులు సోమేష్‌కుమార్

• విజన్-2030 డాక్యుమెంట్ విడుదల





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'సాధారణంగా ఇలాంటి డాక్యుమెంట్లను ప్రభుత్వాలు విడుదల చేస్తాయి. కానీ పరిశ్రమల రంగానికి చెందిన ఎఫ్‌టీసీసీఐ బాధ్యత తీసుకుని విజన్-2030 డాక్యుమెంట్‌ను విడుదల చేయడం శుభపరిణామం. వైద్యారోగ్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నది. ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా వినూత్న పథకాలను అమలు చేస్తున్నాం' అనిసీఎం ముఖ్యసలహాదారులు సోమేష్‌కుమార్ అన్నారు. ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో 'క్వాలిటీ అండ్ అఫర్డబుల్ హెల్త్ ఫర్ ఆల్ ఇన్ తెలంగాణ' నినాదంతో రూపొందించిన విజన్-2030 డాక్యుమెంట్‌ను సోమేష్‌కుమార్ బుధవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. హెల్త్‌కేర్ రంగంలో ఉత్తమ సేవలందించిన సంస్థలు, డాక్టర్లకు ఈ సందర్భంగా అవార్డులను అందజేశారు. అనంతరం సోమేష్‌కుమార్ మాట్లాడుతూ హెల్త్‌కేర్ రంగంలో శిక్షణ పొందిన, అనుభవజ్ఞులైన డాక్టర్లను అందిస్తున్నామని, అందులో భాగంగానే ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసిందని చెప్పారు. ఎంబీబీఎస్ సీట్లను 2800 నుంచి 8500కు పెంచిందన్నారు. తెలంగాణలో ఎనిమిది ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్‌లో 134 మెడికల్ టెస్ట్‌లను ఉచితంగా చేస్తున్నారని వివరించారు. 18ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల సహాయకులకు మూడు పూటల భోజన సౌకర్యాన్ని సర్కార్ కల్పించిందన్నారు.ఎల్వీ ప్రసాద్‌కంటి ఆస్పత్రి వ్యవస్థాపకులు డాక్టర్ జీఎన్ రావు మాట్లాడుతూ యూనివర్సల్ హెల్త్ కేర్ అనేది ప్రపంచంలో ప్రతి దేశం కల అని, కానీ కొన్ని దేశాలు మాత్రమే ఆ దశకు చేరుకున్నాయని తెలిపారు. మన దేశంలో ప్రాథమిక ఆరోగ్యంపై ఒత్తిడి ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. ఆస్కీ డీన్ సుబోధ్ కందాముతాన్ మాట్లాడుతూ హెల్త్ కేర్ రంగానికి హైదరాబాద్ ముఖ్య కేంద్రంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు అనిల్ అగర్వాల్, హెల్త్‌కమిటీ చైర్మెన్ శేఖర్ అగర్వాల్, ఉపాధ్యక్షులు మీలా జయదేవ్, సీఈఓ ఖ్యాతి నరవాణే, విజన్ డాక్యుమెంట్ చైర్మెన్ ద్వారకాంతరెడ్డి, డాక్టర్ సంజన తదితరులు పాల్గొన్నారు.

# అన్ని పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు

• హైకోర్టుకు చెప్పిన రాష్ట్రం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. రాష్ట్రంలో 774 పోలీసు స్టేషన్లకుగాను ఇప్పటి వరకు 399 స్టేషన్లలో ఏర్పాటు చేశామని తెలిపింది. ఇంకా 103 స్టేషన్లలో ఏర్పాటు చేయాలని, అనుమతిచ్చినట్టు చెప్పింది. ఇదే అంశంపై సుప్రీంకోర్టు విచారణ చేస్తోందని తెలియజేసింది. ఈ వివరాలను నమోదు చేసుకున్న హైకోర్టు ఇక్కడి పిల్‌పై విచారణను ముగించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 780 పోలీసు స్టేషన్లలో 40 శాతం సీసీ కెమెరాలు నగరంలోనే ఏర్పాటు జరిగింది. నగరంలో 10,507 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా అందులో 4,402 పని చేయడం లేదు. తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ మెజర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్-2013 ప్రకారం సీసీ కెమెరాల ఫుటేజీ 30 రోజులు రికార్డింగ్ అవసరమయ్యే ఏర్పాటు చేయాలి. వీటిని ఏర్పాటు చేస్తే లాకప్‌డెత్‌లు తగ్గుతాయి. ప్రజలు కూడా నిర్భయంగా పోలీసు స్టేషన్లకు వెళతారు... అని లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ తరపు న్యాయవాది ఎం.రూపేందర్ వాదనలు వినిపిస్తూ పోలీసు స్టేషన్లలో సీసీ కెమెరాలకు సంబంధించిన అంశాన్ని సుప్రీంకోర్టు విచారిస్తోందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దీనిపై నివేదిక సుప్రీంకోర్టు సమర్పించినట్టు తెలిపారు. సుప్రీంకోర్టు ఈ నెల 28న విచారణ చేయనుందన్నారు. ఈ వాదనలను పరిగనణలోకి తీసుకున్న హైకోర్టు పిల్‌పై విచారణ ముగించింది.

**ఆదివారంనాడు కూల్చివేతలా?: హైకోర్టు ఆగ్రహం**

ఆదివారం ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు కచ్చితమైన ఆదేశాలిచ్చినప్పటికీ జీహెచ్‌ఎంసీ కూల్చివేత చర్యలకు పాల్పడడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. తమ ముందున్న పిటిషనర్‌కు చెందిన నిర్మాణాలు కూల్చివేయవద్దన్న మధ్యంతర ఉత్తర్వులు ఉన్నప్పటికీ కూల్చివేత చర్యలకు పాల్పడటంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. విచారణకు స్వయంగా హాజరుకావాలని ఆదేశించినా అధికారులు లెక్కలేకుండా వ్యవహరించడంపై నిప్పులు చెరిగింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని కోర్టు ఆదేశించినా జీహెచ్‌ఎంసీ అధికారులు తమ డెక్కన్ కిచెన్‌ను కూల్చివేశారంటూ జూబ్లీహిల్స్ ఫిల్మ్‌నగర్‌లో డబ్ల్యూ3 హాస్పిటాలిటీ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ హైకోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. దీనిని జస్టిస్ కె.లలిత విచారణ చేపట్టిన సందర్భంగా పైవిధంగా ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గత విచారణ సందర్భంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ రవితేజ, అసిస్టెంట్ టౌన్ ప్లానర్ రాజ్‌కుమార్ స్వయంగా హాజరుకావాలని ఆదేశిస్తే.. విచారణకు రవితేజ, రాజ్‌కుమార్ మాత్రమే హాజరయ్యారు. లోకేశ్‌కుమార్ మాత్రం అత్యవసర సమావేశం కారణంగా రావడం లేదని తెలిపారు. దీనిపై న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అంత అత్యవసరంగా ఆదివారం కూల్చివేయాల్సిన అవసరం ఏముంది?. సెలవు రోజుల్లో ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నాయి కదా. ప్రతివాదులందరూ కోర్టు ధిక్కరణ ఎదుర్కోవాల్సిందే. తదుపరి విచారణకు లోకేశ్‌కుమార్, బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు ప్రతివాదులందరూ హాజరుకావాల్సిందే. కూల్చివేతకు సంబంధించి అనుసరించిన నివేదికను అందజేయాలి' అని ఆదేశించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు

**తుది తీర్పుకు లోబడే ఆ సీట్ల భర్తీ : హైకోర్టు**

ఎంబీబీఎస్ మెడికల్, డెంటల్ కన్వీనర్ కోటా సీట్లను ఏపీ విద్యార్థులకు ఇవ్వరాదని మొత్తం సీట్లను తెలంగాణ విద్యార్థులకే చెందుతాయని పేర్కొంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 72ను సవాల్ చేసిన కేసులో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడకు చెందిన సాయి సిరిలోచన, మరో ఇద్దరు విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ ఎన్.రాజేశ్వర్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. వారిద్దరి అప్లికేషన్లను అనుమతించాలనీ, కౌన్సెలింగ్‌కు అనుమతించాలనీ, అయితే, అడ్మిషన్లు తాము చెప్పే తుది తీర్పునకు అనుగుణంగా ఉంటాయని మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 3న జారీ చేసిన జీవో 72పై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర విభజన తర్వాత 15 శాతం సీట్లను తెలుగు రాష్ట్రాల విద్యార్థులను ఎంపిక చేయాలని చట్టం స్పష్టం చేస్తోందని పిటిషనర్ వాదన. జాతీయ స్థాయిలో 15 శాతం సీట్లు కేటాయించాక మళ్లీ విడిగా ఏపీ విద్యార్థులకు ఎందుకు కేటాయింపు ఉండాలని హైకోర్టు వివరణ అడిగింది. ప్రభుత్వం తరపున ఏజీ బిఎస్ ప్రసాద్ వాదిస్తూ, 2014 నాటికి ఉన్న మెడికల్ కాలేజీలకు ఆ నిబంధన అమలవుతోందని, దీని ప్రకారం ఏపీ విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నారనీ, 2014 తర్వాత ఏర్పాటైన కాలేజీలకు ఆ నిబంధన వర్తించదని అందుకే జీవో 72 ద్వారా తెలంగాణ విద్యార్థులకు మేలు జరిగేలా ప్రభుత్వం చేసిందని వివరించారు. ప్రభుత్వ వివరణ నిమిత్తం విచారణ నాలుగు వారాలకు వాయిదా పడింది.

# ఇజ్రాయిల్ న్యాయవ్యవస్థపై దాడికి యత్నాలు

• నెతన్యాహు ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ ప్రజల ఆందోళనలు

**జెరూసలేం** : న్యాయ వ్యవస్థపై ప్రభుత్వ దాడి ప్రయత్నాలను నిరసిస్తూ ఇజ్రాయిల్ వ్యాప్తంగా వేలాదిమంది ప్రజలు మంగళవారం ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వం తన ప్రణాళిక ప్రకటించిన నేపథ్యంలో నెలల తరబడి కొనసాగుతున్న ఆందోళనల్లో భాగంగా మంగళవారం నాడు నిరసనలు పెద్ద ఎత్తున చోటు చేసుకున్నాయి. జెరూసలేం, హైఫా, టెల్ అవీవ్ నగరాలకు దారితీసే హైవేలను, ప్రధాన నగరాల్లోని జంక్షన్లను ఆందోళనకారులు దిగ్బంధించారు. సుప్రీం కోర్టు పర్యవేక్షక అధికారాలను పరిమితం చేసేందుకు తీసుకువచ్చిన బిల్లుకు నెతన్యాహు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఆందోళనలు తలెత్తాయి. అయితే విస్తృతంగా నిరసనలు తలెత్తినా న్యాయవ్యవస్థలో మార్పులు తీసుకు రావాలనే ప్రభుత్వం పట్టుదలగా వుంది. ఈ మార్పులు దేశాన్ని నిరంకుశ పాలన వైపునకు నెడుతున్నాయని వారు విమర్శిస్తున్నారు. జెరూసలేంకు దారి తీసే ప్రధాన రహదారిని దిగ్బంధించిన ఆందోళనకారులపై పోలీసులు జల ఫిరంగులు ప్రయోగించారు. మరో రహదారిని దిగ్బంధించిన వారిని పలువురిని అధికారులు అరెస్టు చేశారు. హైఫాలో ప్రధాన రహదారిని కూడా ప్రదర్శకులు దిగ్బంధించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇందుకు సంబంధించి 42మందిని అరెస్టు చేశారు.

# జర్నలిస్టులకు త్వరితగతిన ఇండ్లస్థలాలివ్వాలి

• త్వరలో సెమినార్: టీడబ్ల్యూజేఎఫ్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశం తీర్మానించింది. సుప్రీంకోర్టు తీర్పును బాధ్యతగా అమలుచేయాలని సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ విషయమై ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టులు, సంఘాలు, సొసైటీలతో ఈనెలాఖరులోగా సెమినార్‌ను నిర్వహిస్తామని తెలియజేసింది. ఆ సంఘం సీనియర్ ఉపాధ్యక్షులు టి. కృష్ణ అధ్యక్షతన సమావేశంలో ఫెడరేషన్ గత కార్యకలాపాల నివేదికను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య సమర్పించారు. ఈసందర్భంగా ఇండ్లస్థలాల విషయమై ఆఫీసు బేరర్లు సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వంతో సంప్రదింపులు కొనసాగించాలని నిర్ణయించారు. ఇండ్ల స్థలాలపై త్వరలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యక్షులు పి.రాంచందర్, పి.ఆనందం, వి.జగన్, కార్యదరుశలు ఇ. చంద్రశేఖర్, గండ్ర నవీన్, సలీమ, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్‌ఏ జేఏసీతో మంత్రి కేటీఆర్ చర్చలు

• సానుకూలంగా స్పందించిన మంత్రుల సబ్ కమిటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వీఆర్‌ఏల జేఏసీతో మంత్రి కేటీఆర్ అధ్యక్షతన మంత్రుల సబ్ కమిటీ చర్చలు జరిపింది. సచివాలయంలోని సీఎస్ శాంతికుమారి ఛాంబర్‌లో మంత్రులు జగదీష్‌రెడ్డి, సత్యవతిరాథోడ్‌లతో కలిసి బుధవరం చర్చించారు. పేస్కేల్, వారసులకు ఉద్యోగాలు, అర్హులకు ప్రమోషన్‌లు కల్పించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. వీఆర్‌ఏలను రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీరాజ్, పురపాలక, మిషన్‌భగీరథ వంటి శాఖల్లో సర్దుబాటు చేయాలని సర్కార్ నిర్ణయించింది. ఈ ప్రక్రియను అధికారులు వారం రోజులలో పూర్తి చేసి ఆర్డర్స్ ఇవ్వడం జరుగుతుందని సబ్ కమిటీ తెలిపింది. దీంతోపాటు ఉమ్మడి జిల్లాలవారీగా సర్దుబాటు చేయాలని సబ్ కమిటీ ప్రతిపాదించింది. వారసత్వ ఉద్యోగాల గురించి కూడా చర్చించారు. జేఏసీ డిమాండ్లకు సబ్‌కమిటీ సానుకూలంగా స్పందించింది. ఈ సమావేశంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, సీఎం కార్యదర్శి స్మితాసబర్వాల్, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్, సీసీఎల్‌ఏ కార్యదర్శి బి.గోపి మిషన్‌భగీరథ ఈఎన్‌సీ కపాకర్‌రెడ్డి, వీఆర్‌ఏల జేఏసీ చైర్మెన్ రాజయ్య, కో-ఛైర్మెన్ రమేష్‌బహదూర్, సెక్రెటరీజనరల్ దాదేమియా, కో-కన్వీనర్లు మాధవ నాయుడు, ఎస్కే రఫీ, వంగూరు రాములు, వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

• సీఎం కేసీఆర్‌కు చాడ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలనీ, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు బుధవారం ఆయన లేఖ రాశారు. హుస్నాబాద్ పర్యటనకు వెళ్లిన సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులు తనను కలిసి వారి బాధలను విన్నవించారని చాడ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 12,760 గ్రామపంచాయతీల్లో స్వీపర్లు, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లు, నర్సరీలు, వైకుంఠధామాలు తదితర పద్ధతుల్లో దాదాపు 50 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వారు అనేక ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో పనులు చేస్తున్నారని వివరించారు. వారి పని విధానం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో గుర్తింపులు, అవార్డులూ వచ్చాయని గుర్తు చేశారు. వారి ఉద్యోగాల క్రమబద్ధీకరణ లేకపోవడం, పనికి గుర్తింపు ఇవ్వకపోడం, కనీస వేతనం అమలు చేయకపోవడం, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా లాంటి సౌకర్యాలను కల్పించకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గతనెల 21 నుంచి సమ్మె బాట పట్టారని తెలిపారు. జీవో నెంబర్ 51తో మల్టీపర్పస్ విధానాన్ని ప్రవేశపెట్టి, ఉద్యోగులు అన్ని రకాల పనులు చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారని విమర్శించారు. గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలనీ, ట్రెజరీ ద్వారా వేతనాలివ్వాలనీ, కనీస వేతనం రూ. 19,500 చెల్లించాలనీ, 51 జీవోను రద్దు చేసి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## రైతు వ్యతిరేకి కాంగ్రెస్

• తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ అంటేనే రైతు వ్యతిరేక పార్టీ అని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ విమర్శించారు. రైతులు బాగుపడితే చూసి ఓర్వలేని వారు కాంగ్రెస్ నేతలని అన్నారు. రైతుల పట్ల చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకునే పార్టీ అని చెప్పారు. గతంలో ప్రజలకు ఎంతో ఉపయోగమైన ధరణిని తీసేస్తామనీ, ఇప్పుడు ఉచిత విద్యుత్ వద్దంటున్నదని విమర్శించారు. మూడెకరాల రైతుకు మూడు పూటల కరెంట్ ఎందుకు మూడు గంటలు చాలనీ, చిన్న సన్న కారు రైతులను రేవంత్‌రెడ్డి అవమానించారని అన్నారు. చిన్నకారు రైతులంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు చిన్న చూపని ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఏడు గంటల కరెంట్ ఇవ్వని కాంగ్రెస్ పార్టీ నేడు తెలంగాణలో ఉచితంగా 24 గంటలు ఇస్తే ఓర్వలేకపోతున్నదని విమర్శించారు. రాష్ట్రంలో రైతన్నలు సంతోషంగా ఉండడం ఇష్టం లేకనే కాంగ్రెస్ పార్టీ ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నదని అన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : డీటీఎఫ్


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనం రూ.వెయ్యి నుంచి రూ.మూడు వేలకు పెంచుతున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించినప్పటికీ నేటికీ అమలు కాకపోవడం శోచనీయమని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజు రోజుకు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరుగుతున్నప్పటికీ వంటకయ్యే ఖర్చు కూడా అదేరీతిలో పెంచకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందకుండా పోతున్నదని పేర్కొన్నారు. వంట బిల్లులు అనేక నెలలుగా మంజూరు చేయకుండా పెండింగులో పెట్టడం వల్ల మధ్యాహ్న భోజన కార్మికులు అప్పుల పాలవుతున్నారని తెలిపారు. వడ్డీలు చెల్లించలేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురువుతున్నారని వివరించారు. మూడు రోజులుగా వారు సమ్మె చేస్తున్నందున పాఠశాలల్లో ఉపాధ్యాయులే వంట చేయాల్సి వస్తున్నదని తెలిపారు. దీంతో విద్యా బోధనకు తీవ్రమైన అంతరాయం కలగడమే కాకుండా, వంట బాధ్యతలను ప్రధానోపాధ్యాయులపై పెట్టడం సరికాదని పేర్కొన్నారు.

## కనీసం పది గంటల కరెంట్ ఇస్తున్నట్టు నిరూపిస్తారా?

కేటీఆర్‌కు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



రాష్ట్రంలో పది గంటల కరెంట్ ఇస్తున్నట్టు మంత్రి కేటీఆర్ నిరూపిస్తే, సబ్ స్టేషన్లోనే రాజీనామా చేస్తానంటూ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సవాల్ విసిరారు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్...ఇలా ఎక్కడి సబ్‌స్టేషన్‌కైనా వెళదాం...వస్తారా? అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 24 గంటలు కరెంట్ ఇస్తున్నట్టు చూపిస్తే జీవితాంతం బీఆర్‌ఎస్‌కు సేవ చేస్తాననీ, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేస్తామని పేర్కొన్నారు. ఒక్కో ఎమ్మెల్యే వెయ్యి కోట్లు తిని అది అరగక ధర్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కనీసం ఆరు గంటలపాటు నాణ్యమైన కరెంటైనా ఇస్తున్నారో, లేదో చూపించాలని కోరారు.

**రైతు డిక్లరేషన్‌లో చెప్పిందే అమలు చేస్తాం : ఏఐసీసీ ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే ట్వీట్**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఏమి చెప్పిందో అదే అమలు చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే ట్వీట్ చేశారు. తమ పార్టీ వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తుందని తెలిపారు.

**రేవంత్ వ్యాఖ్యలను తప్పుదోవ పట్టిస్తున్నారు :సునీతారావు**

ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారని మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ముందు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు పార్టీలు కుమ్మక్కై రాహుల్‌గాంధీపై కుట్ర చేస్తూ సత్యాగ్రహాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.